ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఒంగోలు, fb.com/vaartha

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam


5-2-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 4 పేజీలు: 12 వెల: 6.50

ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

కేంద్రసహకారంతో రాష్ట్రానికి భారీగా నిధులు: మంత్రి లోకేష్

2లో

# ఆదాయవనరులు పెంచుకోవాలి



## రాష్ట్ర ఆర్థికపరిస్థితిపై సమీక్ష జరిపిన సిఎం చంద్రబాబు

## రెవెన్యూ ఆదాయం అంచనా రూ.1,02,154 కోట్లు

## పన్ను ఎగవేతలు లేకుండా చూడాలి

## అధికారులకు ముఖ్యమంత్రి దిశా నిర్దేశం

**విజయవాడ.ఫిబ్రవరి4,ప్రభాతవార్తప్రతినిధి:**రాష్ట్రాభ్యున్నతికి ఆదాయ వనరులను గణనీయంగా వృద్ధి చేసుకోవాలని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు.రాష్ట్రానికి ఆదాయాన్ని సమకూర్చే ప్రతి వనరును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్థికంగా రాష్ట్రాన్ని పరిపుష్టం చేసుకుందామన్నారు.ఇందుకు నిర్మాణాత్మకంగా ఉత్తమోత్త కార్యచరణతో అడుగులు వేద్దామన్నారు. రాష్ట్రానికి ఆదాయాన్ని సమకూర్చే విషయంలో అధికారయంత్రాంగం అంకిత భావంతో వ్యవహరించాలన్నారు. ఇందుకు నిరంతరం నూతన విధానాలను గుర్తించే దిశలో ఉండాలన్నారు.ఆదాయం వృద్ధికి ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయం ఎవ్వరిని ఇబ్బంది పెట్టేదిగా ఉండకూడదన్నారు. వనరులు, ఆదాయ వృద్ధిపై ముఖ్యమంత్రి మంగళవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. వైకాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ఆర్థికంగా కుదేలైన రాష్ట్రం మళ్లీ కోలుకుని అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వంలోని ఆదాయార్జన శాఖలు ఉత్తమ ఫలితాలు రాబట్టాలని సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్ర ఖజానాకు రాబడులు పెంచేందుకు సరికొత్త ఆలోచనలు చేయాలని సీఎం చెప్పారు. రాష్ట్రాన్ని ఆర్థిక కష్టాల్లోంచి బయట పడేసేందుకు సమర్థవంత చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సాధారణ పనితీరుతో, సాధారణ టార్గెట్స్ రొటీన్‌గా పనిచేస్తే ఫలితాలు రావన్నారు.వినూత్న ఆలోచనలతో పనిచేయాలని సిఎం అన్నారు. టెక్నాలజీ వాడకం ద్వారా రెవెన్యూ ఆర్జనలో లోపాలను సరిదిద్ది ఆదాయం పెంచాలని సిఎం సూచించారు. వాణిజ్య పన్నుల విభాగంలో పన్ను ఎగవేతలపై అధికారులు చెప్పిన అంశాలపై సిఎం మాట్లాడుతూ ఏ ఒక్కరూ పన్ను ఎగవేతకు పాల్పడకుండా చూడాలన్నారు. అలా అని వ్యాపారులను వేధింపులకు గురి చేయవద్దని సిఎం సూచించారు. వేదింపు వలన వారికి మానసిక వత్తిడి పెరుగుతుందన్నారు.వారి నుంచి రావాల్సిన పన్ను వసూలు అవసరతను బట్టి సరళీకృత విధానాలను అవలంభించారు. >>2

# 25 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి

## గరిబీ హఠావో ఆచరణలో చూపించాం

## లోక్‌సభలో ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:** వికసిత్‌భారత్ నిర్మాణమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకు వెళుతోందని, గడచిన పదేళ్లలో 25 కోట్లమందిని పేదరికంనుంచి విముక్తిచేయగలిగామని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. రాష్ట్రపతి ప్రసంగం మాలో ఆత్మవిశ్వాసం పెంచిందని మరోసారి మా ప్రభుత్వాన్ని ప్రజలు ఎన్నుకున్నందుకు ధన్యవాదాలని తెలిపారు. రాష్ట్రపతిప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలు విపక్షాల విమర్శలకు పదునైన మాటలతో జవాబిచ్చారు. కాంగ్రెస్, ఆప్ పార్టీలను తన మాటల తూటాలతో ఎద్దేవాచేస్తూ ప్రసంగం కొనసాగించారు. మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలను నెర వేరుస్తామని, గతప్రభుత్వాలు గరీబీ హఠావో అని నినాదాలు మాత్రమే చేసాయని కొందరునేతలు బంగ్లాలు కట్టుకోవడంపై దృష్టిసారించారని, మేం మాత్రం ఇంటింటికీ నల్లానీరు ఇవ్వడంపై దృష్టి పెట్టా >>2

## వరుసగా 60 రోజులు అసెంబ్లీకి రాకపోతే

# జగన్‌పై అనర్హత వేటు

## డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

**విజయవాడ ఫిబ్రవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి:** జగన్ అయినా మరే ఎమ్మెల్యే అయినా.. సహేతుక కారణంతో సెలవు కోసం దరఖాస్తు చేయకుండా వరుసగా 60 రోజులు అసెంబ్లీకి గైర్హాజరైతే వారు చట్ట ప్రకారం అనర్హతకు గురవుతారని శాసనసభ ఉప సభాపతి రఘురామకృష్ణరాజు పేర్కొన్నారు. రాష్ట్రంలో మొదటిసారి ఎన్నికైన ఎమ్మెల్యేలకు ఈ నెలలో నిర్వహించబోయే శిక్షణ తరగతుల కార్యక్రమానికి లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాను ఆహ్వానించేందుకు ఢిల్లీకి వచ్చిన ఆయన సోమవారం ఏపీ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. సభకు గైర్హాజరవుతున్న వైకాపా అధ్యక్షుడు జగన్ గురించి విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు ఆయన పైవిధంగా స్పందించారు. జగన్ గత అయిదేళ్లలో ముందుగా రికార్డు చేసిన ప్రెస్‌మీట్లు తప్పితే నేరుగా మీడియాను కలిసిన >>2

# తిరుపతి మేయర్ పదవికి గండం?

## కొరవడిన సమన్వయం, పట్టుతప్పిన నాయకత్వం

## పార్టీని ముంచిన వైఎస్సార్సీ కార్పొరేటర్లు

**తిరుపతి, ఫిబ్రవరి 4ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలో గత ఏడాది సాధారణ ఎన్నికల్లో అనూహ్యంగా వైసిపి అధికారం కోల్పోవడంతో తాజాగా తిరుపతి కార్పొరేషన్‌లో 47మంది బలమున్న కార్పొరేటర్లు ఎదురుదెబ్బతో పట్టుకోల్పోయింది. బలం లేదని గెలవలేరని విశ్వాసంతో ఉన్న వైసిపికి కోలుకోలేని గడ్డుపరిస్థితి. గత ఏడాది కార్పొరేషన్‌లో ఖాళీ అయిన రెండవ డిప్యూటీ మేయర్ పదవికి అనూహ్యరీతిలో సోమవారం జరగాల్సిన ఎన్నికల్లో వ్యూహాత్మకంగా గైర్హాజరైనా, మంగళవారం నాటి పరిణామాలతో జరిగిన ఎన్నికలో డిప్యూటీ మేయర్ పదవిని వదలుకోవాల్సిన చేదు సంఘటన జరిగింది. ఏకంగా 25మంది వైసిపి కార్పొరేటర్లు ఒకేఒక్క టిడిపి కార్పొరేటర్‌కు తమ మద్దతు తెలపడంతో 26మంది ఓటుతో డిప్యూటీ మేయర్‌ను టిడిపి కైవశం చేసుకోవడం వైసిపి నేతలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. కార్పొరేటర్లలో తొలినుండి భూమన కరుణాకర్‌రెడ్డికి అత్యంత సన్నిహితులుగా, విశ్వాసపాత్రులుగా వ్యవహరించిన ఎస్‌కె బాబు, పొన్నాలచంద్ర, కుడితి సుబ్రమణ్యం, నారాయణ, అనీష్‌రాయల్, గణేష్, మునిరామిరెడ్డి, శేఖర్‌రెడ్డి, ప్రవళిక, ప్రతాఫ్‌రెడ్డి, నరేంద్ర, అనిల్ మరికొందరు కార్పొరేటర్లు కూటమివైపు రావడంతో ఊహించని షాక్ తగిలింది. ఈ నేపథ్యంలో మంగళవారం తిరుపతిలో కొన్ని నాటకీయ పరిణామాలతో, అనూహ్యరాజకీయ మలుపులతో కూటమి అభ్యర్థిగా ఆర్‌సి మునికృష్ణ కార్పొరేషన్‌లో డిప్యూటీ మేయర్ కుర్చీ అందుకున్నారు. దీనివెనుక కుట్రలు, కారణాలు ఉన్నా బలమున్న చోట పట్టుకోల్పోవడంతో కొరవడిన సమన్వయం, పట్టుతప్పిన నాయ >>2

# 24 నుంచి బడ్జెట్ అసెంబ్లీ

**విజయవాడ ఫిబ్రవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి:** అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 24 నుంచి ప్రారంభమయ్యే అవకాశముంది. ఈ సమావేశాలు మూడు వారాలకు పైగా నిర్వహించవచ్చని ప్రాథమిక సమాచారం. మార్చిలో రాష్ట్ర ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ఏ రోజున బడ్జెట్ పెట్టాలనేది ఇంకా ఖరారు కావాల్సి ఉంది. సమావేశాలు ఎన్ని పని దినాలు ఉండాలి? ఏయే బిల్లులను ఈసారి సభ ముందుకు తేవాలి? తదితరాలపై ప్రభుత్వం ఈ వారంలో ప్రాథమిక నిర్ణయం >>2

# పిఏసి చైర్మన్‌గా పులవర్తి

## ఫైనాన్షియల్ కమిటీలకు చైర్మన్ల నియామకం



పులవర్తి రామాంజనేయులు

**విజయవాడ,ఫిబ్రవరి4,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ శాసనసభలో ఫైనాన్షియల్ కమిటీలను నియమిస్తూ అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేశారు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ, అంచనాల కమిటీల చైర్మన్ లను అధికారికంగా ప్రకటిస్తూ నోటిఫికేషన్ ఇచ్చారు. ప్రజా పద్దుల సంఘం (పీఏసీ) ఛైర్మన్‌గా పులవర్తి రామాంజనేయులు ఎన్నికైనట్లు అధికారికంగా నోటిఫికేషన్‌లో స్పష్టం చేసారు.పీఏసీ ఛైర్మన్‌గా ఇప్పటికే పులవర్తి రామాంజనేయులు ఎన్నికయ్యారు. ఆయన భీమవరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జనసేన అభ్యర్థిగా గెలుపొందారు. ఇకపబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్స్ కమిటీ (పీయుసీ) ఛైర్మన్‌గా కూన రవికుమార్, అంచనాల కమిటీ (ఎస్టిమెట్స్ కమిటీ) ఛైర్మన్‌గా వేగుళ్ల జోగేశ్వరావు నియామకాన్ని ఆమోదిస్తూ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. మూడు ఫైనాన్షియల్ కమిటీలకు ఛైర్మన్ లను నియమిస్తూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు నోటిఫికేషన్ జారీ చేశారు. ఫైనాన్షియల్ కమిటీల నియామకం పూర్తైనట్టు స్పీకర్ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ఒక్కో కమిటీలో 9 మంది ఎమ్మెల్యేలను, ముగ్గురు ఎమ్మెల్సీల చొప్పున మొత్తం 12 మందిని ఎన్నిక ప్రక్రియ ద్వారా ఎంపిక చేశారు.

# కబ్జాలపై ఎవరినీ ఉపేక్షించం..

## త్వరలో 3 సూపర్ సిక్స్ పథకాలు అమలు: మంత్రి సవిత



మంగళవారం కడప కలెక్టరేట్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న మంత్రి సవిత

**కడప, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** జిల్లాలో జరిగిన భూ కబ్జాలపై విచారణ చేపడుతున్నామని, ఎవరినీ ఉపేక్షించేది లేదని జిల్లా ఇన్చార్జి మంత్రి ఎస్.సవిత స్పష్టం చేశారు. రాబోయే వేసవి దృష్ట్యా జిల్లాలో తాగునీటి కల్పనకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నామన్నారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం, రైతులకు ఆర్థికసహాయం పథకాలు అమలు చేయనున్నట్లు వెల్లడించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన డీఆర్సీ సమావేశం అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. సమావేశంలో జిల్లాలో చేపట్టబోయే అభివృద్ధి పనులపైనా, పలు సమస్యలపైన చర్చించామన్నారు. శాఖల వారీగా చేపట్టిన అభివృద్ధి పనుల ప్రగతిపైన సమీక్షించామన్నారు. ముఖ్యంగా రాబోయే వేసవి దృష్ట్యా కడపలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో జగన్ సొంత నియోజక వర్గం పులివెందుల పట్టణంలో తీవ్ర తాగునీటి కొరత ఏర్పడిందన్నారు. ఎన్డీయే పాలనలో పులివెందుల వాసులకు తాగునీటి కష్టాలు రాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాతో పాటు రాష్ట్రంలోనూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్నామన్నారు. ఇప్పటికే అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశామని, మహిళలకు మూడు గ్యాస్ సిలిండర్లు, ఉచిత ఇసుక అందజేస్తున్నామని తెలిపారు. జగన్ రెడ్డి చీకటి చట్టం ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చేశామన్నారు. రాష్ట్రంలో యువతకు 20లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ పనిచేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా 16వేలకు పైగా టీచర్ పోస్టుల భర్తీకి త్వరలో మెగా డీఎస్సీ నిర్వహించబోతున్నామన్నారు. దీనిలో భాగంగా 26 జిల్లాల్లోనూ ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్లు ప్రారంభించామన్నారు.

**త్వరలో 3 సూపర్ సిక్స్ పథకాలు:** త్వరలో మూడు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం, రైతులకు ఆర్థిక సహాయం పథకాలు అమలు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు కాబోతున్నాయన్నారు. ప్రధాని నరేంద్రమోడి ఆశీర్వాదంతో విశాఖ ఉక్కు పరిశ్రమకు ఊపిరొచ్చిందన్నారు. రాజధాని అమరావతి, పోలవరం పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయన్నారు. రాష్ట్రమంతా రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. ఇలా రాష్ట్రమంతటా అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని మంత్రి తెలిపారు.

**కబ్జారాయుళ్లను ఉపేక్షించం:** జిల్లాలో వేల ఎకరాల్లో భూములు అన్యాక్రాంతయ్యాయని, కబ్జాలపై విచారణ సాగుతోందని, ఆక్రమణలకు పాల్పడేవారు ఎంతటివారైనా ఉపేక్షించేదిలేదని మంత్రి సవిత స్పష్టంచేశారు. గత ప్రభుత్వ హయాం కడపలో కబ్జాలకు అంతేలేకుండా పోయిందన్నారు. ప్రభుత్వ భూములు, అటవీ భూములను కబ్జాలు చేశారన్నారు.తమ ప్రభుత్వం కబ్జాలపై కఠినంగా వ్యవహరిస్తోందని తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్రమంతంటా రెవెన్యూ సదస్సులు నిర్వహించామన్నారు.

ఈ సదస్సుల్లో వచ్చిన వినతులకు పరిష్కారాలు సైతం చూపుతున్నామన్నారు. కడప జిల్లాలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు 12,425 వినతులు రాగా,వాటిలో 3,884 దరఖాస్తులకు పరిష్కారాలు చూపామన్నారు.

మిగిలిన అర్జీలకు త్వరలో పరిష్కారాలు చూపుతామని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నేడే ఢిల్లీ పోలింగ్



## హ్యాట్రిక్ కోసం ఆప్, గద్దెనెక్కాలని బిజెపి

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:** కేంద్రపాలితప్రాంతం, అందులోనూ దేశరాజధాని నగరం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలపై అన్ని రాజకీయ పార్టీలు ఫోకస్‌ను పెంచాయి. ముఖ్యంగా ఆమ్ ఆద్మీపార్టీ మూడోసారి గెలిచి హ్యాట్రిక్‌సాధించాలని పట్టుదలగా ఉంటే రెండు దశాబ్దాల తర్వాత మళ్లీ ఢిల్లీ సింహాసనంపై తమదే పట్టు ఉండాలని భారతీయ జనతాపార్టీ భావిస్తోంది. ఈనేపథ్యంలో ఢిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ నియోజకవర్గాలకుగాను ఈనెల 5వ తేదీ జరిగే పోలింగ్‌కోసం విస్తృత ఏర్పాట్లుచేసారు. మొత్తం ఒక కోటి 56 లక్షల మంది ఓటర్లకోసం 13,766 పోలింగ్‌కేంద్రాలు ఏర్పాటుచేసారు. తొలిసారిగా క్యూమేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను భారత్‌లో ఎన్నికల సంఘం ప్రవేశపెడుతోంది.పోలింగ్‌కేంద్రాలవద్ద తొలిసారి క్యూ మేనేజ్‌మెంట్ సిస్టమ్ క్యూఎంఎస్ యాప్‌ద్వారా కూడా తెలుసుకోవచ్చు. ఇప్పటికే సుమారు ఏడువేల మంది సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు ఇంటివద్ద ఓటుహక్కు వినియోగించుకున్నారు. 2015 ఢిల్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీపార్టీకి 70స్థానాల్లో 67 చోట్ల గెలిచి ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరిస్తే బిజెపి మూడు చోట్లమాత్రమే గెలిచింది. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో 62 చోట్ల ఆప్ గెలిస్తే బిజెపికి ఎనిమిది సీట్లు వచ్చాయి. ఈరెండుసార్లూ కూడా కాంగ్రెస్ ఒక్కసీటుకూడా గెలవలేకపోయింది. ఈసారి ఢిల్లీపీఠం ఎవరిపరం అవుతుందన్నది ఈనెల 8వ తేదీ తేలిపోనున్నది. ఎన్నికలప్రచారంలో మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, ప్రధానిమోడీలు ఇద్దరూ పోటాపోటీ ప్రచారంచేసారు. కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్రల్లో ఉచితాలకు ఓట్లు భారీగా రావడంతో ఢిల్లీలోకూడా పోటాపోటీగా ఈ పార్టీలు ఉచితాలనుప్రకటించాయి. కాంగ్రెస్‌కూడా తక్కువేమీ కాదన్నట్లు ఉచిత హామీలు ఇచ్చింది. కులగణన చేపడతామని ప్రకటించింది. పోలింగ్ తేదీ సమీపించినవేళ కేంద్రం బడ్జెట్‌లో ఆదాయపు పనున మినహాయింపును 12 లక్షలరూపాయలకు పెంచడం ద్వారా బిజెపి మధ్యతరగతి ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నంచేసింది. ఎన్నికలకు ముందుగానే పార్టీలు సంక్షేమపథకాల అర్హులను గుర్తించే దరఖాస్తులు ప్రక్రియ ప్రారంభించాయి. అవినీతి వ్యతిరేకపునాదులపై పుట్టిన ఆప్ అవినీతి ఆరోపణల్లోకూరుకునిపోయింది. ఆపార్టీప్రతిష్ట మసకబారింది. ఢిల్లీలోపదేళ్లుగా విద్యవైద్యంలోచేపట్టిన సంస్కరణలతోపాటు ఉచిత విద్యుత్, తాగునీరు గడచిన రెండు ఎన్నికల్లో మంచి ఫలితాలిచ్చాయి.మహిలలకు ఉచిత బస్సుప్రయాణం ఆపార్టీకి కలిసివచ్చింది.ఈ సారి ఆదే మంత్రం ప్రయోగించింది. సర్వేలను బట్టిచూస్తే ఢిల్లీలో ఓటర్లు కలుషితనీరు, దారుణమైన రోడ్లతో అసంతృప్తిగా ఉన్నారు. యమునానదిలో కాలుష్యం ఈసారి ఎన్నికల ప్రచారంలో హాట్‌హాట్‌గా నడిచింది. అధికారపక్షాన్ని విపక్షాలుసైతం నిలదీసాయి. 2013 వరకూ 15 ఏళ్లపాటు ఢిల్లీలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ గడచిన రెండు ఎన్నికల్లో ఒక్కసీటు కూడా గెలవలేకపోయింది. ఆప్ బిజెపి మధ్యపోరులో కాంగ్రెస్ అసలు ఉనికి లేకుండాపోయినట్లయింది. 1998నుంచి కూడా ఢిల్లీలో అధికారంలో లేకపోవడంతో ఈసారి ఎలాగైనా ఢిల్లీపీఠంసాధించుకోవాలని బిజెపి సర్వశక్తులు వినియోగిస్తోంది. సంఘ్‌పరివార్‌తోపాటు అనుబంధసంఘాలు కూడా ఈప్రచారాన్ని హోరెత్తించాయి. కృత్రిమ మేథ సాంకేతికతతో సృష్టించిన స్పూఫ్‌లు, పదునైన రాజకీయ విమర్శలతో ఈసారి ఢిల్లీ ఎన్నికల ప్రచారం వేడిగా సాగింది. అన్ని పార్టీలకు చెందిన ముఖ్యనేతలు హస్తినలో విస్తృత ప్రచారం నిర్వహించారు. బిజెపినిభారతీయ అబద్ధాలపార్టీ, దూషించేపార్టీ అని ఆమ్ ఆద్మీపార్టీ విశ్లేషించింది. ఆప్‌ను ఒక విపత్తుగాను కేజ్రీవాల్‌ప్రకటనల మంత్రిగాప్రధానిమోడీ విమర్శలు గుప్పించారు. ఇక కాంగ్రెస్ పార్టీ కేజ్రీవాల్‌ను నకిలీ అంటూ మోడీ ఛోటారీఛార్జ్ అంటూ విమర్శలుచేసింది. ఎఐతో సృష్టించిన మీమ్స్ డిజిటల్‌ప్రచారాలు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో ముఖ్యపాత్రను పోషిస్తున్నాయి.

## ప్రతి పంటకు బీమా

# వర్తింపజేయాలి

## లోక్ సభలో ఎంపి శ్రీకృష్ణ దేవరాయలు

**విజయవాడ,ఫిబ్రవరి4,ప్రభాతవార్తప్రతినిధి:**ప్రతి పంటకూ,ప్రతి ఎకరాకూ బీమా వర్తింపజేయాలని మంగళవారం లోక్ సభలో ప్రశ్నోత్తరాల సమయంలో కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ను టిడిపి ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు కోరారు.బీమా కంపెనీల సంఖ్యను పెంచాలన్నారు.రైతుకు పూర్తి ప్రయోజనాన్ని కలిగించే దిశలో పంట బీమా ఉండాలన్నారు.తను పల్నాడు ప్రాంతంకు చెందిన వాడినంటూ మంగళవారం లోక్‌సభలో మాట్లాడటం ప్రారంభించిన ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు రైతులు, వ్యవసాయం దేశ ప్రగతికి వెన్నెముఖ ప్రపంచానికే భారతదేశం ఆహార భాండాగారం కావాల బడ్జెట్ లో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతా రామన్ కోరారన్నారు.ఆమె చెప్పిన విషయం అర్థవంతంగా ఉందన్నారు. అయితే రైతులు పండిస్తున్న సుమారు 200 పంటలకు గాను, కేవలం సుమారు 60పంటలకే బీమాను వర్తింపజేస్తున్నారన్నారు. ఇన్సూరెన్స్ కంపెనీలు కూడా పబ్లిక్ రంగంలో5, ప్రైవేట్ రంగంలో 15 మాత్రమే ఉన్నాయి. బీమా కంపెనీల సంఖ్యను పెంచడమే కాకుండా అత్యధిక పంటలకు బీమాను వర్తింపజేయాలి. ఫసల్ బీమా పథకాన్ని బ్లాక్ లెవల్‌నుంచి గ్రామస్థాయికి విస్తరింపజేసినట్లే రైతు పండించే ప్రతి పంటకూ బీమా వర్తింపజేసే విధంగా విధాన నిర్ణయాలను తీసుకోవాలి అని ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు కోరారు. అందుకు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ సమాధానమిస్తూ ఫసల్ బీమా యోజనలో టెక్నాలజీ ఉపయోగిస్తున్నాం రిమోట్ సెన్సింగ్ డేటా ద్వారా పంటనష్టాన్ని అంచనా వేస్తు న్నాం తద్వారా బీమా కంపెనీలు బీమా చెల్లింపులు చేయడం సులభతరం చేశాం, మరిన్ని పంటలను ఫసల్ బీమా పరిధిలోకి తెస్తున్నాం. అలాగే బీమా కంపెనీలు కూడా 20కిచేరాయి. ఇంకా పెరుగుతాయని సభకు తెలిపారు.

5-2pg2exHMNWJQE.qxd:5-2pg2exHMNWJQE.qxd 01/01/01 9:37 AM Page 1





గుంతకల్లు రైల్వే స్టేషన్ వద్ద పట్టాలు తప్పిన గూడ్స్‌వ్యాగన్లు

# గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో పట్టాలు తప్పిన గూడ్స్ వ్యాగన్లు

## ప్రధాన రైళ్లకు అంతరాయం.. పలురైళ్ల దారి మళ్లింపు..

**గుంతకల్లు రైల్వే, ఫిబ్రవరి 4, ప్రభాత వార్త:** దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజనల్ ప్రధాన కేంద్రంలో ఓ గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. బళ్ళారి నుంచి గుత్తి వైపు వెళ్తున్న గూడ్స్ రైలు సుమారు 06-07 గంటల సమయంలో సౌత్ క్యాబిన్ ఎదురుగా పా యింట్ వద్ద క్రాస్ చేస్తున్న సమయంలో గూడ్స్ రైలుకు చెందిన ఫార్మేషన్ రెండుగా విడి పోయింది. దీంతో రెండు వ్యాగన్లు పట్టాలు తప్పాయి. ఈ ప్రమాదం కారణంగా ముంబైచెన్నై, బెంగళూరు, సికింద్రాబాద్, బెంగళూరువిజయవాడ ప్రధాన రైలు మార్గానికి అప్ అండ్ డౌన్ రైలు మార్గాలకు తీవ్ర అంతరాయం ఏర్ప డింది. ప్రమాద వార్త తెలుసుకున్న అధికారులు వెంటనే రైలు మార్గాన్ని పునరుద్ధరించే నిమిత్తం ఎ ఆర్ టి ని సంఘటన స్థలానికి తరలించి రైలు మార్గం పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదం కారణంగా పలు రైలు సర్వీసులను ప్ర త్యా మ్నాయ మార్గాల మీదుగా మళ్లించినట్లు అధి కార వర్గాలు తెలిపాయి.

# వరుసగా 60 రోజులు అసెంబ్లీకి రాకపోతే జగన్‌పై అనర్హత వేటు

>>పాపాన పోలేదు. కానీ, ఇప్పుడు అసెంబ్లీ సమావేశాలు జరిగేటప్పుడు మీడియా ముందు కొంత ఎక్కువగా కనిపిస్తున్నారు. ఒక శాసన సభ్యుడిగా అసెంబ్లీకి వచ్చి తన భావాలను వ్యక్తపరిస్తే ఆయనకు గౌరవంగా ఉంటుంది. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఇవ్వని గౌరవం కోసం మంకుపట్టు పడితే ఫలితంఉండదు. మొత్తం సభ్యుల్లో 10% బలం ఉంటేనే ప్రతిపక్ష హోదా ఇవ్వాలన్న సంప్రదాయాన్ని 1952 నుంచి అనుసరిస్తున్నారు. ఇది ఆయనకూ తెలుసు. వరుసగా శాసనసభకు గైర్హాజరయ్యే వారిపై చర్యలు తీసుకోవడానికి చట్టంలోని నిబంధనలు అవకాశం కల్పిస్తున్నాయి. 60 రోజుల వ్యవధిలో సెలవుకు దరఖాస్తు చేస్తే పరిశీలిస్తారు. లేకుంటే 60 రోజులు దాటిన తర్వాత ఆయన ఆటోమేటిక్‌గా ఎమ్మెల్యేగా అనర్హుడవుతారు. పులివెందులకు ఉప ఎన్నిక వస్తుంది అని వెల్లడించారు.

సభకు రాకుండా రిజిస్టర్‌లో సంతకం పెట్టి వెళ్లిపోవచ్చు కదా? అన్న ప్రశ్నకు రఘురామ అవునని సమాధానం ఇచ్చారు. అది తన సీటు నిలబెట్టుకోవడానికి పనికొస్తుందే తప్ప, ప్రతిపక్ష హోదా ఇవ్వకపోతే సభకు రాను అన్న మాటకు విలువ ఉండదని చెప్పారు.

# 25 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి

>> మని, దేశంలో పేదలకోసం 12 కోట్లకుపైగా మరుగుదొడ్లునిర్మించామన్నారు. కొందరునేతలు పేదల గుడిసెలవద్ద ఫోటోలు దిగేందుకే ఉత్సాహం చూపిస్తారని, సభలో పేదలగురించి మాట్లాడితే ఈనేతలు మొహం చిరాగ్గాపెడతారని ఎద్దేవా చేసారు. గతంలో ఢిల్లీనుంచి రూపాయి పంపిస్తే గ్రామాలకు 16 పైసలే చేరుతోందని ఒకప్రధాని వాపోయారని అప్పట్లో అదేపరిస్థితి ఉండేదని, ఇపుడు ఢిల్లీనుంచి ఒకరూపాయి పంపిస్తే ఆగ్రామానికి పూర్తిగా రూపాయి చేరుతోందని, నగదు బదిలీద్వారా నేరుగా వెళుతోందన్నారు. కొందరు వ్యక్తులు వెచ్చటి నీటికొనులు, లగ్జరీ షవర్లపై దృష్టిపెడతారని మేం ఇంటింటికీ నీళ్లివ్వడంపై దృష్టిపెడతామన్నారు. ప్రభుత్వ పథకాలతో ఆదాచేస్తుంటే ప్రజాధనంతో శీష్‌వమల్ కట్టుకోడానికి ఎప్పుడూ వినియోగించలేదన్నారు. ఆదాయపు పన్ను తగ్గించి బిజెపి సారథ్యంలోని ఎన్డీయేమధ్యతరగతికి పొదుపు పెంచిందని, 2014కు ముందు టాక్స్ బాంబులు విసిరేవారని, బుల్లెట్లు పేల్చేవారని, ప్రజాజీవనంపై ఎంతోభారం పడేదని ఆ గాయాలనుంచి తమ ప్రభుత్వం స్వస్థత చేకూర్చి ముందుకుపోతోందన్నారు. ఇకపై 12 లక్షలవరకూ ఎవరూ పన్ను చెల్లించనవసరం లేదన్నారు. ఎన్నికల్లో హామీలిచ్చి తర్వాతచేతు లెత్తేస్తారని ఇలాంటి పార్టీలు యువత భవిష్యత్తుకు విపత్తు ఆప్‌దా వంటివని హర్యానాలో మేం ఎలా పనిచేసామో అందరూ చూసారని, ఉద్యోగాలిస్తామని చెప్పాం ఇచ్చామని, మహారాష్ట్రలో మంచి ఫలితాలుసాధించామని, ప్రజల ఆశీస్సుల తోనే ఈ విజయాలన్నీ చేపట్టామన్నారు. కొందరు అర్బన్ నక్సల్స్ భాషలో మాట్లాడుతూ ఇండియన్‌స్టేట్‌నున బహిరంగంగానే సవాల్‌చేస్తారని ఇలా మాట్లాడేవారికి రాజ్యాంగం గురించికానీ దేశ ఐక్యత గురించి కానీ అవగా హన లేదన్నారు. భారత రాజ్యాంగం ఎలాంటి వివక్షకు తావీయదని, రాజ్యాంగాన్ని జేబుల్లోపెట్టుకుని తిరుగుతున్నవారికి ముస్లిం మహిళలను ఎలాంటి కష్టాల్లోకి నెట్టేసారన్నది తెలియదని ఎద్దేవాచేసారు. మహాత్మా గాంధీ చెప్పినట్లు చిట్టచివరి వ్యక్తికికూడా ఫలాలు అందాలన్నదే మా లక్ష్యమని, ఎస్సీ ఎస్టీ ఒబిసి కులాలకు గరిష్ట అవకాశాల కల్పనకు మా ప్రభుత్వం పనిచేస్తోందని కొందరికికులం గురించి మాట్లాడటం ఫ్యాషన్‌గా ఉంటుందని గడచిన 39 ఏళ్లుగా ఒబిసి ఎంపిలు ఒబిసి కమిషన్‌కు రాజ్యాంగ ప్రతిపత్తికల్పించాలని డిమాండ్‌చేస్తున్నారని గుర్తుచేసారు. కులాన్ని సొంత ప్రయోజనాలకు వాడు కోవాలని చూసేవారు ఆ డిమాండ్ ఎందుకు పట్టించుకోలేదని విపక్షాల మాటలకు చేతలకు పొంతనే ఉండదన్నారు. అధికారం సేవచేసేందుకే అయితే జాతినిర్మాణం జరుగుతుందని, అధికారం వారసత్వంగా మారితే ప్రజాస్వామ్యం అవుతుందని మేం రాజ్యాంగ స్ఫూర్తితోముందుకువెళ్తామేకానీ విషరాజకీయాలకు తావీయబోమని మోడీ స్పష్టంచేసారు.

# ఆదాయ వనరులు పెంచుకోవాలి..

>> **ఇప్పటికే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థగాడిన పడాలి:** సంక్షేమ కార్యక్రమాలకు, అభివృద్ధి పనులకు ఆర్థిక వనరులు ఎంతో కీలకమని...దీన్ని దృష్టిలో పెట్టుకుని రోజువారీ ప్రోగ్రెస్ చూపేలా ఆదాయార్జన శాఖల్లో అధికారులు పనిచేయాలని సిఎం సూచించారు. గత ప్రభుత్వ విధానాలతో ప్రజల జీవన ప్రమాణాలు పడిపోయా యని, ఆదాయం కోసం ప్రజలపై అదనంగా భారం మోపలేమని, ఆదాయార్జనలో మరింత మెరుగైన ఫలితాలు సాధించడం మినహా మరొక మార్గం లేదని సిఎం అన్నారు. కేంద్రం నుంచి నిధుల విషయంలో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నానని, 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ అరవింద్ పనగారియాను కలిసి గంటా 45 నిమిషాల పాటు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వివరించానని, ఈ తపనంతా రాష్ట్రం కోసమేనని సిఎం అన్నారు. అధికారులు కూడా దీన్ని అర్థం చేసుకుని పనిచేయాలని సిఎం సూచించారు.

**రాష్ట్ర రెవెన్యూ ఆదాయం అంచనా రూ. 1,02,154 కోట్లు:** రాష్ట్రానికి 2023-24 సంవత్సరానికి వాణిజ్య పన్నుల విభాగంలో మొత్తం రూ.41,420 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు..ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.41382 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ విభాగంలో ఫిబ్రవరి, మార్చి నెలల్లో వృద్ధి ఉంటుందని అధికారులు తెలిపారు. అదే విధంగా గతేడాదితో పోల్చితే నూతన ఎక్సైజ్ విధానం కారణంగా ఈ శాఖలో ఆదాయం పెరుగుతుందని అధికారులు వివరించారు. ఇకపోతే మైనింగ్ శాఖలో ఇప్పటి వరకు అనుకున్న స్థాయిలో రెవెన్యూ పెరగలేదని అధికారులు వివరించారు. కోర్టు కేసుల పరిష్కారం, అనుమతుల మంజూరు వంటి చర్యల ద్వారా మైనింగ్ శాఖలో ఆదాయాన్ని పెంచాలని సిఎం అన్నారు. రాష్ట్రానికి ఉన్న మైనింగ్ వనరుల దృష్ట్యా...ఈ విభాగంలో అత్యధిక ఆదాయం రావాలని సిఎం అన్నారు.

202425 ఆర్థిక సంవత్సరానికి వ్యాట్, జీఎస్టీ, ఎక్సైజ్, వృత్తివాణిజ్య పన్నుల ద్వారా వచ్చే ఆదాయం స్వల్పంగా పెరుగుతుందని అధికారులు అంచనా వేశారు. మొత్తంమ్మీద 202425 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ రూ.1,02,154 కోట్లు ఉండొచ్చని అధికారులు అంచనా వేశారు. ఆదాయార్జన విషయంలో ఇకపై ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తానని అధికారులు శాఖలను బలోపేతం చేసుకుని ఫలితాలుచూపాలని సిఎం చంద్రబాబు అన్నారు. ఈ సమీక్షలో ఆర్థికశాఖమంత్రి పయ్యావుల కేశవ్ తోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మంగళవారం సమగ్ర సమాచార కరదీపికను ఆవిష్కరిస్తున్న చిన జీయర్ స్వామి

# ఆధ్యాత్మిక జ్ఞానమే ప్రాపంచిక విజ్ఞానాన్ని పెంపొందిస్తుంది: చినజీయర్ స్వామి...

**విజయవాడ ఫిబ్రవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి:** మంచిని పెంచే వ్యక్తుల పరిచయాలను పదిగురికి అందించేందుకు ఒక బృహత్తర యత్నం జరగాలని త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి అన్నారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక పీఠాలు, అలౌకి జ్ఞాన సంపదను అందించే వారి వివరాలను నిక్షిప్తం చేసి అందుబాటులో ఉంచడం చక్కని ప్రయోగమన్నారు. మల్లెతీగ సాహిత్య సాంస్కృతిక సేవాసమితి, నవమల్లెతీగ మాసపత్రిక సంయుక్తంగా ప్రచురించిన 2025 సమగ్ర సమాచార కరదీపిక (డైరీ)ని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంలో త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం జీయర్ స్వామి మాట్లాడుతూ సర్వులకూ ఉపకరించే సమాచారం ఈ డైరీలో ఎంతో వుందన్నారు. సనాతర ధర్మ పరివ్యాప్తిలో భాగంగా విజయకీలాద్రిపై జరిగే బ్రహ్మోత్సవాల సమాచారం భక్తులకు తెలియపరచడంలో మీడియా వారు సహకరించాలన్నారు. ఒక క్షేత్రం అలౌకికామృతం లభిస్తుందంటే సరిపోదని, ఆ వివరాలు పదుగురికి తెలియాలన్నారు. నారాయణ సేవ గురించి తెలియాలి, ధార్మికంశాలు తెలియాలి, లౌకిక ప్రపంచీక విధానాలు తెలియాలి. తెలుసుకోవడం వలన మనస్సు వికసిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ వెంకటాచారి, నవమల్లెతీగ సంపాదకుడు కలిమిశ్రీ, సీనియర్ జర్నలిస్టులు యేమినేని వెంకటరమణ, చొప్పా రాఘవేంద్రశేఖర్ ఆనంద్, కుర్రా సురేష్ బాబు పాల్గొన్నారు.

# తిరుపతి మేయర్ పదవికి గండం?

>> కత్వం ప్రధాన కారణాలుగానే విశ్లేషకులు అంచనావేస్తున్నారు. నిజంగా ఇదీ వైసిపికి పెద్ద దెబ్బగానే జనం కూడా భావిస్తున్నారు. కాగా కూటమి తరపున మునికృష్ణకు 26 ఓట్లు మద్దతుపలకగా వైసిపి అభ్యర్థి లడ్డుభాస్కర్‌రెడ్డికి 21 ఓట్లు మాత్రమే వచ్చాయి. దీంతో వైసిపి కార్పొరేటర్లు చేసేదిలేక అక్కడ నుండి బయటకు వచ్చారు. ఈ ఎన్నికలకు ముందే దాడులు, విధ్వంసాలు, ప్రతీకారాలు, క్యాంపు రాజకీయాలు చేసినా ఫలితం మాత్రం వైసిపి అందుకో లేక పోవడం ఇప్పుడునేతలు జీర్ణించుకోలేని పరిస్థితి.

**జరిగిన తప్పిదాలకు కార్పొరేటర్లు కన్నీళ్లు:** అందరూ ఊహించినట్లే తిరుపతి కార్పొరేషన్‌లో డిప్యూటీ మేయర్ కుర్చీలో టిడిపి పాగా వేయడంతో అనివార్యపరిస్థితుల్లో, భయపెట్టడంతో టిడిపికి ఓటువేశామని కొందరు వైసిపి కార్పొరేటర్లు తప్పు చేశాం..క్షమించండి అంటూ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి, సమన్వయనేత అభినయ్‌రెడ్డి కాళ్ళపై పడి అవినాశ్, అమరనాధ్, అనిల్, మోహన్‌కృష్ణ వేడుకున్నారు. ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తామంటే ఓటువేశామని, వేయకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని భయపెట్టారని మొరవినించారు. వారిని ఓదార్చారు.

**ఎంఎల్‌సీదీ అదేదారి**

అనివార్యకారణాల వల్ల తాను జరిగిన ఓటింగ్‌కు వెళ్ళలేకపోయానని, అయితే తాను ప్రాణం ఉన్నవరకు జగన్‌తోనే ఉంటానని ఎంఎల్‌సి డాక్టర్ సుబ్రమణ్యం వివరణ ఇచ్చుకునే పరిస్థితి వచ్చింది. ఏకంగా సాయంత్రం పద్మావతిపురంలోని భూమన ఇంటికి వెళ్లి భూమనను,. పార్టీ శ్రేణులను క్షమించమని కోరడం వెనుక ఆంతర్యమేమిటో తెలియాల్సి ఉంది. తనకు చావైనా ,బ్రతుకైనా వైసిపితోనేని ఉత్కంఠతతో చెప్పారు.

# ఉక్రెయిన్‌కు సాయం చేస్తే మాకేంటి?

## ట్రంప్ బేరసారాలు!

**వాషింగ్టన్, ఫిబ్రవరి 4:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పుడు పూర్తిగా బిజినెస్ టైకూన్‌లా ఇతర దేశాలతో డీల్ చేస్తున్నారు. తాజాగా ఉక్రెయిన్‌కు చేసే సాయంపైనా ఇలాగే ఓ మెలిక పెట్టారు. కీవ్‌కు తమ సైనిక సాయం కావాలంటే అక్కడి అరుదైన ఖనిజాలను వినియోగించుకునే అవకాశం వాషింగ్టన్‌కు ఉండాలనే కండీషన్ పెడతామని వెల్లడించారు. ఇప్పటికే ఐరోపాలోని భాగస్వాముల కంటే అమెరికానే అత్యధిక సైనిక, ఆర్థిక సాయాలను జెలెన్‌స్కీ సర్కారుకు అందించిందని గుర్తు చేశారు. వారికి అవసరమైనప్పుడల్లా నిధులు, పరికరాలు ఇచ్చాము. ఐరోపా వారు ఈ విషయంలో వారి మాట నిలబెట్టుకోలేదు. వారు చెప్పిన మాటలను నిలబెట్టుకోవాలి. మాతో పోల్చుకుంటే వారు చాలా తక్కువ నిధులు, ఆయుధాలు ఇచ్చారు. కనీసం మాతో సమానంగా అన్నా ఇవ్వాలి. ఉక్రెయిన్ వద్ద చాలా అరుదైన ఖనిజాల భాండాగారం ఉంది. అందుకే మేము ఆ దేశంతో ఓ డీల్ చేసుకోవాలనుకుంటున్నాం. మాకు ఆ ఖనిజాలు లభిస్తే మేము వారికి అవసరమైనవి ఇస్తాము. మాకు అరుదైన ఖనిజాల లభ్యతలో భద్రత అవసరం. దానిని వారు మాకు ఇచ్చేందుకు ఆసక్తిగా ఉన్నారు. ఉక్రెయిన్, రష్యా విషయంలో మేము చాలా పురోగతి సాధించాం. భవిష్యత్తులో ఏం జరగబోతోందో మనం చూస్తాం. ఆ మూర్ఖపు యుద్ధాన్ని ఆపనున్నాం అని పేర్కొన్నారు. మరోవైపు ఇటీవల ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీ మాట్లాడుతూ వారికి సొంతంగా ఏమైనా సంబంధాలు ఉండొచ్చు. కానీ మేము లేకుండా ఉక్రెయిన్ గురించి మాట్లాడటం ప్రతి ఒక్కరికి చాలా ప్రమాదకరం అని పేర్కొన్నారు. తాము ట్రంప్ బృందంతో టచ్‌లో ఉన్నామని ప్రస్తుతం జనరల్ స్థాయిలో చర్చలు జరుగుతున్నాయని చెప్పారు. త్వరలో వీటిలో పురోగతి సాధించే అవకాశం ఉందన్నారు.

# త్రివేణి సంగమంలో భూటాన్‌రాజు పుణ్యస్నానం

**ప్రయాగరాజ్, ఫిబ్రవరి 4:** మహాకుంభ్‌మేళాలో భూటాన్‌రాజు జిగ్మే ఖేసర్ నాంగ్యేల్ వాంగ్‌చుక్ పవిత్రస్నానం ఆచరించారు. మంగళవారం ఉదయం ఆయన యుపి ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్‌తో కలిసి ప్రయాగరాజ్‌లోని త్రివేణి సంగమంలో పవిత్రస్నానంచేసారు. ఆ తర్వాత గంగా హారతిలో పాల్గొన్నారు. కుంభ్‌మేళాలో పాల్గొనేందుకు ముందురోజే వాంగ్‌చుక్ లక్నోకు చేరుకున్నారు. ఆయనకు సీఎం యోగి ఆదిత్యనాథ్ సాదర స్వాగతం పలికారు. ఇండియాభూటాన్‌మధ్య ఆధ్యాత్మిక సాంస్కృతిక సంబందాలను బలోపేతంచేస్తూ భూటాన్‌రాజు మహాకుంభ్‌కు హాజరుకావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇరుదేశాలకు చెందిన పలువురు ప్రముఖులు భక్తులు గంగా హారతి, పూజాకార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# సెల్ఫ్ సర్టిఫికేషన్ స్కీమ్ మార్గదర్శకాలు విడుదల

**విజయవాడ.ఫిబ్రవరి4,ప్రభాతవార్తప్రతినిధి:** సెల్ఫ్ సర్టిఫికేషన్ స్కీమ్ కింద రాష్ట్రంలో భవన నిర్మాణ అనుమతులపై ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పట్టణ ప్రాంత స్థానిక సంస్థలే ఇక నుంచి అనుమతులు ఇచ్చేలా మార్గదర్శకాలు ఇచ్చింది. సీఆర్డీఏ మినహా అన్ని చోట్లా అనుమతుల జారీ అధికారం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల పరిధి నుంచి పట్టణ ప్రాంత స్థానిక సంస్థలకు బదిలీ చేస్తున్నట్లు తెలిపింది. 300 చదరపు మీటర్లు మించకుండా ఉన్న ప్రాంతాల్లో నిర్మాణాలను స్వయంగా యజమానులే ప్లాన్ ధ్రువీకరించి దరఖాస్తు చేసేలా చట్టంలో మార్పులు చేశారు. స్వయంగా యజమానులు లేదా ఆర్కిటెక్ట్స్, ఇంజనీర్లు, టౌన్‌ప్లానర్లు కూడా దరఖాస్తు చేసే అవకాశం కల్పిస్తూ మార్గదర్శకాలు విడుదల చేసింది. లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్‌లు కూడా ఇంటి ప్లాన్ ను ధ్రువీకరించి అప్ లోడ్ చేసే అవకాశం కల్పించింది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో భాగంగా: బహుళ అంతస్తులు కాని నివాస భవనాలకు మాత్రమే ఈ వెసులుబాటు కల్పిస్తూ మార్గదర్శకాలు ఇచ్చింది. ఆన్‌లైన్ బిల్డింగ్ పర్మిషన్ సిస్టంలో నేరుగా దరఖాస్తుదారు లైసెన్సుడు టెక్నికల్ పర్సన్ జారీ చేసిన ప్లాన్ ను అప్‌లోడ్ చేసేలా నిబంధనల్ని సరళతరం చేసింది. ఈ మేరకు ఏపీ మున్సిపల్, టౌన్ ప్లానింగ్ చట్టాల్లో మార్పులు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగాన్ని మరింతగా ప్రోత్సహించేందుకు గానూ భవన నిర్మాణ అనుమతులను సరళతరం చేస్తూ ఆదేశాలిచ్చారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా భవన నిర్మాణ అనుమతుల కోసం సెల్ఫ్ సర్టిఫికేషన్ ప్రక్రియను ప్రవేశ పెట్టారు. అనుమతులున్న లే అవుట్స్ లో నిర్మించే భవనాలకు మాత్రమే ఈ వెసులుబాటు కల్పించాలని నిర్ణయించారు. 2008, 2020 ఎల్ఆర్ఎస్‌లో అనుమతులు పొందిన లేఅవుట్లలో నిర్మించే భవనాలకు వెసులుబాటు కల్పించారు. ప్లింత్ లెవల్ ఇన్‌స్పెక్షన్ నివేదికను ఆన్‌లైన్ బిల్డింగ్ పర్మిషన్ సిస్టంకు సమర్పించాలని మార్గదర్శకాల్లో స్పష్టం చేశారు. కోస్టల్ రెగ్యులేటరీ జోన్ లో నిర్మించే భవనాలకు ఈ స్వయం ధ్రువీకరణ వెసులుబాటు లేదని స్పష్టం చేశారు. అనధికార లేఅవుట్లో నిర్మించే భవనాలకు ఈ వెసులుబాటు లేదని వెల్లడించారు. ఆన్‌లైన్ బిల్డింగ్ పర్మిషన్ సిస్టంలో ఎలాంటి ఉల్లంఘనలు చోటు చేసుకున్నా సంబంధిత భవనాల యజమానులపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ మేరకు పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్ మార్గదర్శకాలు జారీ చేశారు.

# మరణాల సంఖ్యను ఎందుకు దాస్తున్నారు?

## లోక్‌సభలో అఖిలేష్ యాదవ్ ఆగ్రహం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌లోజ రుగుతున్న మహాకుంభ్‌మేళాలో తొక్కిసలాటఘటనపై పార్లమెంట్‌లో దుమారం చెలరేగుతోంది. ఈ దుర్ఘటనలో వాస్తవ మరణాల సంఖ్యను యూపి ప్రభుత్వం దాచిపెడుతున్నందటూ ఎంపి అఖిలేష్‌యాదవ్ బిజెపి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేసారు. కుంభ్‌మేళా సందర్భంగా యోగి ప్రభుత్వంచేసిన ఏర్పాట్లపైనా ఆయన మండిపడ్డారు. తొక్కిసలాటలో ఎంతమంది చనిపోయారు. అసలైన లెక్కలు బయటపెట్టండి అంటూ నిలదీసారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపేందుకు పార్లమెంటు మంగళవారం కూడా ప్రత్యేకసమావేశం అయింది. ఈ క్రమంలో కుంభ్‌మేళా ఘటనపై అఖిలేష్ స్పందించారు. ఈ అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుకలో తొక్కిసలాట జరగడం బాధాకరమని, యుపి ప్రభుత్వం 30 మంది చనిపోయారని 60 మందికి గాయాలయ్యాయని చెపుతోందని కానీ విపక్షాలు ఆసంఖ్య ఇంకా ఎక్కువే ఉన్నాయని అంటున్నాయన్నారు. బడ్జెట్ విషయంలో సరైన లెక్కలుచెప్పే ప్రభుత్వం కుంభమేళా మరణాలసంఖ్యను ఎందుకు దాస్తున్నదని ప్రశ్నించారు. ఈ దుర్ఘటనకు బాధ్యత ఎవరిదని ఇప్పటిదాకా ఎంతమందిపై చర్యలు తీసుకున్నారని అఖిలేష్ ప్రశ్నించారు. ఈఘటనపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని, కుంభమేళా ఏర్పాట్లపై చర్చించాలని, మరణాలు, గాయపడినవారు, వారికి అందుతున్న చికిత్స, అక్కడి వైద్యసిబ్బంది, రవాణా సదుపాయాలు వైద్యం ఇలా అన్నింటిపైనా చర్చజరగాలని ఆయన డిమాండ్‌చేసారు. ప్రధాని రాష్ట్రపతి సంతాపం చెప్పేంతవరకూ యోగి సర్కారు సంతాపం కూడా ప్రకటించలేదని అఖిలేష్ తీవ్రస్వరంతోప్రశ్నించారు. పెటుబ్బడుల విషయంలో డబుల్ ఇంజిన్‌ప్రభుత్వాల ఇంజిన్లుమాత్రమేకాదని బోగీలు కూడా ఢీకొట్టుకున్నాయని ఎద్దేవాచేసారు.

# అక్రమవలసదారుల రవాణాకు భారీ వ్యయం

## ఒక్కో వ్యక్తికి 4675 డాలర్లు ఖర్చుచేస్తున్న అమెరికా

వాషింగ్టన్, ఫిబ్రవరి 4: అక్రమ వలసదారులపై గుర్రుగా ఉన్న దేశాధ్యక్షుడు డొనాల్డ్‌జాన్‌ట్రంప్ దేశ చరిత్రలోనే అతిపెద్ద బహిష్కరణ ఆపరేషన్ చేపట్టారు. అక్రమంగా వలసవెళ్లిన విదేశీయులను వెనక్కి పంపిస్తున్నారు. ఇందుకోసం భారీ మొత్తం ఖర్చుచేసేందుకు సైతం వెనకాడటంలేదు. పౌరవిమానాల్లోనే కాకుండాప్రత్యేక సైనిక విమానాల్లో సంబంధిత దేశాలకు తరలిస్తున్నారు. గ్వాటెమాలా, పెరూ, హోండూరాస్ తదితర దేశాలకు అమెరికా వందలమంది అక్రమ వలసదారులను తరలించింది. గ్వాటెమాలాకు వెళ్లాలంటే ఒక్కో వ్యక్తికి 4675 డాలర్లు ఖర్చుచేసింది. సాధారణ టికెట్ 853 డాలర్లతోపోలిస్తే ఐదు రెట్లు ఎక్కువ. యుఎస్ ఇమ్మిగ్రేషన్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నడిపించే ఛార్టర్‌ఫ్లైట్ టికెట్‌దరకంటే ఎక్కువ కావడం విశేషం. సి17 సైనిక విమానంలో మరింత అధికం అవుతోంది. ఈ ఆపరేషన్‌కు అమెరికా రక్షణశాఖ రెండు సి17 రెండు సి130 ఈ మిలిటరీ ఎయిర్‌క్రాఫ్ట్‌లను వినియోగిస్తోంది. సి17 విమానానికి నిర్వహణ ఖర్చు గంటకు 21వేల డాలర్లుగా అంచనా. సీ130 ఈ ఎయిర్‌క్రాఫ్ట్‌కు 68 వేలనుంచి 71 వేల డాలర్లుగా ఖర్చు అవుతోంది. దీనితో సి17 విమానం 12 గంటలప్రయాణానికి 2.52 లక్షల డాలర్లు అవుతుంటే సి130 విమానం అయితే 8.16 లక్షలడాలర్లనుంచి 8.52 లక్షల డాలర్లు వ్యయం అవుతున్నట్లు తేలింది. ఇసిఇ డైరెక్టర్ జాన్సన్ వెల్లడించిన గణాంకాలుచూస్తే డిపోర్టేషన్ విమానాల ఖర్చు గంటకు 17 వేల డాలర్లవుతున్నదన్నారు. 135 మంది సామర్థ్యం ఉన్న ఈవిమానంలో ఒక్కోక్కరిని పంపించేందుకు గంటకు 630 డాలర్లు ఖర్చవుతోందని చెప్పారు. ట్రంప్ బహిష్కరణ అపరేషన్‌చేపట్టాక మొత్తం ఖర్చుపై లెక్కలు వేయలేదన్నారు. ఖర్చుతో నిమిత్తంలేకుండా ప్రాదాన్యతా క్రమంలో అక్రమ వలసదారులను వేగంగా తరలించే లక్ష్యంతోనే అధికారులు పనిచేస్తున్నారు. భారత్‌కు చెందిన అక్రమ వలసదారులను సి17 విమానంలో తరలించగా వచ్చే 24 గంటల్లో భారత్‌కు వస్తారని అంచనా.

# రైతువేషంలో వెళ్లి అవినీతి కనిపెట్టిన భద్రక్ కలెక్టర్

**భద్రక్(ఒడిశా),ఫిబ్రవరి 4:** అవినీతిపై వస్తున్న ఫిర్యాదులపై విచారణ చేసేందుకు భద్రక్ జిల్లా కలెక్టర్ తానే స్వయంగా రంగంలోకి దిగారు. జిల్లా కలెక్టర్ దిలీప్ రౌత్రాయ్ అవినీతి ఆరోపణలు ఎక్కువ వస్తున్న ఒక ప్రాథమికవ్యవసాయ సహకారసొసైటీ ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని తనిఖీలుచేసారు. అయితే తాను కలెక్టర్‌గా కాకుండా షార్ట్స్ వేసుకని టీషర్టు వేసి భుజాలపై ఒక తుండు వేసుకని తలకు టోపీ, ముఖానికి మాస్క్ ధరించి కట్షాహి సేవా సమయబాయా సమితి మండికి వెళ్లారు. ధామ్‌నగర్ బ్లాక్‌లో ఉన్న ఈ కేంద్రాన్ని సందర్శించి అక్కడిపరిస్థితులు నిశితంగా పరిశీలనచేసారు. మిల్లర్లు, సహకార సొసైటీలు క్వింటాలుకు అదనంగా ఎనిమిదినుంచి పది కిలోల ధాన్యం డిమాండ్‌చేస్తున్నట్లు గుర్తించారు. దీనితో సహేతుక నాణ్యత సగటు ప్రమాణాలను అతిక్రమిస్తున్నట్లు గుర్తించారు. మండినుంచి తిరిగి వచ్చిన వెంటనే కలెక్టర్ రౌత్రాయ్ సహకార సొసైటీల అసిస్టెంట్ రిజిస్ట్రార్‌ను పిలిపించుకని వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ సొసైటీ కార్యదర్శికి షోకాజ్‌నోటీస్ జారీచేసారు.

# కేంద్ర సహకారంతో రాష్ట్రానికి భారీగా నిధులు: మంత్రి లోకేష్

## ఢిల్లీలో బీజీ,బీజీగా లోకేష్

**విజయవాడ,ఫిబ్రవరి4,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే సమిష్టి కృషితో విశాఖ రైల్వే జోన్, రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్ట్, స్టీల్ ప్లాంట్‌లకు నిధులు తెచ్చుకోగలిగామని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. సమిష్టి కృషితోనే ఇదంతా సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. మనమంతా కలిసికట్టుగా ఉండడం వల్లే విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకోగలిగామన్నారు. మంగళవారం ఢిల్లీ పర్యటనకు వచ్చిన మంత్రి నారా లోకేష్.. టీడీపీకి చెందిన కేంద్ర మంత్రులు, ఎంపీలతోపాటు బీజేపీ నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ఇక ముందు కూడా ఇదే పంథా కొనసాగిద్దామని వారికి సూచించారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్ర మంత్రులు, ఎంపీలు చేస్తున్న కృషిని ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ అభినందించారు. అతి తక్కువ కాలంలో విశాఖ స్టీల్‌తో సహా అనేక సమస్యల పరిష్కారం కావడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని వారితో నారా లోకేష్ పేర్కొన్నారు. ఢిల్లీ పర్యటనకు వచ్చిన నారా లోకేష్‌తో కేంద్ర మంత్రులు శ్రీనివాస వర్మ, రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, టీడీపీ ఎంపీలతోపాటు బీజేపీ నేతలు కలిసి మాట్లాడారు. ఈ మేరకు నారా లోకేష్ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ఇక లోకేష్ తన ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో కలుకున్నారు. రాష్ట్రానికి భారీగా నిధులు కేటాయించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

# ప్యాన్‌కు ఉరేసుకొని ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

**విజయవాడ,ఫిబ్రవరి4,ప్రభాతవార్తప్రతినిధి:** ఇంటర్ విద్యార్థి ప్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం కృష్ణా జిల్లా కానూరులో జరిగింది. కానూరులోని ఎన్ఆర్ఐ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థి గుర్రం.వేణునాథ్ (18) తన హాస్టల్ గదిలో ఫ్యాన్‌కి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని గమనించిన సహచర విద్యార్థులు సమాచారాన్ని హాస్టల్ నిర్వహణాధికారికి తెలిపారు. వెంటనే ఆయన విషయాన్ని పోలీసులకు తెలియజేసారు. వేణునాథ్ స్వస్థలం తోట్లవల్లూరు మండలం గురువిందపల్లిగా తెలుసుకున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియవలసి ఉంది. వేణునాథ్ మానసిక వత్తిడికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు.

# 24 నుంచి బడ్జెట్ అసెంబ్లీ

>> తీసుకోనుంది. తర్వాత శాసనసభ వ్యవహారాల సలహా మండలిలో చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నారు.

## వారం - వర్జ్యం

తేది : 05-02-2025, బుధవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, శుక్లపక్షం,
అష్టమి రా. 12.36
భరణి రా. 8.32
వర్జ్యం : ఉ. 6.39-8.32
దు.మ. 12.07-12.53
రాహుకాలం - మ. 12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** ఆధ్యాత్మిక చింతన. ప్రముఖుల నుండి శుభవార్తలు వింటారు. వస్తులాభం. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

**వృషభం :** బంధువుల నుండి ధనలాభం పొందుతారు. ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు. ఇంటా బయటా ప్రోత్సాహం.

**మిథునం:** పాత మిత్రులను కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు. వస్తు కొనుగోలు. ఆర్థిక పరిస్థితి అనుకూలం.

**కర్కాటకం:** దూరప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. ఇంటర్వ్యూలు అందుతాయి. పోటీపరీక్షలలో విజయం సాధిస్తారు.

**సింహం:** బంధువుల నుండి విలువైన సమాచారం అందుకొంటారు. వస్త్రా కొనుగోలు. వృత్తి, వ్యాపారాలలో లాభాలు.

**కన్య :** దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారం కలవరపాటు కలిగిస్తుంది. సోదరుల కలయిక.

**తుల :** చోరభయం. కుటుంబసభ్యులు ఎదురై చికాకులు పెడతాయి. వాహనసౌఖ్యం. జీవిత భాగస్వామి నుండి సాయం అందుతుంది.

**వృశ్చికం:** ముఖ్యమైన పనులు ముందుకు సాగవు. ధనవ్యయం. ఆరోగ్యసమస్యలు ఎదురై చికాకులు పెడతాయి.

**ధనుస్సు:** నూతన ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వస్తుసేకరణ.

**మకరం:** కొత్త పథకాలకు రూపకల్పన చేస్తారు. విందు, వినోదాలలో పాల్గొంటారు. సేవకార్యక్రమాలలో పాల్గొంటారు.

**కుంభం:** పనులలో ఆటంకాలు ఎదురై చికాకు పెడుతాయి. ఖర్చులు పెరుగుతాయి. బంధువుల కలయిక.

**మీనం :** ఉద్యోగ బాధ్యతలు పెరిగిన సమర్థవంతంగా నిర్వహిస్తారు. శుభవార్తలు అందుకొంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

05-02Pg3exHMNWJQEVRSP.qxd:05-02Pg3exHMNWJQEVRSP.qxd 01/01/01 9:43 AM Page 1





# నేత్ర పర్వం..అరసవిల్లి సూర్యుని నిజరూప దర్శనం

## - ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించిన దేవాదాయశాఖ
## - స్వామివారిని దర్శించుకున్న మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం రథసప్తమి వేడుకలను రాష్ట్ర పండుగగా ప్రకటించిన నేపథ్యంలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం అర్ధరాత్రి 12.30 గంటల నుంచి స్వామి వారికి క్షీరాభిషేకాలు ప్రారంభమయ్యాయి. స్వామి వారి నిజరూప దర్శనానికి జిల్లా నలుమూలల నుంచే కాక ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి కూడా వేలాది భక్తులు తరలివచ్చారు. ముందుగా స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించిన దేవాదాయశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ వాడ్రెన్ వినయ్ చంద్ పూజలు ప్రారంభించి ప్రభుత్వ లాంఛనాలతో పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి నిజరూప దర్శనాన్ని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్న ప్రజా ప్రతినిధులలో కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, శాసనసభ్యులు గొండు శంకర్, బగ్గ రమణమూర్తి, మామిడి గోవిందరావు, గౌతు శిరీష, మాజీ కేంద్రమంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి, ఎంఎల్‌సి వరుదు కళ్యాణి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ పిరియా విజయ తదితరులు ఉన్నారు.స్వామి వారి నిజరూప దర్శించుకున్న అధికారులు జిల్లా కలెక్టర్ స్విప్నిల్ దినకర్ పుండ్కర్,



జిల్ల ప్రధాన న్యాయమూర్తి జువైద్ అహ్మద్ మౌలానా, విశాఖపట్నం డిఐజి గోపినాథ్ జట్టి, జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి, పార్వతీపురం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, రెవెన్యూ డివిజనల్ అధికారి సాయి ప్రత్యూష, వెంకటేష్ తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులు భారీగా తరలి రావడంతో భారీ ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అరసవల్లికి వచ్చే వాహనాల రాకపోకల ప్రత్యేకదారుల మీదుగా మళ్లించారు. జిల్లా యంత్రాంగం, పోలీస్ అధికారులు చేపట్టిన పటిష్ట చర్యలతో భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా నిజరూప దర్శనం త్వరితగతిన జరిగింది. జిల్లా కలెక్టర్ పలుమార్లు స్వయంగా పర్యటించి క్యూలైన్‌లో ఉన్న వారికి క్యూలైన్‌లో దర్శనానికి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీయగా భక్తులు ఏర్పాట్లుపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలు స్వచ్ఛంద సంస్థలు అన్నదానాలు, మంచినీటి సరఫరా, పిల్లలకు పాలు, భక్తులకు మజ్జిగ వంటివి సరఫరా చేశాయి. ఇంద్రపుష్కరిణి గట్టుపై మహిళలు పిడకలపై ఆవుపాలు, బియ్యం, పంచదారతో పరమాన్నం తయారు చేసి, సూర్యనారాయస్వామికి నివేదించి పూజలు నిర్వహించారు.

# పోలవరం ప్రాజెక్టు కెపాసిటీ తగ్గించొద్దు

**రాష్ట్రానికి అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోం: ఎంపి మిథున్‌రెడ్డి**



**విజయవాడ,ఫిబ్రవరి4,ప్రభాతవార్తప్రతినిధి:** పోలవరం ప్రాజెక్ట్ విషయంలో రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకోబోమని వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి అన్నారు. అవసరమైతే పార్టీలకు.రాజకీయాలకు అతీతంగా ఎంపీలతో కలిసి లోక్ సభలో పోరాడేందుకు తాము సిద్ధమని చెప్పారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే చర్చలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.పోలవరం ప్రాజెక్ట్ కెపాసిటీని తగ్గించవద్దని మిథున్ రెడ్డి కోరారు. ప్రాజెక్ట్ కెపాసిటీ 194 టీఎంసీలన్నారు.ఏడున్నర లక్షల ఎకరాలకు సాగునీటిని అందించేలా ప్రాజెక్ట్ ని డిజైన్ చేశారని తెలిపారు. ప్రాజెక్ట్ ఎత్తును తగ్గిస్తూ బడ్జెట్ లో ప్రతిపాదనలు పెట్టారన్నారు.. దీనివల్ల ప్రాజెక్ట్ కెపాసిటీ 194 టీఎంసీల నుంచి 115 టీఎంసీలకు పడిపోయిందని చెప్పారు. కేవలం 3.20 లక్షల ఎకరాలకు మాత్రమే నీరు అందుతుందని తెలిపారు. దీనివల్ల రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని చెప్పారు.

ఈ అన్యాయాన్ని ఎదిరించేందుకు టీడీపీ ఎంపీలతో కలిసి పని చేసేందుకు కూడా సిద్ధమేనని అన్నారు. కెపాసిటీ తగ్గిస్తే బనకచర్లకు నీరు ఎలా అందుతుందని ప్రశ్నించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరణ చేయవద్దని అన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాష్ట్రంలో క్రమంగా ఇంగ్లీష్ మీడియంను రద్దు చేస్తున్నారని విమర్శించారు.

# హంద్రీనీవా కాలువ వెడల్పు చెయ్యాల్సిందే!

**కాలువ సామర్థ్యాన్ని పదివేల క్యూసెక్కులకు పెంచాలి**

**ఎన్నికల వాగ్దానాన్ని కూటమి అమలు చేయాల్సిందే**

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ**

**అనంతపురం ఫిబ్రవరి 04 ప్రభాతవార్త బ్యూరో** కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి రాయలసీమ ప్రజల మద్దతు కూడగట్టడానికి హంద్రీనీవా సుజల స్రవంతి పథకాన్ని తెరమీదకు తెచ్చి హంద్రీనీవా కాలువను పదివేల క్యూసెక్కుల సామర్థ్యము చేపట్టి చివరి ఆయకట్టుకు నీళ్లు అందిస్తామని నమ్మబలికిన పెద్దలు అధికారం రాగానే మాట మార్చడం భావ్యం కాదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మండిపడ్డారు. మంగళవారం అనంతపురం జిల్లా కేంద్రంలోని హంద్రీనీవా సుజల స్రవంతి జిల్లా కార్యాలయం ముందు సిపిఐ ఆధ్వర్యంలో అఖిలపక్ష రాజకీయ పార్టీలను, రైతు సంఘాల నాయకులను కలుపుకొని ధర్నా చేపట్టిన కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రధాన వక్తగా హాజరై మాట్లాడుతూ కర్నూలు జిల్లా మల్యాల నుండి చిత్తూరు జిల్లా కుప్పం వరకు కృష్ణా జలాలను మళ్లించడానికి హంద్రీనీవా సుజల స్రవంతి పథకాన్ని తీసుకొచ్చిన ప్రభుత్వాలు రైతుల ఆశయాలకు అనుగుణంగా పనిచేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హంద్రీనీవా కాలువ సామర్థ్యం పెంచి చివరి ఆయకట్టుకు నీళ్లు ఇస్తామని ఎన్నికల వాగ్దానం చేసిన ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు కూటమి ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు ఇప్పుడు మాట మారుస్తున్నారన్నారుని ఆరోపించారు. పదివేల క్యూసెక్కుల సామర్థంతో కాలువ వెడల్పు చేసి 6లక్షల ఎకరాలకు సాగు నీరు అందించడంతో పాటు 30లక్షల మందికి త్రాగు నీరు అందించాలనేది ప్రధాన డిమాండు. చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందించాలని 50 సంవత్సరాలుగా పోరాటం జరుగుతుంది గుర్తు చేశారు. ప్రభుత్వం రైతులకు అనుగుణంగా క్రిష్ణా జనులను తోడి అందించాల్సింది పోయి కాంక్రీటు లైనింగ్ చేపట్టి రైతులను నష్టాలకు గురి చేస్తే ఉద్యమిస్తామన్నారు. మొదటి పేజ్ కింద 14 టీఎంసీల నీటి వాడుకోవాల్సి ఉండగా కాలువ సామర్థం లేక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రెండోదశ కింద లైనింగ్ పనులు చేపట్టి కుప్పం వరకు నీళ్లు తీసుకెళ్లడానికి చంద్రబాబు చేసిన కుయుక్తులను బయటపెట్టారు. గోదావరి నీళ్లు బనకచర్ల వరకు కాలువ తవ్వి నీళ్లు ఇస్తామంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు హంద్రీనీవా కాలువ విషయంలో ఎందుకు వెనకడుగు వేస్తున్నాడని ప్రశ్నించారు. రాయలసీమలోని చిత్తూరు, కర్నూలు, అనంతపురం జిల్లా రైతాంగానికి సాగునీరు, తాగునీరు అందించే ప్రాజెక్టులపై శీతకన్ను ఎందుకన్నారు. మదనపల్లిలో ఇప్పటికే రైతులు ఆందోళన మొదలుపెడితే అనంతపురం కర్నూలు జిల్లాల్లో పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టడానికి సిద్ధంగా ఉన్నారని గుర్తు చేశారు. 30 సంవత్సరాలుగా కృష్ణా జలాలు రాయలసీమకు మళ్లింపు నినాదం కొనసాగుతూనే ఉందని 1995లో చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేసిన విషయం గుర్తు చేశారు. ముఖ్యమంత్రులు మారిన రాయలసీమ రైతాంగ సమస్యలు మాత్రం అక్కడే ఉన్నాయన్నారు. మూతి ముందా తోక ముందా అనే చందంగా చంద్రబాబు వ్యవహారం ఉందన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్ మాట్లాడుతూ రెండో దశ లైనింగ్ పనులు వెంటనే ఆపివేయాలని కాలువ సామర్థం పెంచి చెరువులకు నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే కాలువ సామర్థం నానాటికి తీశికట్టు చందంగా మారిందని అన్నారు. అనంతపురం జిల్లాలో శ్రీకృష్ణదేవరాయల కాలంనాటి చెరువులుఉన్నాయన్నారు.



హంద్రీనీవా డిప్యూటీ కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న సిపిఐ, సిపిఎం నేతలు

# టిటిడిలో ఘనంగా రథసప్తమి వేడుకలు

## - స్వామివారికి అలంకారం చేసిన 'పడవల' దంపతులు

**విజయవాడ,ఫిబ్రవరి 4,ప్రభాతవార్త** బెజవాడలో తొలిసారిగా టిటిడి కళ్యాణమండపం మాడవీధుల్లో శ్రీ స్వామి వారిని తిరుచ్చిపై భక్తులు ఊరేగించడం విశేషతను సంతరించుకుంది. టిటిడిలో మంగళవారం రథ సప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం 5 గంటలకే రథ సప్తమి వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భక్తులు తోమాల సేవను నిర్వహించారు. అనంతరం స్వామి వారిని వివిధ రకాల వర్ణాల పుష్పాలతో వీనులవిందుగా అలంకరించారు. 7.05 నిముషాలకు స్వామివారిపై సూర్య కిరణాలు పడిన వెంటనే పండితులు వేద మంత్రాల ఘోషను నిర్వహించగా,భక్తులు ఆదిత్య హృదయాన్ని పఠించారు. అనంతరం ముస్తాబైన స్వామివారి ఉత్సవ మూర్తిని 'తిరుచ్చి'పై ఆసనంగా ఉంచి మాడవీధుల్లో ఊరేగించారు. విశేష అలంకార ప్రియుడైన స్వామివారికి మూల,మూలల మహిళలు హారతులిచ్చారు.దాదాపు 400 మంది వరకు భక్తులు వీనులవిందుగా హారతులిచ్చిన వైనం కనువిందు చేసింది. ఆలయ అర్చకులతో పాటు ఆలయ ముఖ్య అధికారులు,సూపరింటెండెంట్ మల్లిఖార్జునరావు,లలిత,రమాదేవితో పాటు స్వామివారికి పూలతో విశేష అలంకారం నిర్వహించిన పడవల ఏడుకొండలు-శాంతిశ్రీ దంపతులు,విజయకుమార్-సునీత దంపతులు,ప్రసాదరెడ్డి, సుబ్రహ్మణ్యం దంపతులు,తులసి,రాజేశ్వరి,రామకృష్ణ,వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. అర్చకుల వేదమంత్రాలు,భక్తుల గోవింద నామస్మరణలతో ఆద్యంతం టిడిపి ప్రాంగణం భక్తి పారవశ్యంతో మునిగిపోయింది.న భూతో బన భవిష్యత్ అనే రీతిలో టిటిడి ప్రాంగణంలో రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఆద్యంతం మహిళా భక్తులు విరివిగా తరలి రావడంతో, భక్తుల గోవింద నామాలతో టిటిడి ప్రాంగణం భక్తి పారవశ్యంతో మునిగి తేలింది.



మాడ వీధుల్లో స్వామి వారు

# సిబిఐ కోర్టు స్పెషల్ పిపిగా వెన్నా కళ్యాణ చక్రవర్తి



**విజయవాడ,ఫిబ్రవరి 4,ప్రభాతవార్త** సిబిఐ కోర్టు సెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వెన్నా కళ్యాణ చక్రవర్తి నియమితులయ్యారు. ఈయన ఈ పదవిలో మూడేళ్ళ పాటు కొనసాగుతారు. ఈయన తండ్రి సీనియర్ న్యాయవాది అయిన వెన్నా రమేష్‌చంద్రబాబు గతంలో విజయవాడ మహిళా కోర్టుకు ఎపిపిగా సుదీర్ఘకాలం పాటు పనిచేశారు.ఆయన హయాంలో 95 శాతం సక్సెస్ రేటును సాధించి,నిందితులకు కఠిన శిక్షలు పడేటట్లు చేసి,అప్పటి పోలీస్ కమీషనర్ నుండి ప్రశంసలు కూడ అందుకున్నారు. ఆయన వద్ద నుండి మెళుకువలను సంగ్రహించిన ఆయన తనయుడైన కళ్యాణ చక్రవర్తి ఆయన అడుగుజాడల్లోనే నడిచి,అత్యంత ప్రతిష్టాత్మక మైన సిబిఐ కోర్టు ఎపిపి పదవికి నియమితులయ్యారు.

# ప్రపంచ విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్‌లలో జిఎంఆర్‌ఐటికి గుర్తింపు

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త** టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ (టిహెచ్‌ఈ) సబ్జెక్టు వారీగా ఇచ్చిన వరల్డ్ యూనివర్శిటీ ర్యాంకింగ్స్ 2025లో ఇంజనీరింగ్ విభాగంలో జిఎంఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (జిఎంఆర్‌ఐటి) రాజాం చోటు దక్కించుకున్నట్లు జిఎంఆర్‌ఐటి మేనేజ్‌మెంట్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వరల్డ్ యూనివర్శిటీ ర్యాంకింగ్స్ 2025 కోసం 97 దేశాల నుంచి వివిధ ప్రాంతాలకు చెందిన 1488 విశ్వవిద్యాలయాలు పాల్గొనగా 18 కఠినమైన పనితీరు సూచికల ఆధారంగా విశ్లేషించి ర్యాంకింగ్‌లను ఇచ్చారని వారు తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హార్వర్డ్, స్టాన్ఫర్డ్, ఎంఐటి మరియు ఆక్స్‌ఫర్డ్ వంటి విశ్వవిద్యాలయాలు తమ అగ్ర స్థానాలను కొనసాగించగా, ఉన్నత విద్య రంగంలో పెరుగుతున్న ప్రభావాన్ని సూచిస్తూ భారతదేశం నుంచి 87 విద్యాసంస్థలు ర్యాంకింగ్స్ పొందాయని అన్నారు.

ఆంధ్రప్రదేశ్ నుంచి 7 విశ్వవిద్యాలయాలు మరియు ఇతర విద్యాసంస్థలు ఈ ర్యాంకింగ్‌లో చోటు సంపాదించగా వాటిలో అటానమస్ విద్యాసంస్థ అయిన జిఎంఆర్‌ఐటి ర్యాంకింగ్‌ను దక్కించుకుని ప్రత్యేకంగా నిలిచిందని తెలిపారు. ఈ గుర్తింపు ద్వారా జిఎంఆర్‌ఐటి తన పరిశోధనలలో నైపుణ్యతను, విద్యావిధానంలో నవీకరణల పట్ల అంకితభావాన్ని తెలియ జేస్తుందని, ఈ ఘనతను సాధించడంలో అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది కీలక పాత్ర పోషించారని ఈ సందర్భంగా వారికి జిఎంఆర్‌ఐటి మేనేజ్‌మెంట్ అభినందనలు తెలిపారు.

# సిఎం చంద్రబాబు పాలన సుభిక్షంగా సాగుతుంది

## - ప్రముఖ అవధాని,మాడుగుల నాగఫణిశర్మ



మాడుగుల నాగఫణిశర్మకు జ్ఞాపికను అందిస్తున్న ముఖ్యమంత్రి

**విజయవాడ,ఫిబ్రవరి4,ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలో సీఎం చంద్రబాబు వంటి ముందు చూపు ఉన్న నేత లేరని ప్రముఖ అవధాని,సరస్వతీ ఉపాసకులు పద్మశ్రీ అవార్డు ప్రకటించబడిన మాడుగుల నాగఫణి శర్మ అన్నారు. మన సంస్కృతి, సాంప్రదాయాలను ప్రోత్సహించడంలో ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు తీసుకున్న చర్యలను ఆయన కొనియాడారు. ప్రముఖ అవధాని, సరస్వతీ ఉపాసకులు మాడుగుల నాగఫణి శర్మ పద్మశ్రీ పురస్కారం పొందిన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సచివాలయంలో ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా నాగఫణి శర్మ మాట్లాడుతూ. చంద్రబాబు కీర్తి మరింత ఇనుమడిస్తుందని...ఆయన పాలనలో రాష్ట్రం సుభిక్షం అవుతుందని చెప్పారు. ప్రజల కోసం చేపట్టిన కార్యక్రమాలు మంచి ఫలితాలను ఇస్తాయని...ఆయన ఆలోచనలన్నీ కార్యరూపం దాల్చుతాయని అన్నారు. అమరావతి రాజధాని పూర్తై ప్రపంచంలో మేటి నగరం అవుతుందని, పోలవరం సహా అన్ని ప్రాజెక్టులు పూర్తై ప్రజలకు మేలు జరుగుతుందని నాగఫణి శర్మ అన్నారు. ముఖ్యమంత్రిని ఈ మేరకు ఆయన ఆశీర్వదించారు. పద్మశ్రీ వచ్చిన సందర్భంగా నాగఫణి శర్మను అమరావతికి ఆహ్వానించిన సీఎం చంద్రబాబు...ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. శాలువా కప్పి సన్మానించారు. చంద్రబాబు విజన్ వల్లనే హైదరాబాద్‌కు ఐటీ వచ్చిందన్నారు..ఆయన ముందు చూపు లక్షల మంది జీవితాల్లో వెలుగులు తెచ్చిందని అన్నారు. రాళ్లు, రప్పలతో నిండిన మాదాపూర్ ప్రాంతం భవిష్యత్‌లో ఎలా ఉండబోతుందో చంద్రబాబు ఊహించారని అన్నారు. ఐటీ కంపెనీలతో రూపురేఖలు మారిపోతాయన్నారు.

# తిరుమల సమాచారం

## సప్తవాహనాలపై సప్తగిరీశుడు అభయం

### - వరుసగా వివిధ అలంకరణల్లో స్వామివారు



**తిరుమల,ఫిబ్రవరి 4ప్రభాతవార్తప్రతినిధి:** మాఘమాసం సప్తమితిధిసూర్యజయంతి పర్వదినాన మంగళవారం ఉదయం నుండి రాత్రి వరకు ఏడుకొండలస్వామి ఏడువాహనాలపై అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చాడు. సాధారణంగా ఏడాది బ్రహ్మోత్సవాల్లో తొమ్మిదిరోజులు 16 వాహనసేవలు జరిగితే రథసప్తమిన ఒకేరోజు ఏడువాహనాలపై ఊరేగడం విశేషం. మంగళవారం ఉదయం తొలివాహనంగా 5.30గంటలకు శ్రీమన్నారాయణుడిగా సూర్యప్రభవాహనంపై దర్శనమిచ్చిన కలియుగదేవుడు ఆ తరువాత వరుసగా ఉదయం 9గంటల నుండి 10గంటల వరకు చిన్నశేషవాహనం, ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు గరుడవాహనం, మధ్యాహ్నం 1నుండి 2గంటల వరకు హనుమంతవాహనం, మధ్యాహ్నం 2గంటల నుండి 3గంటల వరకు చక్రస్నానమహోత్సవం, సాయంత్రం 4గంటల నుండి 5గంటల వరకు కల్పవృక్షవాహనం, సాయంత్రం 6గంటల నుండి 7గంటల వరకు సర్వభూపాల వాహనం, రాత్రి 8గంటల నుండి 9గంటల వరకు చంద్రప్రభవాహనసేవలపై ఊరేగారు. చక్రస్నానమహోత్సవాన భక్తులు స్వామివారి పవిత్రపుష్కరిణిలో పుణ్యస్నానాలాచరించారు. అత్యంత ప్రధానమైన గరుడసేవలోనూ లక్షలాదిమంది భక్తులు మాఢవీధుల్లోఉండి మలయప్పస్వామిని దర్శించుకుని ముక్తిపొందారు. గంట విడిదిలో ఊరేగిన ఒక్కో వాహనసేవను ఆద్యంతం భక్తులు భక్తితో వీక్షించి స్వామివారికి కర్పూరహారతులిచ్చారు. ఆపదమొక్కులవాడా గోవిందా...వేంకటరమణ గోవిందా,కరుణించుస్వామీ అంటూ వేడుకున్నారు. ఆలయ మాఢవీధుల్లో ఉన్న ప్రతి భక్తునికి సంతృప్తికరంగా, ఆనందంతో అన్నప్రసాదాలు, టీ, కాఫీ, మజ్జిగ, తాగునీరు ఇలా సకల సౌకర్యాలు అందించడంతో ఎంతో దూరంనుండి వచ్చిన భక్తులు పరవశమయ్యారు. ఈ వాహనసేవల్లో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు. టిటిడి ఇఒ శ్యామలరావు దంపతులు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం. ఆలయ పేష్కార్ రామకృష్ణ, బోర్డు సభ్యులు జ్యోతులనెహ్రూ, ఎంఎస్‌రాజు, భానుప్రకాష్‌రెడ్డి, పనబాకలక్ష్మి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, సదాశివరావు, నరేశ్, తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, టిటిడి సివిఎస్ఒ మణికంఠచందోలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీమన్నారాయణుడుగా సూర్యప్రభపై మలయప్ప

**తిరుమల,ఫిబ్రవరి 4ప్రభాతవార్తప్రతినిధి:** మాఘమాసనసప్తమితిధిన సూర్యజయంతి పురస్కరించుకుని మంగళవారం ఉదయం సప్తగిరీశుడు సూర్యప్రభవాహనంపై శ్రీమన్నారాయణుడిగా భక్తులను కటాక్షించాడు. ఏడాదిలో తొమ్మిది రోజులు బ్రహ్మోత్సవాలు జరిగితే సూర్యజయంతిన ఒకేరోజు ఏడు వాహనాలపై శ్రీనివాసుడు దర్శన మివ్వడం ప్రత్యేకత. మంగళవారం ఉదయం 5.30గంటలకు మలయప్ప స్వామిని ఆనంద నిలయంలో కొలువు దీరిన శ్రీమన్నారాయణుడిగా అలంకరించిన అర్చకులు వాహనమండపం వద్ద సూర్యప్రభవాహనంపై కొలువుదీర్చారు. అర్చకులు కర్పూర హారతులిచ్చి అనంతరం వాహనం కదిలింది. సూర్యనారాయణుడు సూర్యప్రభామధ్యస్థుడై దివ్యకిరణకాంతుల్లో ప్రకాశిస్తూ భక్తులను ఆరోగ్యవంతుల్నిచేస్తూ దర్శనమిచ్చాడు. ముందురోజురాత్రి నుండి దేవుని దర్శనం కోసం నిరీక్షించిన భక్తులకు ఒక్కసారిగా దర్శనం కలగడంతో గోవింద నామస్మరణలతో మాఢవీధులు మారుమోగాయి. సప్తఅశ్వవాహనంతో రూపొందించిన సూర్యప్రభవాహనంపై శ్రీమలయప్ప స్వామి కన్నులవిందుగా భక్తులకు అభయమిచ్చాడు. మాఢవీధుల్లో స్వామివారికి భక్తులు కర్పూరహారతులిచ్చి గోవిందా... వేంకటరమణ గోవిందా అంటూ నామస్మరణలతో తన్మయత్వం పొందారు.సూర్యుడు సకలరోగ నివారకుడు. ఆరోగ్యకారకుడు. ప్రకృతికి చైతన్యప్రదాత, ఔషధీపతిఅయిన చంద్రుడుకూడా సూర్యతేజంవల్లనే ప్రకాశిస్తూ వృద్ధి పొందుతున్నారు. ఈ వాహనంలో స్వామివారి చుట్టూ ఉన్న సూర్యప్రభ సకల జీవుల చైతన్యప్రభ.సూర్యమండల మధ్యవర్తి శ్రీమన్నారయణుడే. తొలివాహనసేవలో పెద్దజీయర్‌స్వామి,చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు.



టిటిడి ఇఒ శ్యామల రావు దంపతులు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం. ఆలయ పేష్కార్ రామకృష్ణ, బోర్డు సభ్యులు జ్యోతులనెహ్రూ, ఎంఎస్ రాజు, భానుప్రకాష్‌రెడ్డి, పనబాకలక్ష్మి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, సదాశివరావు, నరేశ్, తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, టిటిడి సివిఎస్ఒ మణికంఠచందోలు పాల్గొన్నారు.

## రథసప్తమివేళ శ్రీవారిసేవలో న్యాయమూర్తులు

**తిరుమల,ఫిబ్రవరి 4ప్రభాత వార్తప్రతి నిధి:** కలియుగవైకుంఠం తిరుమలలో ఆద్యంతం సూర్యజయంతివేళ తనదైన సంతోషంగా ఊరేగిన మలయప్పస్వామి ఉత్సవమూర్తులను సామాన్యభక్తులేగాక న్యాయ మూర్తులు కూడా దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం హైకోర్టు న్యాయమూర్తి జస్టీస్ విఆర్‌కె కృపాసాగర్, చెన్నై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టీస్ కెఆర్ శ్రీరామ్, తెలంగాణా హైకోర్టు న్యాయమూర్తి జస్టీస్ ఇవి వేణుగోపాల్ కుటుంబంతో కలసి తిరుమలకు చేరుకున్నారు. ఉదయం ఉదయం విఐపి బ్రేక్‌లో స్వామివారిని దర్శించుకున్నారు. కుటుంబసమేతంగా ఆలయంవద్దకు విచ్చేసిన వీరికి టిటిడి అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లుచేశారు. తొలుత ధ్వజస్తంభానికి మొక్కుకున్న న్యాయమూర్తులు ఆనందనిలయంలోనికి చేరుకుని శ్రీవేంకటేశ్వం స్వామివారిని దర్శించుకున్నారు. కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. రథసప్తమిన స్వామివారిని దర్శించుకోవడం ఆనందం వ్యక్తం చేశారు.



## లక్షలాదిమంది భక్తులకు సంతృప్తికర సేవలు

### - రథసప్తమి విజయవంతంపై ఇఒ,అదనపు ఇఒ

**తిరుమల,ఫిబ్రవరి 4ప్రభాతవార్తప్రతినిధి:** ఏడాదిలో మాఘమాసం సప్తమితిధిన ఏడుకొండలదేవుడు ఒకేరోజు ఏడువాహనాలపై దర్శనమివ్వడం విశేషం. ఇందు కోసం రెండులక్షలమంది భక్తులు అనేక రాష్ట్రాల నుండి తిరుమలకు తరలివచ్చారు. ఈ వాహనసేవల వీక్షణకు వచ్చిన మాఢవీధుల్లో నిరీక్షించిన అశేషమందిభక్తులకు టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ అధికారులు, బోర్డుసభ్యులు,పోలీసు యంత్రాంగం శ్రీవారిసేవకులు నిరంతరాయంగా అదనపు సేవలు అందించడం అభినందనీయమని టిటిడి అధికారలు కొనియాడారు.రథసప్తమి ప్రశాంతంగా విజయవంతం కావడంలో ఉద్యోగులు, పోలీసులు, శ్రీవారి సేవకులు భక్తులకు చేసిన విశేష సేవలు ప్రశంసించారు. అందరూ అన్ని విభాగాలు సమ వ్యయం చేసుకుని రథసప్తమినివిజయవంతం చేశారని మంగళవారం సాయంత్రం మీడియాతో తెలిపారు. నాలుగుమాఢవీధులలోని గ్యాలరీలలో వేచివున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నాణ్యమైనఅన్నప్రసాదాలు పంపిణీచేయడం జరిగిందన్నారు. వాహనసేవలు దర్శించుకుని తిరిగి వెలుపలకు వెళ్ళేలా భక్తులు అసౌకర్యం గురికాకుండా నిర్ధేశిత మార్గాల ద్వారా సిబ్బంది,పోలీసులతో శ్రీవారి సేవకులు సమన్వయంతో వ్యవహరించారన్నారు. ముఖ్యంగా తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, టిటిడి సివిఎస్ఒ మణికంఠచందోలు మాఢవీదులు, తిరుమల అంతటా తిరుగుతూ సమన్వయంతో వ్యవహరించాల్సిన తీరుపై పర్యవేక్షించారు.



వార్త

పరిపూర్ణమైన మనసుతో కలిసి పని చేయాలన్నదే జీవితం సూచించే అంశం. మనస్సు ఏకాగ్రతతో పని చేసినప్పుడే ఏకైక లక్ష్యం సిద్ధిస్తుంది.

న-విలియం జేమ్స్


# విద్య ఎవరి పరం?

నిధులు, విధుల కోసం కొట్లాడిన తెలంగాణకు ఇప్పుడు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ విసి నియామకాలు, అసిస్టెంట్ ప్రొఫెసర్‌ల నియామకానికి సంబంధించి విడుదల చేసిన మార్గదర్శకాలను వ్యతిరేకించే పరిస్థితి ఎదురైంది. కొత్తమార్గదర్శకాలను బట్టి నిధులు ఇవ్వడంలో మీనమేషాలు లెక్కించే యుజిసి ఉన్నత విద్య నియామకాలపై ఆంక్షలు పెట్టడం సమంజసంగా లేదనే అభిప్రాయాన్ని తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టా రెడ్డి, వైస్ చైర్మన్ ప్రొఫెసర్ పురుషోత్తంలు వ్యక్తం చేస్తున్నారు. యుజిసి ముసాయిదా ప్రకారం వర్సిటీల స్వతంత్రత దెబ్బతింటుందని విద్యావేత్తలు భావిస్తున్నారు. సమాఖ్య స్ఫూర్తికి భిన్నంగా వ్యవహరించడం యుజిసికి తగదని చెప్పారు. ఈ మార్గదర్శకాల ముసాయిదాపై కేరళ, తమిళనాడు రాష్ట్రాలు కూడా వ్యతిరేకిస్తున్నాయి. యుజిసి ప్రతిపాదిత ముసాయిదాను అమల్లోకి వస్తే వర్సిటీల వైస్ ఛాన్సలర్ నియామకాల్లో రాష్ట్రాలకు ఫ్లాంటి నియంత్రణ అధికారం ఉండదు. కేంద్రం ఎవరినైనా నియమించవచ్చు. గ్రాడ్యుయేషన్, పీజీల్లో ఏ సబ్జెక్టు చదివినా, నేష నల్ ఎలిజిబిలిటీ టెస్ట్‌లో అర్హత సాధించిన సబ్జెక్టుతో ప్రొఫెసర్ పోస్టులకు అర్హత పొందే అవకాశం ఇస్తే వారి బోధన సరైన స్థాయికి ఉండదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. యుజిసి తీరు ఇతర రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా ఇబ్బంది కలిగించే విధంగా ఉన్నందున అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖలు రాసేందుకు సమాయత్తమవుతున్నారు. యుజిసి కొత్త విద్యా విధానం 2020 కొత్త మార్గదర్శకాలను అమలు ఆధారంగా ఉన్నత విద్యాసంస్థలకు గ్రేడింగ్‌ని అందజేస్తాయి. ఇది సమాఖ్య స్ఫూర్తికి పూర్తి వ్యతిరేకం కాబట్టి అనేక రాష్ట్ర ప్రభుత్వాలు దీనిని వ్యతిరేకిస్తున్నాయి. విద్యపై రాష్ట్ర ప్రభుత్వమే 85 శాతం వ్యయపరుస్తోంది. అలాంటప్పుడు రాష్ట్ర విశ్వవిద్యాలయాలను కేంద్ర ప్రభుత్వం నియంత్రణలో ఉంచాలనుకోవడం సరైన పద్ధతి కాదు. ఈ మార్గదర్శకాలు రాష్ట్ర విద్యావ్యవస్థకు విరుద్ధంగా ఉన్నాయన్న విషయం ఈపాటికేవన్ని రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేకిస్తున్నాయి. అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రవేశాలకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష గ్రామీణ, ఆంగ్లేతర మాధ్యమ విద్యార్థులకు సీట్లనివ్వ నిరాకరిస్తే అది పెద్ద సంక్షోభానికి దారితీస్తుంది. విద్యార్థుల పాలిట నాలుగు సంవత్సరాల డిగ్రీ ఒక భారం మాత్రమే. బహుళ ప్రవేశ, నిష్క్రమణ వ్యవస్థలు విద్యార్థుల భవిష్యత్తును నష్టం చేయగలవు. ఉపాధ్యాయులకు లెక్కకు మించిన క్రమశిక్షణా చర్యలు వారిలో నైపుణ్యాన్ని తగ్గించగలవు. వైస్ ఛాన్సలర్లుగా బయట నిపుణులను నియామకం చేస్తే వ్యవస్థ వినాశనానికి దారితీస్తుంది. ఎందుకంటే రాజకీయ నాయకులు విశ్వవిద్యాలయ క్యాంపస్‌లలో ప్రవేశించి వారి ధోరణిలో వారు ప్రసంగించడం, రాజకీయ ప్రస్తావనలు వలనవిద్యా సంస్థలను కలుషితం చేయవచ్చు. ఇలాంటి ప్రతిపాదనలు విశ్వవిద్యాలయాల విద్యా నైపుణ్యాన్ని నాశనం చేస్తాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు బోధనేతర సంఘాలు కొత్త మార్గదర్శకాలతో నష్టపోతాయి. యుజిసి కొత్త మార్గదర్శకాలలో చెప్పుకోదగిన ప్రతికూలతలున్నాయి. ఇంతవరకు నడచిన విద్య విధానాలలో కేవలం అకడమిక్ అర్హతలున్న వారినే వైస్ ఛాన్సలర్‌గా ఎంపిక చేసేవారు. కొత్త ప్రతిపాదనలను బట్టి చూస్తే ఎంతో అత్యంత ప్రధానమైన ఈ పదవికి విద్యావేత్తలు కానక్కర్లేదు. విద్యార్హతలు లేనివారిని కూడా నియమించుకోగల అవకాశంఉంది. యూనివర్సిటీల ఛాన్సలర్‌లుగా గవర్నర్లను నియమించరాదని జస్టిస్ మదన్ మోహన్ పూంచి కమిటీ నిర్దేశించింది. కానీ దానికి భిన్నంగా విసిల నియామక కమిటీ ఛైర్పర్సన్ నియామకానికి గవర్నర్‌కు అధికారమిచ్చారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వాధినేతకు గవర్నర్‌కు సఖ్యత లేక తమిళనాడులో చాలా యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. చివరికి వారి వివాదం సుప్రీం కోర్టు వరకు వెళ్లింది. ఇలాంటి పరిస్థితే గతంలో తెలంగాణలో కూడా ఉండేది. ఇలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు రాష్ట్రంలో విద్యావ్యవస్థ కుప్పకూలిపోతుంది. కేంద్ర ప్రభుత్వజోక్యం ఎక్కువయ్యే పరిస్థితి ఉంటుంది. ఇక కాంట్రాక్టు టీచర్ల విషయానికొస్తే ఇంతవరకు ఉన్న పది శాతం నియామక నిబంధనకు నీళ్ళొదిలేశారు. ఇలాంటి నిబంధనలతో యుజిసి ముసాయిదాను యూనివర్సిటీ, కాలేజీ టీచర్ల సంఘాల సమాఖ్య పూర్తిగా వ్యతిరేకిస్తోంది. ఎన్నో నిబంధనలు విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా ఉన్నందున యుజిసి ప్రతిపాదనలను ఉపసంహరించుకోవడం మేలు. కాలేజీ టీచర్ల నియామకాలు, ప్రమోషన్‌లకు నిర్దేశించిన విధానాలు, విద్యా ప్రమాణాలు నిర్వహణ కోసం చేపట్టాల్సిన చర్యలపై ఫిబ్రవరి 5 లోగా అభిప్రాయాలు తెలపాలని కోరుతున్న యుజిసి ప్రతిపాద నలపై ఉన్నత విద్యావేత్తలు పెదవి విరుస్తున్నారు. ఆ నిర్ణయాలు ఏవీ ఉన్నత విద్యా ప్రమాణాలు పెంచేవి కావని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కొత్త ముసాయి దాను బట్టి ఉన్నత విద్యా నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వం నుంచి తప్పించా లన్నదే యుజిసి ఆలోచనగా కనపడు తోంది. అకడమిక్ పర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ ఆధారంగా టీచర్లు పనితీరు లెక్కించే విధానం ఉండేది. అలాగే ప్రమోషన్లు కూడా. తాజా నిబంధనల్లో ప్రతిభ ఆధారిత ప్రమోషన్ల విధానం ఆహ్వానించదగినదే! కాగా అందు కోసం రూపొందించిన సంక్లిష్టమైన విషయాలపై విద్యా వేత్తలు, మేధావుల సంఘాలతో చర్చించి నిర్ణయించడం మేలు! ఈ నిబంధనలు కొత్తగా ఉద్యోగాల్లోకి చేరే వారికి సమంజసం కాదని టీచర్ల సంఘాలు అభిప్రాయపడుతున్నాయి.



అభిప్రాయాలు మార్చుకోలేని వ్యక్తి తన తప్పుల్ని సరిదిద్దుకోలేడు. నేటి కంటే రేపు ఎక్కువ వివేకం ప్రదర్శించాలనుకుంటే మనిషిలో మార్పు అవసరం.

ఎడ్వర్డ్



ఇతరుల పట్ల మీకున్న విశ్వాసం, అవిశ్వాసం అన్నవి మీ పట్ల మీకున్న ఆత్మవిశ్వాసం అపనమ్మకం అనే అంశాలకు సంబంధించి ఉంటాయి.

ఖలీల్ జిబ్రాన్

# క్లీన్ ఎనర్జీ దిశగా భారత్ అడుగులు

**శిలాజఇంధనాల కంటేచాలా సురక్షితమైనది కావడం అణుశక్తి మరో ముఖ్యమైన ప్రయోజనం. ప్రపంచవ్యాప్తంగా సంభవించే ప్రతి ఐదుమరణాలలో ఒకటి వీటిఉద్గారాల కారణంగా సంభావిస్తాయంటే ఆశ్చర్యం కలుగక మానదు. ఒక్క 2018లోనే, శిలాజ ఇంధనాలు ప్రపంచవ్యాప్తంగా 8.7మిలియన్ల మంది ప్రాణాలను హరించాయి. 70 సంవత్సరాలలో, కేవలం 1979 నాటి త్రీమైల్ ఐలాండ్ ప్రమాదం, 1986 చెర్నోబిల్ విపత్తు 2011లో సంభవించిన ఫుకుషిమా అణు విపత్తు మాత్రమే ప్రజలను భయభ్రాంతులకు గురిచేశాయి. ఏదేమైనప్పటికీ అణుశక్తి సామర్థ్యంగల తొమ్మిది దేశాలలో ఒకటైన భారత్, విశ్వశాంతిని కాంక్షించే దేశంగా వసుధైక కుటుంబం అన్న భావనకు నిదర్శనంగా నిలవాలి.**

యేచన్ చంద్ర శేఖర్

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థల పారిశ్రామికీకరణ ప్రధానంగా బొగ్గు, సహజ వాయువు, పెట్రోలియం వంటి శిలాజ ఇంధనాల ద్వారా సాధ్యమైంది. ఇటీవలి సంవత్సరాలలో మాత్రమే ప్రపంచ దేశాలు సౌర పవన శక్తి వంటి ప్రత్యామ్నాయ, పునరుత్పాదక వనరులకు తెరలేపాయి. 1950లలో వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించిన అణు విద్యుత్ కేంద్రాలు ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలకు శిలాజ ఇంధనాల కంటే చాలా తక్కువ కాలుష్య కారకాలను వెదజల్లే ప్రత్యామ్నాయ విద్యుదుత్పత్తి అవకాశాన్ని అందించాయి. 1970లలో తలెత్తిన ఇంధన సంక్షోభం ఆకాశాన్నంటిన చమురు ధరల నేపథ్యంలో మరిన్నిదేశాలు అణువిద్యుత్ కార్యక్రమాలను ప్రారంభించాలని నిర్ణయించుకోవడంతో ప్రపంచవ్యాప్తంగా 1970 నుండి 1985 మధ్యకాలంలో చాలా రియాక్టర్లు నిర్మించబడ్డాయి. నేడు, అణుశక్తి ప్రపంచ ఇంధన డిమాండ్‌లో దాదాపు 10 శాతం తీరుస్తోంది. 32 దేశాలలో ప్రస్తుతం 439 అణువిద్యుత్ కేంద్రాలు పనిచేస్తుండగా దాదాపు 55 కొత్త రియాక్టర్లు నిర్మాణంలో ఉన్నాయి. 2020లో, 13దేశాలు తమ మొత్తం విద్యుదుత్పత్తిలో కనీసం 25 శాతం అణుశక్తి ద్వారా సాధించాయి. అణుశక్తి ఉత్పాదనలో ఇప్పటివరకు అమెరికా, చైనా,ఫ్రాన్స్ మార్కెట్‌లో ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. అమెరికా60శాతంశిలాజ ఇంధనాల ద్వారా 40 శాతం పునరుత్పాదక అణుశక్తిద్వారా విద్యుదుత్పత్తి చేస్తోంది. చమురు దిగుమతులను విచ్ఛిన్నం చేయాలనే అంతిమ లక్ష్యంతో ఫ్రాన్స్1970లలో తన అణు విద్యుత్ పరిశ్రమను విస్తరించనారంభించింది. ఈ చర్యభారీ పరిమాణంలో ఉద్గారాలను తగ్గించడంతో పాటు పటిష్టమైన ఆర్థిక వ్యవస్థకు దోహదం చేసింది. ప్రస్తుతం ఫ్రాన్స్ 56 ఆపరేటింగ్ రియాక్టర్లతో మొత్తం విద్యుదుత్పత్తిలో 70శాతం అణుశక్తిపై ఆధారపడుతోంది. భారత ప్రభుత్వం కూడా 2030 నాటికి మొత్తం దేశీయ విద్యుదుత్పత్తిలో 50 శాతం అణుశక్తి వంటి కార్బన్‌ఉద్గారాలను విడుదల చేయనివనరుల నుండి ఉత్పత్తి చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగడంతో పాటు 2040నాటికి 11,000 మెగావాట్ల కొత్త అణు విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని కూడా జోడించాలని ఆశిస్తోంది. అణుశక్తి తక్కువ గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను ఉత్పత్తిచేస్తుంది కాబట్టి దీనిని స్వచ్ఛమైన శక్తి (క్లీన్ ఎనర్జీ) వనరుగా పరిగణిస్తారు. 2024-25 ఆర్థికసర్వేలో, భారత ప్రభుత్వ ప్రధాన ఆర్థికసలహాదారు భారతదేశం తక్కువ కార్బన్ ఆర్థిక వ్యవస్థకు మారడంలో అణుశక్తి ప్రాముఖ్యతను ప్రముఖంగా ప్రస్తావించడం, ఇది ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద తక్కువ కార్బన్ విద్యుత్ వనరు కావడంతో 2047 నాటికి కనీసం 100 గిగావాట్ల అణుశక్తిని అభివృద్ధిచేయాలని భారత ప్రభుత్వం సంకల్పించింది. ఫిబ్రవరి 1న పార్లమెంటులో ప్రవేశపెట్టిన 2025-26 వార్షిక బడ్జెట్‌లో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ రూ.20,000 కోట్లతో అణుశక్తి మిషన్ ఏర్పాటును ప్రతిపాదించారు. ఈ మిషన్ 2033 నాటికి కనీసం ఐదు స్వదేశీ చిన్న మాడ్యులర్ రియాక్టర్లను ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో పరిశోధన, అభివృద్ధిపై దృష్టి సారిస్తోంది. చిన్న అణు విచ్ఛిత్తి రియాక్టర్లను కర్మాగారాల్లో అభివృద్ధి చేసి, తరువాత ఇతర ప్రదేశాల్లో స్థాపించవచ్చు. ఇవి సాధారణంగా సాంప్రదాయ అణు రియాక్టర్ల కంటే తక్కువ సామర్థ్యం కలిగి ఉంటాయి. ప్రస్తుతం, భారతదేశంలో శిలాజేతర ఇంధన వనరులనుండి చేపడుతున్న మొత్తం శక్తి ఉత్పత్తిలో అణుశక్తి వాటా కేవలం 2.49శాతం మాత్రమే. దేశంలో అణుశక్తి ఉత్పాదన నెమ్మదిగా ఉన్నప్పటికీ, బడ్జెట్ కేటాయింపుతో, వేగం పుంజుకుంటుందని నిపుణులు భావిస్తున్నారు. భారతదేశంలో అణు విద్యుత్ కేంద్రాలను నిర్వహిస్తున్న న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్పీసిఐఎల్), మొదటిసారిగా భారత్ చిన్న రియాక్టర్లను



ఏర్పాటు చేయడానికి ప్రైవేట్ కంపెనీల నుండి పెట్టుబడులను ఆహ్వానించడం ద్వారా దేశ అణువిద్యుత్ రంగాన్ని వికేంద్రీకరించడానికి అధికారిక చర్యలు చేపట్టింది. ఆరు సంవత్సరాల తర్వాత, గత సంవత్సరం, గుజరాత్‌లోని ఒక అణు విద్యుత్ కేంద్రంలో 700 మెగావాట్ల సామర్థ్యం గల రెండు యూనిట్లను ప్రారంభించిన ఎన్పీసిఐఎల్ ఇప్పుడు సంవత్సరానికి ఒక అణు రియాక్టర్‌ను ప్రారంభించాలని యోచిస్తోంది. టాటా పవర్ ఈ రంగంలోకి ప్రవేశించాలని యోచిస్తున్న ప్రైవేట్ కంపెనీలలో మొదటిది కాగారిలయన్స్ ఇండస్ట్రీస్, ఎల్ అండ్ టి, అదానీ గ్రూప్, వేదాంత కూడా అణుశక్తిలో పెట్టుబడులకు యోచిస్తున్నట్లు సమాచారం. ఈ రంగంలో ప్రైవేటు భాగస్వామ్యం వలన సాంకేతికపురోగతి, కార్యాచరణ సామర్థ్యం పెంపు, ఉత్పాదక ఖర్చుల తగ్గింపు, భద్రతా ప్రమాణాలను మెరుగు, అధిక మూలధన అవకాశం, భారీ అణుప్రాజెక్టుల ఆర్థిక సవాళ్ల పరిష్కారం, పోటీతత్తం, ఉత్తమ పద్ధతుల అమలు, అత్యాధునిక సాంకేతికత పరిజ్ఞాన లభ్యత, ఉపాధి అవకాశాలు లాంటివి సానుకూల అంశాలు. కాగా, ఖర్చులను తగ్గించే విధానాల కారణంగా భద్రతా ప్రమాణాల రాజీవలన ప్రమాదాలకు ఆస్కారం, సున్నితమైన అణు సాంకేతిక పరిజ్ఞానాల నిర్వహణలో జవాబుదారీతనం, పారదర్శకత లోపించడం, ప్రైవేట్ భాగస్వామ్యం వలన కీలకమైన జాతీయ మౌలిక సదుపాయాలపై విదేశీ యాజమాన్యం, నియంత్రణ,పరిమితనియంత్రణ, లాభదాయకతపై దృష్టి కారణంగా పర్యావరణ పరిరక్షణ, కార్మికుల భద్రత అణుశక్తి దీర్ఘకాలిక స్థిరత్వంపై రాజీ పడే అవకాశం లాంటివి ప్రతికూలాంశాలు. దాదాపు సున్నా కార్బన్ డయాక్సైడ్ లేదా ఇతర గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను ఉత్పత్తి చేయని కారణంగా అణుశక్తిని తరచుగా క్లీన్ ఎనర్జీ టెక్నాలజీ అని పిలుస్తారు. ఇతర పద్ధతుల ద్వారా శక్తి ఉత్పత్తి కోసం శిలాజ ఇంధనాలను కాల్చడం ద్వారా వెలువడే కాలుష్య కారకాలను అణుశక్తి ఉత్పత్తితో నిరోధించవచ్చు. ఇది యురేనియం అణువులను విభజించి విచ్ఛిత్తి ప్రక్రియ ద్వారా శక్తిని ఉత్పత్తి చేస్తుంది. విచ్ఛిత్తి ద్వారా విడుదలయ్యే వేడిని ఆవిరిని సృష్టించడానికి ఉపయోగిస్తారు. ఇది శిలాజ ఇంధనాల ద్వారా విడుదలయ్యే హానికారకమైన ఉప ఉత్పత్తులు లేకుండా విద్యుత్తును ఉత్పత్తి చేయడానికి టర్బైన్‌ను తిరిగేలా చేస్తుంది. బొగ్గు, చమురు లేదా గ్యాస్ విద్యుత్ ప్లాంట్ల మాదిరిగా అణు విద్యుత్ ప్లాంట్లు విద్యుత్ ఉత్పాదన సమయంలో కార్బన్ డై ఆక్సైడ్ ను ఉత్పత్తి చేయవు. ప్రపంచంలోని కార్బన్ రహిత విద్యుత్తులో మూడింట ఒక వంతు విద్యుత్తు అణు రియాక్టర్ల ద్వారా ఉత్పత్తి కావడమే కాకుండా వాతావరణ మార్పు లక్ష్యాలను చేరుకోవడంలో కూడా కీలక భూమికనిర్వహిస్తాయి. ఉద్గారాలను తగ్గించడంలో ఫ్రాన్స్ సాధించిన విజయాన్ని అణుశక్తి ప్రధాన అనుకూలాంశానికి స్పష్టమైన ఉదాహరణగా పేర్కొనవచ్చు. అణుశక్తి శుభ్రంగా ఉండి గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను విడుదల చేయకుండా కాలుష్యరహిత శక్తిని అందిస్తుంది. చాలామంది భావిస్తున్నట్లుగా కాకుండా, అణు కర్మాగారాలలోని శీతలీకరణ టవర్లు నీటి ఆవిరిని మాత్రమే విడుదల చేయడంతో వాతావరణంలోకి ఎటువంటి కాలుష్యకారక లేదా రేడియోధార్మిక పదార్థాలు విడుదల కావు. ప్రస్తుతం విశ్వవ్యాప్తంగా అందుబాటులో ఉన్న అన్ని శక్తి ప్రత్యామ్నాయాలతో పోలిస్తే, అణుశక్తి నిజానికి అత్యంత పరిశుభ్రమైన వనరులలో ఒకటి. అణుశక్తిని గ్రీన్‌సోర్స్ ఆఫ్ ఎనర్జీగా వర్గీకరించడం ద్వారా యూరోపియన్ కమిషన్ ఇటీవల అణుశక్తిపై స్పష్టమైన వైఖరిని తీసుకుంది. అణు రియాక్టర్ల నుండి వచ్చే అత్యంత రేడియోధార్మిక విషపూరిత ఉప ఉత్పత్తులు పదివేల సంవత్సరాల పాటు రేడియోధార్మికతను కలిగి ఉంటాయి.అయినప్పటికీ, వాతావరణ మార్పు కంటే కూడా దీనిని చాలా సులభంగా పరిష్కరించగల పర్యావరణ సమస్యగా పరిగణిస్తారు.దీనికి ప్రధాన కారణం ఏమిటంటే,అణుశక్తిఉత్పత్తి ద్వారా ఉత్పత్తి అయ్యే అణువ్యర్థాలలో 90శాతం వరకు పునర్వినియోగించవచ్చు. శిలాజఇంధనాల కంటేచాలా సురకితమైనది కావడం అణుశక్తి మరో ముఖ్యమైన ప్రయోజనం. ప్రపంచవ్యాప్తంగా సంభవించే ప్రతి ఐదుమరణాలలో ఒకటి వీటిఉద్గారాల కారణంగా సంభావిస్తాయంటే ఆశ్చర్యం కలుగక మానదు. ఒక్క 2018లోనే, శిలాజ ఇంధనాలు ప్రపంచవ్యాప్తంగా 8.7మిలియన్ల మంది ప్రాణాలను హరించాయి. 70 సంవత్సరాలలో, కేవలం 1979 నాటి త్రీమైల్ ఐలాండ్ ప్రమాదం, 1986 చెర్నోబిల్ విపత్తు 2011లో సంభవించిన ఫుకుషిమా అణు విపత్తు మాత్రమే ప్రజలను భయభ్రాంతులకు గురిచేశాయి. ఏదేమైనప్పటికీ అణుశక్తి సామర్థ్యం గల తొమ్మిది దేశాలలో ఒకటైన భారత్, విశ్వశాంతినికాంక్షించే దేశంగా వసుధైక కుటుంబం అన్న భావనకు నిదర్శనంగా నిలవాలి. ●

# రూపాయి పతనాన్ని ఆపలేరా..!

మేకిరి దామోదర్

అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత్ రూపాయి మారకపు విలువ భారీగా పతనం అవుతోంది. గతంలో ఎన్నడు లేని విధంగా రూపాయి విలువ ఆల్‌టైం కనిష్టానికి పడిపోయి, రూ.87.29 క్షీణించి పాతాళానికి పడిపోయింది. ఇంతేకాదు రూపాయి పతనం ఇంకా ఉందనే ఆందోళన వ్యక్తం అవుతుంది. ఈ ప్రభావం ఇప్పటికే వివిధ రంగాలపై కనిపిస్తుంది. విదేశాల్లో చదువుతున్న విద్యార్థులకు ఫీజులు ఖర్చులు నిమిత్తం గతంలో కంటే అధికమొత్తంలో చెల్లించాల్సి వస్తుంది, తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. నిత్యవసర వస్తువుల ధరలు మండిపోతున్నాయి. స్టాక్ మార్కెట్లు కుదేలవుతూ లక్షల కోట్లమేర మదుపర్ల సంపద ఆవిరి అయిపోతుంది. దిగుమతులు ఖరీదైపోతున్నాయి. ఈపరిస్థితి ఎంత కాలం ఉంటుందనే విషయాన్ని ఆర్థిక నిపుణులు అంచనా వేయలేకపోతున్నారు. అమెరికా అధ్యక్షుడు బాధ్యతలు తీసుకున్న వెంటనే ట్రంప్ ప్రకటిస్తున్న నిర్ణయాలు, విధానాల వల్ల డాలర్ ఇంకా బలపడి వర్ధమాన దేశాల కరెన్సీలు బలహీనపడే పరిస్థితి ఉందని చెబుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధర పెరుగుతుంది. దీనివల్ల దిగుమతులు భారం అధికమై దేశానికి ఆర్థికలోటు తీవ్రమోతుంది. రూపాయి విలువ క్షీణించడానికి మరో కారణం ఆర్థిక పరిస్థితుల్లో ద్రవ్యోల్బణం పెరగడంతో కార్పొరేట్ సంస్థల ఆదాయాలు లాభాలు తగ్గుతున్నాయి. ఆర్థిక కార్యకలాపాలు మందగించి ఉద్యోగాల్లో కోత, సరుకుల సరఫరా తగ్గడం వంటి సవాళ్లు ఎదురు అవుతున్నాయి. ఇవన్నీ రూపాయి విలువపడిపోవడానికి దోహదపడుతున్నాయి. అమెరికా డాలర్ విలువ రూపాయితో పోల్చితే ఈ సంవత్సరానికి90కి వరకు చేరిన ఆశ్చర్యపడాల్సింది లేదని నిపుణులు పేర్కొంటున్నారు. కేంద్ర ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడమే దీనికి పరిష్కారం అని నిపుణులు సూచిస్తున్నారు. రూపాయి బలపడినప్పుడేఇబ్బందులు తగ్గుతాయని, ధరల్లో స్థిరత్వం సాధించవచ్చని వివరిస్తున్నారు. అంతర్జాతీయ ద్రవ్యమార్కెట్లో రూపాయివిలువ భారత కరెన్సీ చరిత్రలోనే అత్యంత కనిష్ట దశకు పతనమవుతోంది. అమెరికన్ డాలర్‌తో పోలిస్తే 87.29 కనిష్ట స్థాయికి దిగజారింది. 2015 66.15/ 2016,67.93/ 2017 63.87/2018,69.77/ 2019,71.38/2020,73.07/ 2021,74.34/ 2022,82.74/ 2023,83.21/2024, 84.70/ డిసెంబర్ 3 దాక. ఆధారం లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన వివరాలు. తాజాగా 3,జనవరి, 2025న, రూ.87.29పాతాళానికి దిగజారింది.ఎగుమతుల కన్నా దిగుమతులు ఎక్కువగా ఉండడం, కరెంటు ఖాతా లోటు, ముడి చమురు ధరలు పెరుగుదల తదితర అంతర్జాతీయ, దేశీయంగా ఆర్థిక క్రమశిక్షణ లేమి. దుబారా పెరిగిపోవడం ఎగుమతులు పెంచి దిగుమతులు తగ్గించుకోవడంలో పాలన విధానంలో చిత్తశుద్ధి లేకపోవడం లాంటి తదితర విధానాల మూలంగా రూపాయి పతనానికి దారితీస్తుంది. మన దేశ జనాభాలో 60శాతం,35ఏళ్ల లోపువారే. ఈ యువశక్తిని జనాభాలో సగభాగమైన మహిళా శక్తిని నిపుణ వనరులుగా తీర్చిదిద్ది ఉపాధి,ఉద్యోగ అవకాశాలు కల్పించబడాలి.అలా దేశ ఉత్పాదక శక్తి పెంచుకోవడం వల్ల ప్రగతికిదారులు పడతాయి. ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా మారబోతుందన్న సర్కారీ ప్రచారంతోడు జీడీపీ మెరుపులకు సమాంతరంగా జనం బతుకుల్లో వెలుగులు నింపాలి.అంటే ఉపాధి సహిత అభివృద్ధి జరగాలి. మన దేశం వ్యవసాయ ఆధారిత జనాభా 60శాతంకు పైగా ఉంటారు. అందువల్ల వ్యవసాయం,పారిశ్రామిక రంగాల్లో సంపన్న దేశాలతో పోటీ పడి అభివృద్ధిని సాధించాలి. అతిప్రధానంగా దిగుమతులపై దృష్టిసారించి, ఆయా దిగుమతుల ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధించి ఎగుమతులు చేసే స్థాయికి చేరుకునే విధానాలు రూపొందించాలి.మన దేశంలో అవినీతి,నిర్లక్ష్యం సమూలంగా నిర్మూలించబడాలి. దేశ సంపద గుప్పెడు మంది చేతుల్లో కేంద్రీకృతం కాకుండా చేస్తూ, సమంగా పంచబడినప్పుడే సమ్మిళిత ప్రగతి సాధ్యపడుతుంది. అలాంటి చిత్తశుద్ధితో కూడిన విధానాలు అమలు చేయాలి. ప్రజాస్వామ్య దేశంలో బహుళ పార్టీల పాలన విధానంలో అధికార దాహంతో దేశ ఆర్థిక పరిస్థితులను పరిగణలోకి తీసుకోకుండా ఓటు బ్యాంకు పథకాలకు చరమగీతం పాడాలి. ●

# ప్రజావాక్కు



### ఈసారి కూడా నిరాశే!

కేంద్ర ప్రభుత్వం గత శనివారం పార్లమెంటులో 2025-26 సంవత్సరానికి ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్లో ప్రైవేటు రంగం పి.యస్.యుసంస్థల్లో దశాబ్దాలుగాపనిచేసి పదవీ విరమణపొందిన ఉద్యోగులకు వర్తించేఎంప్లాయిస్ పెన్షన్ స్కీమ్1995 (ఇ.పి.యస్95) పథకం కింద వచ్చే పెన్షన్ 7500కు పెంచేప్రకటన ఆర్థికశాఖమంత్రి నిర్మలా సీతారామన్‌ప్రకటిస్తారని దేశవ్యాప్తంగా పెన్షన్ దారులు అంతా ఎంతో ఆశతో ఎదురుచూసారు. వేతనజీవులకు మాత్రమే కొంతఊరట కల్పించి పెన్షన్ దారుల విషయంలో ఏ విధమైన ప్రకటన లేకుండా చేతులు దులుపుకుంది. ఈసారి కూడా బడ్జెట్‌లో మినిమమ్ పెన్షన్ పెంపు ప్రకటన రాకపోవటంతో పెన్షన్‌దారులు అంతా చాలా నిరాశ చెందుతున్నారు.ఈ మధ్యకాలంలో కొన్ని రాష్ట్రాల్లో ఆ రాష్ట్ర ప్రభుత్వం ఏ చదువు,ఉద్యోగం చేయని వారికి నెలకు నాలుగు వేల రూపాయలు వృద్ధాప్య పింఛన్లు ఇస్తున్నాయి.

-దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### చేతివృత్తులకు ఆర్థిక సహాయం

మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రధాన పథకాలలో పీఎంవి స్వనిధి కూడాఒకటి.చిరువ్యాపారులకు ఇది కల్పవృక్షం లాగా ఉంటుంది.ఈబడ్జెట్‌లో కూడా దీనికి అధిక నిధులు కేటాయించడం చిన్నవ్యాపారులకుబాసటగా ఉంటున్నది. దేశంలో ఈ పథకంకింద ఇప్పటికే 6.8మిలియన్ల మంది విధి వ్యాపారులు ఈపథకం కింద లబ్ధిపొదుతున్నారు. పట్టణ ప్రాంతాలలో ఉన్న ఇన్ ఫార్మల్ రంగం వారు చేతి వృత్తులు చేపట్టే వారికి ఆర్థిక సహాయం చేయ డం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఇక అంత మాత్రమే కాదు వీరికి జీవిత బీమా కూడా వర్తింప చేస్తే ఈ పథకం ఒక గేమ్ చేంజర్ అవుతుంది.

- భారత అవినాష్, జనగామ

### భారత రత్నగోల

బ్యాంకుల్లో కానీ పేరున్న మంచిసంస్థల్లోకానీ పెద్ద హోదాలో పనిచేస్తున్న వారు తమ పలుకుబడిని, పరపతిని ఉపయోగించి తమ వారసులకి ఉద్యోగం ఇప్పించుకోవటమనేది గతంలోబాగా జరుగుతుండేది.అవార్డుల విషయంలోనూ ఇప్పుడు అలానేజరుగుతోంది.దేశానికి ఎంతగొప్ప సేవ చేసినవారికి ఇచ్చే భారతరత్న అవార్డును ఇవ్వాలంటూ కొందరు చాలా ప్రయత్నం చేస్తున్నారు.

-మిథునం, హైదరాబాద్

### పరిష్కారం కాని కేసుల పరిస్థితి ఏమిటి?

తిరుపతిలో తొక్కిసలాట ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన న్యాయ విచారణ కమిషన్‌విచారణ వలన ఏమైనా ప్రయోజనం ఆశించవచ్చా? ఇప్పటికే కల్తీ నెయ్యిపై జరిగిన దర్యాప్తు పరిస్థితి తెలియదు.అలాగే గతంలో పింక్‌డైమండ్ పోయిందని, దానిపై పలుఆరోపణలు చోటుచేసుకోవడం, పరువునష్టం దావా న్యాయస్థానం విచారణలో కొనసాగుతోంది?ఇవేకాకుండా టిటిడి నమోదు చేయించిన పలు కేసులు సంవత్సరాల తరబడి పరిష్కారానికి నోచుకోవడం లేదు! మరి ఇలాంటి విచారణలు ఎవరిని మభ్య పెట్టడానికి? తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి పెండింగ్‌లో ఉన్న కేసులు, దర్యాప్తులు, విచారణల స్థితి గతులతో ఓ శ్వేత పత్రం విడుదల చేయాలి. అలాగే వాటిని ఎప్పటిలోగా పరిష్కరిస్తారో కూడా ప్రజలకు చెప్పాలి! భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా పాలక మండలి పూర్తి పారదర్శకంగా పని చేస్తేనే విలువ, గౌరవం పెరుగుతుంది!

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా

### ప్రభుత్వ బడులను మెరుగుపరచాలి

ఇటీవల జరిగిన సర్వేలో పాఠశాల విద్యార్థులు ప్రైవేట్ బడుల్లో కన్నాచాలా తక్కువ కనిపించింది. ప్రభుత్వపాఠశాలల్లో ఒకటవ తరగతి ప్రవేశాలు తక్కువగాఉన్నాయి. కారణాలెన్నో అయినా ప్రభుత్వం ప్రభుత్వ బడులను ఇంకా మెరుగు పరచాలి. ఇచ్చట రాయితీలున్న, బోధన,నాణ్యత, అజమాయిషీ ఇంకా పెరగాలి. బిడ్డల వయస్సు ప్రకారం అందరూ ప్రవేశానికి ప్రభుత్వ యంత్రాంగం, సామాజిక కార్యకర్తలకు పిలుపు నివ్వాలి. ఉత్తమ ప్రభుత్వ పాఠశాల్లో ఫలితాలను చెప్పాలి. మెరుగైన ఫలితాలు ఏ తరగతి గదిలో వారైనా కృషి ప్రధానం. మనం ఎన్నుకున్న ప్రభుత్వ ప్రయత్నాలకు మనసారా కృషి చేయాలి. వీలయితే ఖాళీ సీట్లు ఉన్నాయని పత్రిక ప్రకటన ఇవ్వొచ్చు.

-బొల్లోజు మెఘానాథం విశాఖపట్నం

### పేరు, ఫొటోలతో పనేంటి!

మాజీ ప్రధాన మంత్రి పేరుమీద పేదవారికి ఇండ్లు ఇవ్వకూడదట. బియ్యం, పప్పుదినుసులు చౌకగా లభించే రేషన్ దుకాణాల్లో ప్రస్తుత ప్రధాని ఫొటో ఉండి తీరాల్సిందేనట. లేదంటే మేం ఒక్క రూపాయి కూడా ఇచ్చేది లేదని అంటున్నారు. ఇలా అంటున్న వారికి కావలసింది మోడీకి మంచి పేరు రావడం బిజెపికి ప్రచారం లభించడం అంతేకాని ప్రజలకు మంచి జరగటం వీరికి అవసరం లేదు.ఎవరి ఫొటోలు ఉంటే ఏంటటా!

-ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

మనవి

ఎడిట్ పేజీకి..


ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# డొనాల్డ్ ట్రంప్ అనాలోచిత చర్య!

కనుమ ఎల్లారెడ్డి

ఇటీవల 47 వ అధ్యక్షుడిగా అమెరికా పగ్గాలు చేపట్టిన ట్రంప్ పలుచర్యలు తీసుకుంటున్నారు.అందులో చాలా వరకు వివాదాస్పదమైనవిగా ఉన్నాయి. దేశాలపై సుంకాలు విధించటం ప్రక్కన పెడితే, జన్మతః పౌరసత్వం కలకలం సృష్టించింది. ఫిబ్రవరి 20,2025 లోపు పిల్లలకే అమెరికా పౌరసత్వం వస్తుంది అని ఓ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేశారు. దీనిపై దుమారం చెలరేగడంతో డెమొక్రటిక్ పాలిత రాష్టాలు కోర్టుకు ఎక్కాయి. ట్రంప్ ఉత్తర్వు తాత్కాలికంగా నిలుపు చేస్తున్నాం అని ప్రకటించాయి. అమెరికా రాజ్యాంగంలో ఉన్న 14వ అధికరణం అమెరికాలో పుట్టిన పిల్లలకు పౌరసత్వం కల్పిస్తోంది. ట్రంప్‌కు విశేషమైన అధికారాలు ఉండొచ్చు. అయితే అమెరికా రాజ్యాంగం మార్చటం అంత సులభమైన పనికాదు. అయినా ట్రంప్ మొండిగా ముందుకు వెళుతున్నారు. అమెరికా, అమెరికా వాసులకే అని స్పష్టమైన ఆర్డర్ జారీ చేశారు. బాగానే ఉంది. పూర్వం నుంచి విదేశాల నుంచి వచ్చి అమెరికాలో స్థిరపడిన విదేశీయులు ఎందరో అమెరికా పౌరసత్వం కలిగి ఉన్నారు. ఉదాహరణకు భారత మూలాలు ఉన్న సునీతా విలియమ్స్ అమెరికా పతాకాన్ని రెపరెప లాడించారు.అంతేందుకు ఉపాధ్యక్షుడు భార్య ఉష, ట్రంప్ భార్య, అమెరికా అధ్యక్ష పదవికి పోటీ చేసిన డెమొక్రటిక్ నేత కమల హ్యారీస్ విదేశీయులే వారికి అమెరికా పౌరసత్వం ఉంది. అలా ఎంతో మంది అమెరికా పౌరసత్వం కలిగి ఉన్నారు. వీరి పౌరసత్వం మాటేమిటి? దూకుడు నిర్ణయాలలో ఇవి కూడా ఉండాలి. అలా ఏమి ఉండదు. అందరికీ ఒకే నిర్ణయం ఉండాలి. అమెరికా గడ్డ మీద అమెరికా వాసులే ఉండాలి అనే నిర్ణయం ఎందుకు తీసుకోకూడదు. వాళ్లు ఎప్పటి నుంచో అమెరికా పౌరసత్వం కలిగి ఉన్నారనే కదా! మీకు ఉన్న అధికారంతో వారి పౌరసత్వం కూడా రద్దు చేయవచ్చుకదా! దీనికి నిబంధనలు అడ్డువస్తాయి. విమర్శలు చెలరేగుతాయి. అందుకే వారి జోలికి వెళ్లకుండా తన అధికారంతో ఇప్పటి నుంచి విదేశీయులు ఎవరికీ అమెరికాలో జన్మించినా పౌరసత్వం ఇవ్వకూడదు అనే ఆర్డర్ జారీ చేశారు. ఇది రాజ్యాంగ విరుద్ధం అని పలువురు అభిప్రాయపడ్డారు. ట్రంప్ కన్నా ముందు ఉద్దండులైన వారు అమెరికా పీఠం ఎక్కారు. వారు కదపని పౌరసత్వాన్ని ట్రంప్ కదపటంతో మేధావులు పెదవి విరుస్తున్నారు. ఇది అమలులోకి రావటం కష్టంగా ఉంటుంది.



అంతలోపు మరో అధ్యక్షుడు వచ్చి యధాతథం అంటారు. అప్పుడు మళ్ళీ విదేశీయుల పిల్లలు అమెరికాలో పుడితే అమెరికా పౌరసత్వం వస్తుంది అని ప్రకటన చేస్తే, ట్రంప్ నిర్ణయం అభాసు పాలుఅవుతుంది. ట్రంప్ ఇటువంటి నిర్ణయాలు కాదు తీసుకోవాల్సింది అమెరికా అగ్రభాగంగా ఉండాలి. పౌరులు ఎవరైనా భద్రత కలిగి ఉండాలి. సుస్థిర ప్రగతి, దేశాలతో చక్కని దౌత్యవిధానాలు, అందరికీ అంగీకారమైన చర్యలు తీసుకోవాలి. విశ్వం శాంతిగా ఉండాలి అంటే అమెరికా విదేశీ విధానం అందరూ హర్షించే విధంగా ఉండాలి. పలు సంస్కరణలు తీసుకురావాలి కానిపౌరసత్వం వంటివి కాదు. ముందు ఐక్యరాజ్య సమితి, భద్రతా మండలిని శాశ్వత సభ్యుల సంఖ్య పెంచాలి. యుద్ధం అనే మాట ఎక్కడా వినపడకూడదు. శాంతికి బాటలు వేయాలి. దుర్భేధ్యంగా అమెరికా రక్షణ వ్యవస్థ ఉండాలి. విదేశీ, స్వదేశి ఉద్యోగులకు స్వర్గధామంగా ఉండాలి. నేరం చేసింది ఎవరైనా శిక్షలు కఠినంగా ఉండాలి. అమెరికాలో ఎక్కడా అవాంఛనీయ చర్యలు జరగకుండా చూడాలి. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో విషయాలు వస్తాయి. వీటన్నీటి మీద పాలన దృష్టి పెట్టి, పారదర్శక పరిపాలన అందించాలి. అనాలోచిత విషయాలు విడనాడాలి. స్వదేశి, విదేశీ పౌరులనుఒక్కటిగానే చూడాలి. వివక్ష ఎక్కడా ఉండకూడదు. అమెరికా అంటే దేశాలన్నీ తలతిప్పే విధంగా ఉండాలి. కనుక ఎటువంటి అనాలోచిత, వివాదస్పద నిర్ణయాలు తీసుకోకుండా పరిపాలన మెరుగ్గా సాగించాలి. ప్రస్తుతం అమెరికాలోఉద్యోగాలు కొంత తగ్గినా, ప్రతిభ ఉన్నవారికి వెతుక్కుంటూ వస్తున్నాయి. కొందరికి రావడం లేదు. ఉద్యోగాలు రాని వారి పరిస్థితి ఆందోళనగా ఉంది. వారు ఎక్కడా అంటే వివిధ మాల్స్, రెస్టారెంట్‌లలో పని చేయకూడదు అని ట్రంప్ ఓ కండిషన్ పెట్టారు. ఇది వరకు ఏ అధ్యక్షుడు ఇటువంటి చర్యలు చేపట్టలేదు. ఏ దేశం వారైనా ఎక్కడైనా చట్టబద్ధంగా పని చేసుకునే వెసులుబాటు కల్పించాలి. ఇప్పటికే అనేక వినతులు భారత ప్రధానికి వెళ్లాయి. ఆ పరిస్థితి చర్చించటానికి మరికొన్ని దౌత్య విషయాలలో రెండు దేశాల పటిష్ట సంబంధాల కోసం భారత ప్రధాని అమెరికా రాబోతున్నారు అనే అంచనా ఉంది. మోడీ పర్యటనలోనైనా అమెరికాలో విద్యనభ్యసిస్తున్న పౌరులకు మేలుకలుగవచ్చు. తద్వారా పరిస్థితులలో మార్పులు రావొచ్చు. ఒకింత భారత్‌కు మేలుజరగవచ్చు అనే ఆశాభావం కనిపిస్తోంది. మోడీ కూడా ట్రంప్‌ను భారత్‌కు ఆహ్వానించవచ్చు. రెండు దేశాలు కలసి ముందడుగు వేస్తే ఇక తిరుగు ఉండదు. ప్రపంచచిత్రపటంలోనే కొత్త శకానికి నాంది అవుతుంది. ప్రగతి పథంలో రెండు దేశాలు పయనిస్తాయని ఆశీద్దాం. ●

## పోలవరం ప్రాజెక్టును 45.72 మీటర్ల ఎత్తులో నిర్మించాలి

- రాష్ట్రపతి ప్రసంగ చర్చలో వైవి విజ్ఞప్తి - టిడిపి ప్రభుత్వం మౌనం ఉత్తరాంధ్రకు నష్టం
- ప్రధానమంత్రి కలుగ చేసుకోవాలని వైవి వినతి




**అద్దంకి, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :**
పోలవరం ప్రాజెక్టును 45.72 మీటర్ల ఎత్తులో నిర్మించాలని రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగంపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ ప్రభు త్వానికి విజ్ఞప్తి చేశారు. పోల వరం ప్రాజెక్టును ఎత్తు తగ్గించడం వలన, విశాఖ జిల్లాకు, ఉత్తరాంధ్ర జిల్లాల సృజల స్రవంతి ప్రాజెక్టు లక్ష్యం నెరవేరదని ఆయన ఈ సందర్భంగా వివరించారు.ఈ మేరకు గోదావరి ట్రిబ్యూనల్ 45.72 మీటర్ల ఎత్తు నిర్మాణానికి అను మతి ఇచ్చిందని, వైవి ఈ సందర్భంగా గుర్తుచేశారు. 150 మీటర్ల ఎత్తులో 194టిఎంసిల నీటి నిల్వ సామార్థ్యం కూడిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణ అనుమతులు వుండగా, ప్రాజెక్టు ఎత్తును 41.15 మీటర్లకు తగ్గిస్తూ 135 మీటర్లు ప్రాజెక్టు ఎత్తును పరిమిత చేయడం ప్రజల ఆకాంక్షకూ, ట్రిబ్యూనల్ అనుమతికి విరుద్ధంగా వుందని, వైవి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఈ విషయమై టిడిపి ప్రభుత్వం మౌనం గా మద్దతు తెలిపిందని, అయితే ఈ నిర్ణయాన్ని వైఎస్ఆర్‌సిపి వ్యతిరేకిస్తుందని వైవి సుబ్బారెడ్డి పేర్కొన్నారు.ఈ నిర్ణయం రాష్ట్రానికి పట్టిన చంద్ర గ్రహణం అన్నారు. 55వేల కోట్ల అంచనాలకు అమోదం తెలపాలని, ఆయన కోరారు. పోలవరం ఎత్తు తగ్గించడం వలన నీటి నిల్వ సామార్థ్యం తగ్గిపోతుందని, ఈవిషయంలో ప్రధాని నరేంద్రమోడి జోక్యం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

## స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన కలెక్టర్



**ఒంగోలు, ప్రభాతవార్త**
ఎస్సీ,ఎస్టీ,బీసీ సంక్షేమ వసతి గృహాల్లో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలు 2006 మంది పదో తరగతి విద్యార్థులకు ఆల్‌ఇన్‌వన్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలోని వసతి గృహంలో చదువుకొనుచున్న విద్యార్థినీ, విద్యార్థులు పదో తరగతి పరీక్షలలో నూటికి నూరుశాతం సాధించే విధంగా ప్రతి ఒక్క వసతి గృహ సంక్షేమాధికారి, సహాయ సంక్షేమాధికారులు కృషి చేయాలని, ప్రస్తుతం సీ, డీ గ్రేడ్‌లలో ఉన్న ప్రతి విద్యార్థి ఏ, బి గ్రేడ్ సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహంలో చదువుకొనుచున్న 2006 మంది పదో తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు 2024-25 పదో తరగతి పరీక్షలు తప్పనిసరిగా హాజరు కావాలని, ఏ ఒక్క విద్యార్థినీ/ విద్యార్థి డ్రాపౌట్ కాకుండా తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. అదే విధంగా అందరూ పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి తదుపరి పై చదువుల కొరకు కాలేజీలలో చేరే విధంగా చర్యలు తీసుకుని, సంబంధిత వసతి గృహ సంక్షేమాధికారులు వాటి వివరాలను సేకరించి సంచాలకులు సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయానికి సమర్పించాల్సిందిగా తెలియజేశారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ వసతి గృహంలో చదువుకొనుచున్న విద్యార్థులు పదో తరగతి పరీక్షలలో నూటికి నూరుశాతం సాధించి, ప్రకాశం జిల్లాను 2024-25 పదో తరగతి పరీక్షలలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉండే విధంగా కృషి చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరక్టర్ ఎన్.లక్ష్మానాయక్,జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారిత అధికారి ఎం.అంజలా, మున్సిపల్ కమీషనర్ వెంకటేశ్వరరావు, జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్ కుమార్, జిల్లా అధికారులు టి.లింగయ్య, అంకబాబు, అరుణ, శ్రీలత, డి.దుర్గలక్ష్మి, టి.ధనలక్ష్మి, వెంకటరావులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి లాన్ ఇన్విటేషన్ టోర్నమెంట్ ఏర్పాట్లు



**కనిగిరి, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**
కి.శే పులి వెంకట రమణారెడ్డి జ్ఞాపకార్థం రాష్ట్ర స్థాయి లాన్ టెన్నిస్ ఇన్విటేషన్ టోర్నమెంట్లు కనిగిరి కాస్మోపాలిటన్ క్లబ్‌లో ఈనెల 7వ తేదీన ప్రారంభం కానున్నాయి. ప్రకాశం జిల్లా లాన్ టెన్నిస్ అసోసియేషన్, కనిగిరి లాన్ టెన్నిస్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఏడో తేదీ నుంచి 9వ తేదీ వరకు జరిగే టోర్నమెంట్‌కు ఏర్పాట్లను కనిగిరి లాన్ టెన్నిస్ కార్యవర్గం కాస్మోపాలిటన్ క్లబ్ సభ్యులు పరిశీలిస్తున్నారు. రాష్ట్ర స్థాయి లాన్ టెన్నిస్ టోర్నమెంట్ ఈనెల 7వ తేదీ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రారంభించనున్నారు. రాష్ట్ర స్థాయిలో జరిగే ఈ పోటీలకు వివిధ జిల్లాల నుంచి అనేక మంది క్రీడాకారులు రానున్న నేపథ్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. టోర్నమెంట్ నిర్వహించడానికి కాస్మోపాలిటన్ క్లబ్‌తో పాటు ఆరేండ్‌బి అతిథి గృహంలో మరోక కోర్టును ఏర్పాటు చేశారు. ఈ పోటీలను జయప్రదం చేయాలని కనిగిరి కాస్మోపాలిటన్ క్లబ్ సభ్యులు, పాలకవర్గ సభ్యులు కోరుతున్నారు.

## పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల



**ఒంగోలు, ప్రభాతవార్త**
ఒంగోలు మంగళవారం జరిగిన పలు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పాల్గొన్నారు. ఒంగోలు నగరంలో జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలు సందర్భంగా ఆర్టీఓ కార్యాలయం నందు నిర్వహించిన బ్లడ్ డొనేషన్ క్యాంపు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. నగరంలోని 15వ డివిజన్ విద్యుత్ కార్యాలయం పక్కన ఎనర్జీ హార్వెస్ట్ సోలార్ షోరూం కార్యాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఒంగోలు నగరంలోని పేర్నమిట్ట నందు ప్రతిభా జూనియర్ కాలేజీ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఒంగోలు నగరంలోని పీవీజీ ఫంక్షన్ హాల్ నందు క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా డీజేర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరంలో కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఒంగోలు నగరంలోని వెంకట రమణ హాస్పిటల్ నందు గమ్మళ్ళపాలెం గ్రామ సర్పంచ్ బలగాని నారాయణని పరామర్శించారు.

## విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలి

- శ్రీ ప్రతిభ గురుదత్త వార్షికోత్సవ వేడుకల్లో మంత్రి డోలా





**సంతనూతలపాడు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**
విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి అన్నారు. మంగళవారం నాడు ఒంగోలులోని పేర్నమిట్టలో ప్రతిభా కళాశాల వార్షికోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి శ్రీ ప్రతిభ గురుదత్త విద్యాసంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ ప్రతిభ విద్యాసంస్థల వైస్ చైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సీఈఓ నల్లూరి జయప్రకాష్ నారాయణ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితాన్ని నిర్ణయించేది విద్యార్థి దశ అని విద్యార్థులు చెడు అలవాట్లకు లోనవకుండా క్రమశిక్షణతో కష్టపడి చదవాలన్నారు. విద్యకే కూటమి ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గత ప్రభుత్వం బకాయిలు పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేశామన్నారు. లోకేష్ మంత్రిగా విద్యాశాఖలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని, లోకేష్ చేతిలో రాష్ట్ర విద్యార్థుల భవిష్యత్ సురక్షితంగా ఉందన్నారు. యువత ఉద్యోగాలు అడగడం కాదు ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయమని చెప్పారు. జిల్లాలో పరిశ్రమలు పెట్టుబడులు తీసుకువచ్చి చదువుకున్న యువతకు ఉపాధి, ఉద్యోగాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ సందర్భంగా తక్కువ ఫీజుతో వేలాది మంది విద్యార్థులకు విద్యనందిస్తూ వందలాది మంది సిబ్బందికి ఉపాధి కల్పిస్తున్న ప్రతిభా కళాశాల యాజమాన్యాన్ని మంత్రి డోలా అభినందించారు. 43 సంవత్సరాల నుండి శ్రీ ప్రతిభ విద్యాసంస్థలను నిర్వహించడం ఎంతో గొప్ప విషయమని మంత్రి డోలా తన ప్రసంగంలో వెల్లడించారు. ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇంత మంచి కాలేజీ ఉండటం గర్వకారణం అన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు మాట్లాడుతూ మా తాతగారైన దామచర్ల ఆంజనేయులు కాలం నుండి నల్లూరి వెంకటేశ్వర్లు తో మా అనుబంధం కొనసాగుతుందన్నారు. నా ప్రాంతంలో ఉన్నటువంటి ఈ ప్రతిభా కాలేజీ నా కాలేజీ గా భావిస్తున్నానని అన్నారు.



# ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక వార్త

## నారా లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

- కనిగిరి సమస్యలపై సుదీర్ఘ చర్చ



**కనిగిరి, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**
కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్‌ని కలిసి నియోజకవర్గ సమస్యల పై వినతిపత్రం అందజేశారు. ఈ సమావేశంలో కేజీబీవీ స్కూల్స్ లో వసతుల అభివృద్ధి, స్టాఫ్ కొరత, ట్రిపుల్ ఐటీ నిర్మాణంలో జాప్యం, అలాగే సాంకేతిక కారణాలతో వాయిదా పడిన రిలయన్స్ బయో గ్యాస్ ప్లాంట్ అంశాలపై సమగ్రంగా చర్చించారు. నారా లోకేష్ దీనిపై సానుకూలంగా స్పందించి, త్వరలో బయోగ్యాస్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం నడికుడి- శ్రీకాళహస్తి రైల్వే లైన్ భూసేకరణ పురోగతి, పెండింగ్ పనుల విషయమై ఆంధ్రప్రదేశ్ చీఫ్ సెక్రటరి విజయానంద్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు.అలాగే ఏపీఎస్ఆర్‌టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుని కూడా కలిసి నియోజకవర్గంలో రవాణా సదుపాయాల మెరుగుదలపై చర్చించారు. కనిగిరి ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు అవసరమైనచర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఉగ్ర విజ్ఞప్తి చేశారు.

## ఎంత ఇస్తావ్..?

- ప్యాకేజీ అంటున్న ఎక్సైజ్ అధికారులు
- గొలుసు గుట్టు దృష్టి పెడితే ఒట్టు

**ఒంగోలు, ప్రభాతవార్త**
లాటరీలో దుకాణం వచ్చింది. గొలుసు దుకాణాలకు సరుకు వెళ్తుంది. వ్యాపారం భాగానే సాగుతుంది. అన్ని విధాలు సహకరిస్తున్నాం, అన్ని జిల్లాలో ప్యాకేజీ అనుకున్నాం, దాని ప్రకారం ఇవ్వండి ఎవ్వరిని బలవంతం చేయడం లేదు. మున్ముందు మా నుంచి అన్ని విధాల సహకారం ఉంటుంది. జిల్లాలో ప్రభుత్వం 131 మద్యం దుకాణాలకు లైసెన్సులు మంజూరు చేస్తే అనధికారికంగా 1500 నుంచి 2వేల వరకు బెల్టు షాపులు నడుస్తున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని, మద్యం విక్రయాలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుండటంతో అధికార పార్టీ అండదండలతో మాఫియా రెచ్చిపోతుంది. మద్యం షాపులు లాటరీలో దక్కించుకున్న వారికి తాత్కాలిక లైసెన్సులు ఇటీవల జారీ చేశారు. ఆ తరువాత దుకాణం కొలతలు తీసుకుని ఆ లైసెన్స్‌ను ఎక్సైజ్ అధికారులు రెన్యువల్ చేస్తారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. రెన్యువల్ తరువాత తొలుత దుకాణానికి ఒక లక్ష రూపాయలు చొప్పున ఇవ్వాలన్నారు. దుకాణ యజమానులు దీనికి అంగీకరించలేదు. ప్రభుత్వం జీవోలో 20 శాతం కమీషన్ ఇస్తామని చెప్పి ఇంకా పెంచలేదు, అమ్మకాలు సరిగ్గా లేక నష్టాలు వస్తున్నాయి. అంతా ఇచ్చుకోలేమని యజమానులు సంబంధిత అధికారులకు చెప్పినట్లు సమాచారం. జిల్లాలోని 171 షాపుల్లో కొన్ని షాపుల వారు లక్ష రూపాయలు, కొన్ని షాపులు వారు రూ.75వేల కు దగ్గకుండా ఎక్సైజ్ అధికారులకు ముట్టచెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. కొందరు వ్యాపారులు తర్జనభర్జన పడుతున్నారు. ఆఖరికి పొరుగు జిల్లాలో ప్యాకేజీ అమలవుతున్నందున ఒకే సారి రూ.75వేలకు తగ్గకుండా ఇచ్చినట్లు సమాచారం.కొందరులో, మరికొందరు రూ.75 వేలు ఇచ్చినట్లు సమాచారం. ఇటీవల అందిన ఫిర్యాదుపై జిల్లాలో కొన్నిమద్యం దుకాణాలపై కేసులు నమోదు చేశారు. దీంతో ఇలాంటి తలనొప్పులు తెచ్చుకోవడం కంటే ఎంతో కొంత ముట్టచెప్పాలని యజమానులు ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం నెలవారి అక్కడక్కడ వేలలో చెల్లిస్తున్నా. మొత్తం స్టేషన్ ఖర్చులకు సరిపోతుందని అధికారులు అన్నట్లు తెలిసింది. జిల్లాలో ఎక్సైజ్ అధికారులు కొన్ని ప్రాంతాల అధికారులతో రెన్యువల్ ఫీజు వసూళ్ల చేయాలని ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. దాదాపు సగం పైగా మద్యం షాపుల వారు అధికారులకు ముట్టచెప్పిటన్లు తెలిసింది. మొదటి నుంచి మాకు గిట్టుబాటు కాదని చెప్పుకుంటూ వచ్చారు. ఇప్పుడు ఆ సొమ్ము రాబట్టుకునేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు.



గొలుసుదుకాణ నిర్వాహకుల నుంచి కొంత మొత్తంలో అడ్వాన్సులు తీసుకుని షాపులు యజమానులు మద్యం సరఫరా చేసేలా ఒప్పందం చేసుకుని విక్రయించేందుకు లాభంలో పర్సంటేజీ చొప్పున వారికి వాటాలు ఇస్తున్నారు. అమ్మకాలు పెంచుకునేందుకు వ్యాపారులే బెల్టు షాపులను ప్రోత్సహిస్తున్నారన్న సమాచారం ఉన్నా కఠిన చర్యల విషయంలో ఎక్సైజ్ శాఖ వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తుంది. వ్యాపారులు ఒక్కో క్వాటర్ సీసాపై అదనంగా రూ.10నుంచి రూ.15 నుంచి చొప్పున తీసుకుని కావాల్సినన్ని అందిస్తున్నందున గొలుసు దుకాణాల వారు గ్రామానికి తీసుకెళ్లి రూ.20నుంచి రూ.25లకు విక్రయిస్తున్నట్లు సమాచారం. అది అధికారులకు మామూళ్లు ఇచ్చాము కదా అని మద్యం షాపు యజమానులు వారు విచ్చలవిడిగా బెల్టు షాపులను ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బెల్టు షాపులు నిర్వహిస్తూ పట్టుబడితే రూ.5లక్షల వరకు జరిమాన విధిస్తామని సీఎం చెప్పారు. కానీ క్షేత్రస్థాయిలో బెల్టు షాపుల అమ్మకాలే అధిక మొత్తంలో ఉన్నాయి. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడ బెల్టు షాపులు వెలుస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామాల్లో బెల్టు షాపులు వెలుస్తుండటంతో తమ కాపురాలు నాశనం అవుతున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లమధ్యలోనే మద్యం లభిస్తుండటంతో కూలీ డబ్బులన్నీ మద్యానికే ఖర్చు చేస్తున్నారని పేద మహిళలు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. బెల్టు షాపులపై దాడి చేసే విషయంలో అధికారులు వివక్ష చూపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బెల్టు షాపులు పెట్టినా, అక్రమంగా మద్యం విక్రయించినా ప్రభుత్వ అనుమతి లేకుండా ఎక్కడైనా కూర్చొని మద్యం తాగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలి, కానీ ఇక్కడ అధికారులు అవేమి పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. మామూళ్ల మత్తుల్లో కార్యాలయాలు దాటి బయటకు రావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మద్యం దుకాణాల వద్ద సిట్టింగ్ పర్మిషన్ లేదు. కానీ కొన్ని ప్రాంతాల్లో లైసెన్సు షాపుల వద్ద సిట్టింగ్‌లను ఏర్పాటు చేసి ప్రత్యేక బంకులను నిర్వహిస్తున్నారు. ఈ బంకులకు ఏ సమయంలో వెళ్లినా మద్యం దొరుకుతుందని పలువురు అంటున్నారు. ఏదీ ఏమైనా జిల్లాలో బెల్టు షాపుల దుకాణాలు ఎక్కువయ్యాయి. మద్యం షాపుల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతుందని పలువురు అంటున్నారు. అధికారులు పట్టిపట్టనట్లు ఉండటంతో మద్యం షాపుల యజమానులు బెల్టు షాపులనే విచ్చలవిడిగా గ్రామాల్లో ప్రోత్సహించి వారివ్యాపారాన్ని పెంచుకుంటున్నట్లు సమాచారం.

## కన్నుల పండుగగా రథసప్తమి వేడుకలు









- వైభవంగా వెండి రథోత్సవం
- శాంతిభద్రతలను పర్యవేక్షించిన ఎస్పీ దామోదర్
- ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే కందుల
- సప్త వాహనాల సేవలో హాజరైన ప్రముఖులు


**మార్కాపురం, ఫిబ్రవరి 4,ప్రభాతవార్త**
శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవాలయంలో రథసప్తమి వేడుకలు మంగళవారం కమిటీ సభ్యులు కన్నుల పండుగగా నిర్వహించారు. చారిత్రక దేవస్థానంలో పశ్చిమ ప్రాంత ప్రజల ఇలవేల్పు శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఒకే రోజు ఏడు వాహనాలపై వివిధ రూపాలలో భక్తులకు దర్శనం ఇవ్వడం, స్వామివారి దర్శనార్థం పట్టణంతో పాటు చుట్టు పక్కల గ్రామలా నుండి దూర ప్రాంతాల నుండి స్వామివారి భక్తులు అశేషంగా తరలిరావడం స్వామివారి చరిత్రకు చిహ్నంగా నిలిచింది. వేకువ జామున సూర్యప్రభ వాహనంతో ప్రారంభమైన సప్త వాహనాల ఉత్సవాలు ఆధ్యాత్మిక చాటేలా నిర్వహించారు. శేష వాహనం గరుడ వాహనం ఎంత వాహనం చక్రస్నానం చంద్రప్రభ వాహనాలపై దేవదేవుడు భక్తులకు దర్శనం ఇవ్వగా, ప్రతి వాహనోత్సవంలో అగ్రభాగాల ధార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి, జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్, రథసప్తమి కమిటీ అధ్యక్షులు యక్కలి కాశి విశ్వనాధం, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఇమ్మడి కాశీనాథ్‌లు, దేవస్థాన సాంప్రదాయ దుస్తులలో హాజరై స్వామి వారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం పల్లకి సేవలో పాల్గొన్నారు. సాయంత్రం 6గంటలకు కీలకంగా ఘట్టంగా నిర్వహించిన స్వామివారి వెండి రథోత్సవం వేలాది భక్తజన సమూహం మధ్య నభూతో న భవిష్యత్తు అనే రీతిలో జరిగింది. రథసప్తమి సందర్భంగా ధార్మిక సంఘాలు,ప్రజాసంఘాలు వ్యాపార సంఘాలు, ఆర్యవైశ్య అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో పలహార, అల్పాహార, అన్నసంతర్పణ, కార్యక్రమాలను పురమాడవీధులలో ఘనంగా నిర్వహించారు. పోలీసు, మున్సిపాలిటీ శాఖల ఆధ్వర్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.కార్యక్రమంలో దేవస్థానం ఈవో గొలమారి శ్రీనివాస రెడ్డి, మున్సిపల్ కమీషనర్ నారాయణరావు, డీఎస్పీ యు.నాగరాజు, సీఐ పి.సుబ్బారావు, డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.



డిప్యూటీ సీఎంకు ఫిర్యాదు.. నేడు విచారణలో

## సమస్య పరిష్కారమయ్యేనా?

- ప్రధానంగా త్రాగునీటి పైలెట్ ప్రాజెక్టు ఆటంకం
- చేతులెత్తేసిన జిల్లా, మండల స్థాయి అధికారులు
- పంచాయతీలో పైలెట్ ప్రాజెక్టు నిధులు గోల్మారు
- రాజకీయ ఒత్తుల్లే ప్రధాన కారణం







**మద్దిపాడు ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**
మండల పరిధిలోని దొడ్డవరం పంచాయతీ తెల్లపాడు గ్రామం ఎస్సీ కాలనీకి చెందినటువంటి పూనూరి రామకృష్ణ తమ ఎస్సీ కాలనీలో పైలెట్ ప్రాజెక్టు ద్వారా సరఫరా చేసే త్రాగునీటి సమస్య, డ్రైనేజ్ కాలువల నిర్వహణ, వీధిలైట్లు సమస్య ల రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి డిప్యూటీ సీఎం కె. పవన్ కళ్యాణ్, జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ప్రజావాణి నందు ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ పంచాయతీ సంబంధించినటువంటి త్రాగునీటి సరఫరాపై 2002 పైలెట్ ప్రాజెక్టు కింద నిధులు మంజూరు అప్పటి ప్రభుత్వం చేసింది. దీనిలో భాగంగా మండల పరిధిలోని మల్లవరం గుండ్లకమ్మ జలాశయానికి దగ్గరగా దూకుడు వాగు వద్ద ఊట బావిని ఏర్పాటు చేసి తద్వారా స్కీం ద్వారా నీటిని ఆ గ్రామానికి సరఫరా చేస్తున్నారు. ఈ క్రమంలో సెప్టెంబర్ 2024 నాడు తమ గ్రామానికి సక్రమమైన విధానంలో నీరు అందట్లేదని జిల్లా,మండల ఉన్నత స్థాయి అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో అధికారులు విచారణ చేపట్టగా ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఉన్న లింగంగుంట గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు దూకుడు వాగు వద్ద గతంలో కొంత వ్యవసాయ భూమిని కొని పంచాయతీ, రెవెన్యూ అధికారుల అనుమతి లేకుండానే రిసార్ట్స్ నిర్మాణాన్ని చేపడుతున్నాడు. ఈ క్రమంలో దూకుడు వాగుని జెసిబి మిషనరీ తో వాగులో తన అవసరం నిమిత్తం మట్టిని తోడుకొనడంతో ఇక్కడే సమస్య మొదలయ్యింది. ఊట బావి కన్నా దూకుడు వాగు ప్రవాహం అడుగుకి వెళ్ళడంతో ఊట బావి లోకి నీరు రాకపోవడంతో ప్రధానంగా దొడ్డవరం గ్రామపంచాయతీలో పైలెట్ ప్రాజెక్టు ద్వారా సరఫరా చేసే త్రాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఇది తెలిసినా కూడా రెవెన్యూ, పంచాయతీ అధికారులు తమకు ఏమీ తెలియదు అన్నట్లుగా వ్యవహరించారు. దీనితోపాటు గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు ద్వారా ఇళ్లకు సరఫరా చేసి నీటికి విధించే నీటి పన్ను విషయంలో కూడా అవినీతి జరిగినా కూడా ఓ పంచాయతీ కార్యదర్శిని విధుల నుంచి తొలగించి సస్పెండ్ చేయడమే తప్ప సమస్యకు పరిష్కారంగా అధికారులు ఆలోచించలేదు. ఈ సమస్యలు ప్రధాన కారణం అయినటువంటి రిసార్ట్స్ నిర్మాణం చేస్తున్న అధికార పార్టీ చెందినటువంటి నాయకుడు చేసినటువంటి దూకుడు వాగులో మట్టితోడినందువలన ప్రధానంగా గ్రామానికి మంచినీటి సరఫరా అంతరాయం కలిగిందని గ్రామస్తులు తెలిపిన కూడా ప్రస్తుత అధికార రాజకీయ పార్టీ చొరవతో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అనే సామెతగా సమస్య ఉండిపోయింది. ఓ పక్క కూటమి ప్రభుత్వంలో పంచాయతీరాజ్ శాఖ రాష్ట్రంలోనే అన్ని శాఖల కన్నా మిగులుగా పనిచేస్తున్నారని రాష్ట్రంలో ప్రజల అనుకునే తరుణంలో ఆశాఖ కూడా మసి అంటించే పరిస్థితిలో జిల్లా, మండల ఉన్నత స్థాయి అధికారులు, కూటమి ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్నారని మండలంలోని ప్రజలు అనుకుంటున్నారు. దీనిపై జిల్లా,మండల ఉన్నత స్థాయి అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టి దొడ్డవరం గ్రామానికి త్రాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయగలరని మండల ప్రజలు భావిస్తున్నారు.

## కూచిపూడి కుటుంబానికి నున్న పరామర్శ



**మద్దిపాడు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**
మండల పరిధిలోని రాచవారిపాలెం గ్రామానికి చెందిన మద్దిపాడు మండల జనసేన పార్టీ కార్యవర్గ సభ్యులు కూచిపూడి విజయ్ ప్రసాద్‌ను మండల పార్టీ అధ్యక్షులు నున్నా బాలసుబ్రహ్మణ్యం పరామర్శించారు. కూచిపూడి విజయ ప్రసాద్ నాయనమ్మ కూచిపూడి సుబ్బులు మంగళవారం వేకువజామున అనారోగ్య సమస్యలతో మృతి చెందడం జరిగింది. ఈ సందర్భంగా మండల జనసేన పార్టీ కమిటీ సభ్యులు సుబ్బులు పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కూచిపూడి విజయ ప్రసాద్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షులు ఆరేం వెంకటేశ్వర్లు, మండల కమిటీ సభ్యులు పొన్నం అయ్యప్ప, రెబ్బవరపు అశోక్ కుమార్, జనసేన పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

## హలో మాదిగ ఛలో హైదరాబాద్‌ను జయప్రదం చేయండి



**జరుగుమల్లి, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**
ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మాన్యశ్రీ మందా కృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణ అమలుకై లక్ష డప్పులు వేల గొంతల పిలుపుకై ఫిబ్రవరి 7 తలపెట్టిన ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి ప్రతి ఒక్క మాదిగ బిడ్డ డప్పులతో కదం తొక్కాలని జరుగుమల్లి మండలంలోని పలు గ్రామాలలో కొండపి నియోజకవర్గ మహాజన సోషలిస్టు పార్టీ, ఎంఎస్‌పీ సీనియర్ నాయకులు పూనూరి క్రిస్టఫర్ మాదిగ గ్రామాలలోని మాదిగ సోదరులను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క మాదిగ బిడ్డ ఆ రోజు డప్పు తోటి హైదరాబాద్ మహా పట్టణం మార్మోగేలా డప్పులు చప్పుడు వినిపించాలని పిలుపునిచ్చారు.

## వెలగలపాయ, గన్నేపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది



**అర్ధవీడు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**
అర్ధవీడు మండలంలోని వెలగలపాయ, గన్నేపల్లి గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఉద్యాన అధికారి డి.శ్వేత మాట్లాడుతూ మిరపలో కాయ కుళ్ళు, కొమ్మ ఎండు తెగులు వ్యాప్తి చెందకుండా ఒక మిల్లీ లీటరు ప్రోపికోనజోల్ లేదా 5 మి.లీ డైఫెన్ కొనజోల్ లేదా 2.5 ఎంఎల్ కాపర్ హైడ్రాక్సైడ్ లేదా 2.5 గ్రాములు సాఫ్ మందును లీటరు నీటికి కలిపి మందులను ఒకటి మార్చి ఒకటి వారం రోజులు రెండు సార్లు పిచికారి చేయాలని తెలిపారు. ఉద్యాన యాంత్రీకరణ పథకంకింద తైవాన్ స్ప్రేయర్లు 50 శాతం క్రింది ఎకరాలు లోపల ఉన్న రైతులకు లక్ష రూపాయలు మించకుండా రాయితీ ఉందని ఉద్యానఅధికారి శ్వేత తెలిపారు. వ్యక్తిగత నీటి కుంటలు, ప్యాక్ హౌస్‌లు, కోత అనంతరం యాజమాన్య పద్ధతులు క్రింద 50 శాతం రాయితీ ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మహమ్మద్, గ్రామ వ్యవసాయ సహాయకులు అజయ్, షకీర్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవం



**మద్దిపాడు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**
క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకుని జీవితంలో విజయం సాధిద్దామని డాక్టర్ ఆనంద్ మోహన్ అన్నారు. మంగళవారం అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఆయన సిబ్బందిని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌పై విజయం సాధించడానికి క్యాన్సర్ సోకిన వారిని గుర్తించాలని సిబ్బందికి తెలిపారు. 15సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికి స్క్రీనింగ్ నిర్వహించాలని తెలిపారు. ముందస్తుగా క్యాన్సర్‌ను కనుగొనడానికి స్క్రీనింగ్ చేయించుకోవాలని ఆయన అన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి తెలిపారు. అనంతరం పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలతో పీహెచ్‌సీ నుండి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సీహెచ్‌ఓ రజిత కుమారి, పలువురు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## పారిశుధ్య చర్యలు చేపట్టిన అధికారులు

**వార్త ప్రభావం**



**మద్దిపాడు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**
మద్దిపాడులో పారిశుధ్యం అధ్వాన్నంగా ఉండటంతో మంగళవారం నాడు ప్రభాతవార్త 'పారిశుధ్యం అధ్వాన్నం.. ప్రబలుతున్న వ్యాధులు' అనే శీర్షికన ప్రచురించింది. స్పందించిన పంచాయతీ అధికారులు గ్రామంలోని ఆయా ప్రదేశాల నందు మురుగు కాలువలలోని చెత్తను, మురుగును తొలగించడం జరిగింది. ఈ పారిశుధ్య పనులను ఇన్‌ఛార్జి ఎంపీడీఓ డీఎల్‌పీవో ప్రసాద్ పరిశీలించారు. వీరి వెంట మద్దిపాడు పంచాయతీ కార్యదర్శి షేక్ నూరుల్లా, పంచాయతీ కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఎమ్మార్పీఎస్ గోడపత్రిక ఆవిష్కరణ



**యర్రగొండపాలెం,ఫిబ్రవరి 4,ప్రభాతవార్త**
ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 7న హైదరాబాద్‌లో చేపట్టనున్న వేల గొంతుకలు లక్ష డప్పులు మహాప్రదర్శన గోడ పత్రికను మంగళవారం యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఎంఈఎఫ్ సీనియర్ నాయకులు మంద భాస్కర్,చేదూరి వెంకట్,ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి వినయ్,మండల అధ్యక్షుడు దాసు,చేదూరి రవి,ముండ్ల సురేష్, చేదూరి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



**యర్రగొండపాలెం,ఫిబ్రవరి 4,ప్రభాతవార్త**
యర్రగొండపాలెం మండలంలోని బోయలపల్లె, వీరభద్రాపురం గ్రామాలలో మంగళవారం వ్యవసాయ శాఖాధికారులు ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు .రైతులతో కలిసి అధికారులు సాగు చేసిన మిర్చి,కంది, పంట పొలాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుసేవ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన గ్రామ సభలో మండల ఉద్యానశాఖ అధికారి,పి.ఆదిరెడ్డి,మండల వ్యవసాయఅధికారి కె.వి.శేషారెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మిరప లో చేపట్టవలసిన యాజమాన్య పద్దతులు రైతులకు వివరించారు.ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేస్తున్న రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ గ్రామ సభలో ఏఈఓ ధనేశ్వర్ నాయక్,రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

## విజయవంతమైన మాదిగ మేధావుల సదస్సు

**యర్రగొండపాలెం,ఫిబ్రవరి 4,ప్రభాతవార్త**
యర్రగొండపాలెం నియోజకవర్గ కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో మంగళవారం మేధావుల సదస్సును మాదిగ ఉద్యోగ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కత్తి చలప రాజు మాట్లాడుతూ రాష్ట్రములోని 59 ఎస్సీ కులాల మధ్య రిజర్వేషన్ ఫలితాలు సమానంగా పంపిణీ కావాలంటే,ఏ,బి,సి,డి,లుగా ఎస్సీలను వర్గీకరించడమే ఏకైక న్యాయం అన్నారు.కార్యక్రమానికి ముందుగా ఆర్అండ్‌బి బంగ్లా నుండి పట్టణంలోని ప్రధాన సెంటర్లలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు డప్పులతో భారీర్యాలీ నిర్వహించారు.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో లింగంగుంట్ల రాములు,ఒ.బులు,చేదూరి గంగయ్య,సింగ ప్రసాద్, ముటుకూరి రాజు,సిద్దెల నాసరయ్య,రమేష్,జాన్,మాదిగ మేధావులు తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక శోభలో మార్కాపురం

## - ఊరంతా పండుగ





**మార్కాపురం, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**
ఆధ్యాత్మిక శోభతో మంగళవారం మార్కాపురం పట్టణ శోభరిల్లింది. రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని చారిత్రాత్మక శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానంలో అట్టహాసంగా సప్త వాహనాల సేవ జరగడంతో భక్తులు స్వామివారి దర్శనం కోసం పోటెత్తారు. ఒకే రోజు ఏడు వాహనాలపై శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి వివిధ అలంకారాలు భక్తులకు దర్శనమిచ్చి చక్రస్నానం అనంతరం రజిత వాహనంపై నగరోత్సవం జరగనుండడంతో వేడుకలను తిలకించేందుకు భక్తులు తండోపతండాలుగా తరలించారు. ఇదే సమయంలో పట్టణంలోని గుండ్లకమ్మ నది తీరాన వెలసిన శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు కూడా ప్రారంభం కావడంతో మార్కాపురం పట్టణమంతా భక్త కోలహాలంతో అన్న సంతర్పణ కార్యక్రమాలతో స్వామివారి నగరోత్సవాలతో అలరించింది. 4వ తేదీ నుండి 10వ తేదీ వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి.

## సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఎంపీడీఓ



**వెలిగండ్ల, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**
మండలంలోని హుస్సేనపురం, మొగల్లూరు తదితర సచివాలయాలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్‌భాషా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించిన ఆయన సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్ నిర్వహణ సక్రమంగా ఉండాలని ఆదేశించారు. ఏఏ సమస్యలపైన ప్రజలు సచివాలయానికి వస్తున్నారో అవన్నీ పరిష్కరించే విధంగా చూడాలన్నారు. సచివాలయానికి వచ్చే ప్రజల పట్ల సచివాలయ సిబ్బంది గౌరవంగా నడుచుకుని వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఉత్తమ ఎంపీడీఓ అవార్డు గ్రహీత సురేష్‌బాబును సత్కరించిన మహిళా ప్రజాప్రతినిధులు



**సంతనూతలపాడు,ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన ఒక కార్యక్రమంలో జిల్లా స్థాయిలో ఉత్తమ ఎంపీడీఓగా అవార్డు అందుకున్న డి.సురేష్‌బాబును సంతనూతలపాడు ఎంపీపీ బుడంగుంట విజయ, జడ్పీటీసీ దుంపా రమణమ్మ, పలువురు మహిళా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు మండవ సులోచన, తన్నీరు రాగమ్మలు, గుడిపాడు ఎంపీటీసీ టి.సుజాత, సంతనూతలపాడు, చిలకపాడు, మద్దులూరు, తక్కెళ్ళపాడు, వేములపాడు సర్పంచ్‌లు దర్శి నాగమణి, బి.కోమలి, ఎం.శైలజ, పి.సుజాత, ఈ.విజయలక్ష్మి, చిలకపాడు, మద్దులూరు గ్రామ అభివృద్ధి నాయకులు బి.మధుసూదన్‌రావు, ఎం.అమర్నాథ్ తదితరులు ఉత్తమ ఎంపీడీఓ సురేష్‌బాబును సత్కరించిన వారిలో ఉన్నారు.

## యంత్ర పరికరాలను తనిఖీ చేసిన వ్యవసాయ బృందం



**సంతనూతలపాడు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**
సింగరాయకొండ సబ్ డివిజన్ వ్యవసాయ సంచాలకులు ఈ.నిర్మలాకుమారి సంతనూతలపాడు మండలంలోని పేర్నమిట్ట, మంగమూరు, బొడ్డువారిపాలెం, పి.తక్కెళ్ళపాడు గ్రామాలలో కస్టమర్ హైరింగ్ సెంటర్ యంత్ర పరికరాలను తనిఖీ చేశారు. తదుపరి బొడ్డువారిపాలెం పి.తక్కెళ్ళపాడు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా సంతనూతలపాడు మండల వ్యవసాయాధికారిణి పి.పావని ఆ గ్రామాలలో సాగు చేసి ఉన్న శనగ పంటను పరిశీలించి సస్యరక్షణ చర్యలు వివరించారు. మండలంలోని రైతులందరూ ఏపీఎఫ్ఆర్ యాప్ నందు నమోదు అయినట్లయితే ఫార్మర్ ఐడీలు వస్తాయని, ఇది ప్రతి ఒక్క రైతుకి తప్పనిసరిగా రిజిస్టర్ అయ్యేలా చేయాలని మండల వ్యవసాయాధికారిణి గ్రామ వ్యవసాయ సహాయకులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ఎస్.వెంకటరావు, కేవీ సుబ్బారెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు సి.జానకి, ఎం.సౌజన్య, డి.సుప్రజ, ఎస్‌కే అబ్దుల్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## నేర నియంత్రణ, అసాంఘీక కార్యకలాపాల కట్టడికి గట్టి చర్యలు తీసుకోవాలి

### - సైబర్ నేరాల అడ్డుకట్టకు అవగాహనే అస్త్రం

### - పెద్దారవీడు పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీలో జిల్లా ఎస్పీ దామోదర్





**మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**
వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం ప్రకాశం జిల్లా ఎస్పి ఏఆర్ దామోదర్ పెద్దారవీడు పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పోలీస్ స్టేషన్ స్థితిగతులు, సిబ్బంది పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పోలీస్ స్టేషన్ ఆవరణాన్ని, గదులను, రిసెప్షన్ కౌంటర్, పాత పోలీస్ క్వార్టర్స్, స్టేషన్ పరిసరాలను పరిశీలించఆరు. స్టేషన్ నిర్వహణ రికార్డులు, పట్టుబడిన ద్విచక్రవాహనాలు, పలు సిడి ఫైల్స్‌ను మరియు జనలర్ డైరీ తదితర రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలో లా అండ్ ఆర్డర్, నేర నివారణ వ్యూహాలపై తీసుకుంటున్న చర్యలపై అధికారులను ఆరాతీసి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌లో పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకొని వాటిని త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి తక్షణమే ఫిర్యాదులకు పరిష్కారం అందించాలని, మహిళల భద్రత విషయంలో ప్రతిఒక్కరు అప్రమత్తంగా ఉండాలని, మహిళలు/చిన్నారులపై జరిగే ఆకృత్యాలకు సంబంధించి వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలు జరుగకుండా చూసుకోవాలని ఆదేశించఆరు. స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బంది వివరాలు, వారి విధులు వంటి వాటిపై ఆరాతీశారు. మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాత్రి వేళల్లో పోలీసులు పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, గస్తీ విధులు పటిష్టంగా నిర్వర్తించి నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. చెడు నడత కలిగిన వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, బీట్లు తిరిగే సమయంలో హిస్టరీ షీట్లు కలిగిన వారిని చెక్ చేయాలని, వారి కదలికలపై నిఘా పెట్టాలని, విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలన్నారు. స్కూల్స్ కళాశాల విద్యార్థినీలకు గుడ్ టచ్, బ్యాడ్‌టచ్, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, గంజాయి లాంటి డ్రగ్స్ వలన కలిగే అనార్ధఆల గురించి ప్రజలకు ఫేక్ లోన్‌యాప్స్, ఇన్వెస్ట్ లోన్ ఫ్రాడ్స్, ఓటిపి మోసాలు, మరియు ఇతర సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మరియు సిబ్బందిని ఆదేశించారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్ వాడాలని, రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, ప్రతి గ్రామంలో ప్రజలకు సిసి కెమెరాల పట్ల అవగాహన కల్పించి వాటి ప్రాముఖ్యతను వివరిస్తూ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. స్టేషన్‌లో కనీస మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసి పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా బాధితుల పట్ల తక్షణమే స్పందించాలని, ప్రలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ ఫిర్యాదులను పరిష్కరించాలని సూచించారు. జిల్లా ఎస్పి వెంట మార్కాపురం డిఎస్పి యు నాగరాజు,స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, వైపాలెం సిఐ ప్రభాకర్ రావు, పెద్దారవీడు ఎస్సై అనీల్ కుమార్, దోర్నాల ఎస్సై మహేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పంట వేసిన రైతు ఈకేవైసీ చేపించాలి - ఏవో



**చిన్నగంజాం, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**
పంట వేసిన ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు, ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కే.భాస్కరరావు అన్నారు. మంగళవారం మండలంలోని మోటుపల్లి, పల్లెపాలెం గ్రామాలలో వ్యవసాయాధికారి కే.భాస్కరరావు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్షేత్ర స్థాయిలో పర్యటించి రైతులతో మాట్లాడి గ్రామంలో పంట వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ పంట వేసిన ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు, ఈకేవైసీ చేయించుకోవాలని తెలియజేశారు. పంట నమోదు వల్ల కలిగే లాభాలను రైతులకు వివరించారు. పీఎం కిసాన్‌కు సంబంధించిన రైతులు ఎవరైనా ఈకేవైసీ చేయించుకోవాలని తెలియజేశారు. పీఎం కిసాన్ డబ్బు జమకాని యెడల మా దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని ఈ సందర్భంగా రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది రేవతి, రైతులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా రథసప్తమి వేడుకలు



**సంతనూతలపాడు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**
సంతనూతలపాడులోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నాడు ఘనంగా రథసప్తమి వేడుకలు జరిగాయి. స్వామివార్లకు ఆలయం చుట్టూ ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలచే కోలాట ప్రదర్శన నిర్వహించారు. అర్చకులు పి.అజయ్‌బాబు ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వరస్వామి వాళ్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో ఈ రథసప్తమి వేడుకల్లో పాల్గొన్నారు.

## పోలీసులకు సీసీ కెమెరాల సాంకేతికత తోడైతే నేరాల దర్యాప్తు వేగం

### - శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం మంచిదే

### - జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్





**పెద్దదోర్నాల, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**
పోలీసులకు సీసీ కెమెరాల సాంకేతిక సహాయం తోడైతే నేరాలను త్వరితగతిన అరికట్టవచ్చని దర్యాప్తు వేగం చేయవచ్చని జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. అదే క్రమంలో ప్రజలు చైతన్యవంతులై శాంతి భద్రతల పరిరక్షణకు తమ వంతు తోడ్పాటు అందిస్తే మంచిదేనని, సమాజానికి మేలు చేసిన వారమవుతామని జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. సాధారణ తనిఖీలలో భాగంగా మంగళవారం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్‌తో పాటు మార్కాపురం డీఎస్పీ నాగరాజు, ఎస్‌బీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కేవీ రాఘవేంద్ర, యర్రగొండపాలెం సీఐ ప్రభాకరరావు, ఎస్సై వి.మహేష్‌లతో కలిసి పెద్దదోర్నాల పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ పెద్దదోర్నాల పోలీసు స్టేషన్ ప్రాంగణం కలియతిరిగి శిథిలావస్థకు చేరిన సిబ్బంది క్వార్టర్స్, ఎస్సై క్వార్టర్, రికార్డు గది, ఆయుధాల, కంప్యూటర్ గదులతో పాటు పరిసరాలను పరిశీలించారు. బ్రిటీష్ వారి పాలనలో నిర్మించి శిథిలమై ఉన్న పాత ఎస్సై క్వార్డర్‌ను పడగొట్టి చదును చేసి ఉంచారు. ఆ స్థలాన్ని కూడా పరిశీలించారు. నిరూపయోగంగా ఉండటంతో ఉపయోగంలోకి తెచ్చేందుకు సిబ్బంది క్వార్టర్స్‌ను పడగొట్టి నూతన నిర్మాణం, పాత స్థలంలో గెస్ట్ హౌస్ నిర్మించేందుకు సమాలోచనలు చేశారు. జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ విలేకర్లతో మాట్లాడుతూ శాంతి భద్రతలు కాపాడుటకు పోలీసు నిరంతరం అప్రమత్తంగానే ఉంటుందని, పెరిగిన సాంకేతిక పరిస్థితుల దృష్ట్యా నేరాలు అరికట్టుటకు ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమేనని అన్నారు. ప్రధాన సెంటర్లలో సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలు ఏర్పాటు చేయుటకు దాతలు ముందుకు రావాలని, పోలీసుల నిఘాతో పాటు సీసీ కెమెరాలు వీధివీధిన తోడైతే జరిగే నేరాన్ని జరుగుతున్న నేరాన్ని పోలీసులు వెంటనే పసిగట్టి నేరాలు అరికట్టుటకు ఉపయోగపడుతుందని, ప్రజల భాగస్వామ్యం కూడా మంచిదేనని అభిప్రాయపడ్డారు. పెద్ద దోర్నాల ఎస్సై వి.మహేష్ పోలీసు స్టేషన్‌కు మరమ్మత్తులు చేయించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని, అదే క్రమంలో పెద్దదోర్నాల పట్టణంలోని పలు వీధులలో సీసీ కెమెరాలు అమర్చి సీసీ కెమెరాల నిఘాలో పెద్దదోర్నాల అనే విధంగా చేశారని విలేకర్ల ఎస్పీ దృష్టికి తీసుకెళ్లగా ఎస్సై వి.మహేష్‌ను ఎస్పీ అభినందించారు. సీసీ కెమెరాల పుటేజ్ ఆధారంగా దర్యాప్తు వేగవంతం అవుతుందన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు పోలీసులకు డబ్బులు ఇవ్వవలసిన పనిలేదని, సీసీ కెమెరాలు దాతలే తెస్తే వాటిని అవసరమైన ప్రదేశాల్లో ఏర్పాటు చేసి నిఘా ఉధృతం చేస్తామన్నారు. పోలీసులు ఫ్రెండ్లీ పోలీసులుగా ఉండాలని,అదే క్రమంలో రౌడీలు గూండాల పట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు. పోలీసు సిబ్బంది క్రమశిక్షణ, నిబద్ధత కలిగి అంకితభావంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. పోలీసు స్టేషన్ పరిధిలో లా అండ్ ఆర్డర్ నేర నివారణ వ్యూహాలపై అధికారులను ఆరా తీసి పలు సూచనలు చేశారు. పెండింగ్ కేసు వివరాలను తెలుసుకుని వాటిని త్వరితగతిన దర్యాప్తు చేసి తక్షణమే ఫిర్యాదుదారులకు పరిష్కారం అందించాలని సూచించారు. మహిళల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని చిన్నారులపై జరిగే ఆకృత్యాలకు సంబంధించి వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. స్కూల్స్, కళాశాల విద్యార్థినీ, విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, గంజాయి లాంటి డ్రగ్స్ వలన కలిగే అనర్ధాల గురించి, ప్రజలకు ఫేక్‌లోన్ యాప్స్, ఇన్వెస్ట్మెంట్ లోన్ ఫ్రాడ్స్, ఓటీపీ మోసాలు, ఇతర సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని, అది భారం కాదు బాధ్యత అని అన్నారు. దిగువ శ్రీశైలంగా పేరొందిన పెద్దదోర్నాల యాత్రికుల కేంద్రమని, శ్రీశైలం మహాక్షేత్రానికి దేశం నలుమూలల నుండి యాత్రికులు వస్తుంటారని, పండుగ వేళలో అశేష జన వాహినితో ట్రాఫిక్ జామ్ అవుతుందని, వీటిని నియంత్రించేందుకు డ్రోన్ కెమెరాల ద్వారా పరిశీలించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టవచ్చని, దాతలు ముందుకు వచ్చి డ్రోన్ కెమెరాల ఏర్పాటుకు కూడా సహకరించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని, వారి పట్ల నిరంతరం నిఘా ఉంచాలన్నారు. తరచూ విజువల్ పోలీసింగ్ నిర్వహించి నేరాలు కట్టడి చేయాలన్నారు. సైబర్ నేరాల అడ్డుకట్టకు అవగాహన అసలైన అస్త్రమని అన్నారు.

## సమస్యను పరిష్కరించకుండా వైసీపీ నాయకులుపై నిందలు వేయడమా


### - వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడటం ఎమ్మెల్యే కందుల అవివేకం

### - సల్లూరు సంఘటనపై మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు




**కొనకనమిట్ల, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**
ఇటీవల పొదిలి మండలం సల్లూరులో జరిగిన స్మశానంలో దహన సంస్కరణాలపై వాస్తవాలు తెలుసుకోకుండా వైసీపీ వర్గీయులు సహకరించలేదనడంలో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి తగదని వైసీపీ మార్కాపురం నియోజకవర్గ సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు తీవ్ర విమర్శలు చేశారు. మంగళవారం పొదిలిలో మీడియా సమావేశంలో మాట్లాడారు. వెలగల వెంకటేశ్వర్లు అనే యాదవ కులానికి చెందిన వ్యక్తి మృతి చెందాడు. గ్రామంలోని స్మశానంలో దహన సంస్కరణలు చేసేందుకు వేరే ఉన్నత వర్గానికి చెందిన వారు అడ్డుకున్నారు. ఆ సమస్యను పరిష్కరించేందుకు తహశీల్దార్, ఎస్సై, సీఐలు వెళ్ళిన సమస్య పరిష్కారం కాకుండానే పెద్దది చేశారన్నారు. ఒక వర్గానికే కొమ్ము కాచారా, సమస్యను పరిష్కరించే దానికి చేశారా అనేది ఎమ్మెల్యే కందుల ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. తాను గిద్దలూరు ఎమ్మెల్యేగా, ఇన్‌ఛార్జిగా 15 సంవత్సరాలు కొనసాగానని ఏ లాంటి వివాదాలు సృష్టించలేదని , గ్రామాలు ప్రశాంతంగా ప్రజలు ఇబ్బందులు లేకుండా ఉన్నారని గుర్తు చేశారు. నేను వివాదాలకు పోయే వ్యక్తిని కానని, వైసీపీ నాయకులను విమర్శించడం తగదన్నారు. ఈ సమావేశంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి, మాజీ మండల కన్వీనర్ గుజ్జుల సంజీవరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్‌లు జి.శ్రీనివాసులు, గుజ్జుల రమణారెడ్డి, మాజీ మండల కన్వీనర్ శేఖర్ రబ్బాని భాషా, మాజీ కోఆప్షన్ మెంబర్ షేక్ మహబూబ్ భాషా, గుజ్జుల గిరిబాబు రెడ్డి, ముల్లా జాకీర్ రాముడు, శ్రీనివాస్‌రెడ్డి, కోదం రామిరెడ్డి, గుజ్జుల సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు మైక్ సెట్ బహుకరించిన విశ్వేశ్వరరావు



**పొన్నలూరు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**
మండలంలోని రావులకొల్లు మండల పరిషత్ పాఠశాలకు విశ్రాంత కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి, ఆంధ్ర రత్న అవార్డు గ్రహీత, విద్యాదాత, కొండపి విశ్వేశ్వరరావు మైక్‌సెట్‌ను బహుకరించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరావు మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల ఉపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్ మైక్ సెట్ బహుకరించిన విశ్వేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

## సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన



**గిద్దలూరు రూరల్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**
మండలంలోని జయరాంపురం గ్రామంలో మంగళవారం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మిరప పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతుల మీద రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రాజెక్టు అధికారి సిద్ధేశ్వరరెడ్డి, ఉద్యానవన శాఖ అధికారిణి విష్ణుప్రియలు పాల్గొని మిరప పంటలో సమగ్ర యాజమాన్యం గురించి రైతులకు అవగాహన కల్పించారు. అధికారి సిద్దేశ్వరరెడ్డి మాట్లాడుతూ మిరప పంటలో అధిక దిగుబడులు సాధించాలంటే మంచి దృఢమైన, ఆరోగ్యకరమైన నారు ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. మిరపలో రసం పీల్చే పురుగులు, తెగుళ్ళ, వైరస్ నివారణకు విత్తన శుద్ధి తప్పకుండా చేయాలని సూచించారు. విత్తనం ద్వారా వ్యాప్తి చెందే వైరస్‌ను నివారించడానికి ట్రైసోడియం ఆర్థోఫాస్ఫేట్‌తో విత్తన శుద్ధి చేయాలని అలాగే మిరపలోని రసం పీల్చే పురుగుల నివారణకోసం ఇమిడాక్లోప్రైడ్ అనే పొడి మందును కిలో విత్తనానికి 8గ్రాములు పట్టించి విత్తన శుద్ధి చేయాలని అలాగే తెగుళ్ళ నివారణకు 3గ్రాములు మాంకోజెబ్ లేదా కెప్టన్ మందును 1కెజీ విత్తనానికి పట్టించి విత్తన శుద్ధి చేయాలన్నారు. అలాగే మిరప పంటలో ఎరువుల యాజమాన్యం చాలా ప్రాముఖ్యమని పచ్చి రొట్టఎరువులు వేసుకుని భూమి సాంద్రతను పెంచుకోవచ్చని అలాగే కాంప్లెక్స్ ఎరువుల వాడకం తగ్గించే సూటి ఎరువుల వాడకం పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు మరియు రైతుసేవా కేంద్రం సిబ్బంది నూర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రీడింగ్ రూమ్ ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం పంపిణీ

### - ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కందుల




**మార్కాపురం,ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**

ఎస్.సి. వి. కె నిలయం !! రీడింగ్ రూమ్ వెల్ఫేర్‌సొసైటీ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం రీడింగ్ రూమ్ ఆవరణంలో రథసప్తమి పండగ సందర్భంగా వచ్చిన భక్తులకు అల్పహారం పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి శాసన సభ్యులు కందుల నారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైన భక్తులకు అల్పాహారం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో రీడింగ్ రూమ్ అధ్యక్షులు డాక్టర్ ఐ.బాల సుబ్బారావు, సెక్రటరీ గుంటక సుబ్బారెడ్డి,ఉపాధ్యక్షులు శాసనాల వీరబ్రహ్మం,కోశాధికారి ప్రగాళ్లపాటి మల్లికార్జున రావు జాయింట్ సెక్రటరీ మసాని మోహన్ రెడ్డి,గుంటక వెంకటరెడ్డి,ఆర్ కె జి నారసింహం, వెన్న వెంకట రెడ్డి ,మద్దాల లక్షి ్మ వెంకట నాగ కృష్ణ రావు, యక్కలి రమేష్, పఠాన్ హుస్సేన్ ఖాన్, మొగుళ్లరి మల్లికార్జున రావు, రెడ్డి సంఘం అధ్యక్షులు గుంటక సుబ్బారెడ్డి , సూరే వెంకటేశ్వర్లు, రామదుగు శ్రీనివాసమూర్తి , కుందూరు వెంకటేశ్వరరెడ్డి, తాళ్లపల్లి ఆదినారాయణ మరియు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విత్తన ఉత్పత్తి దారులుకి ఒప్పంద పత్రాలు తప్పనిసరి



**దొనకొండ,ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**

మొక్క జొన్న విత్తన ఉత్పత్తి దారులుకి ఒప్పంద పత్రాలు తప్పనిసరి ఈ సంవత్సరం రబీ పంట కాలంలో మొక్క జొన్న విత్తనాలు ఉత్పత్తి చేసే ప్రతి రైతు కంపెనీలతో ఒప్పందం చేసుకొని అగ్రిమెంట్ కాపీ తీసుకోవాలని మండల వ్యవసాయధికారి వి. లక్షీ ్మనారాయణ కోరారు. ఈ రోజు పొలం పిలుస్తోంది కార్యక్రమం లో భాగంగా కొచర్ల కోట రైతు సేవా కేంద్రం పరిధిలోని రైతులతో నిర్వహించిన సమావేశం లో మాట్లాడుతూ మండలం లో సుమారు 100 ఎకరాల్లో పలు కంపెనీ ల మొక్క జొన్న విత్తనోత్పత్తి కోసం నాటా రని రైతులు తప్పని సరిగా వారితో ఒప్పందం చేసుకొని అగ్రిమెంట్ కాపీ తీస్కొని భద్ర పరచుకోవాలని కోరారు. లేనిచో భవిష్యత్‌లో వచ్చే పరిణామాలకి వారే పూర్తి భాద్యత వహించు కోవలసి వస్తుందని హెచ్చరించారు. తక్కువ కాలం లోనే ఎక్కువ దిగుబడి, ఎక్కువ ధర ఇస్తామని నోటి మాటలను నమ్మవద్దని, ఏ విషయమైనా అగ్రిమెంట్ బాండ్ లో వ్రాత పూర్వకంగా ఇవ్వాలని కంపెనీ వాళ్ళతో మాట్లాడు కోవాలని సూచించారు.తర్వాత బసిరెడ్డిపల్లి, సిద్దయపాలెం, కొచర్ల కోట గ్రామాల్లో సాగులో వున్న మొక్కజొన్న, మినుములు, మిరప పంటలని రైతులతో కలిసి పరిశీలించి వారడిగిన సమస్యలకి సలహాలిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు డి. ఈశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

## క్యాన్సర్ వ్యాధి దినోత్సవం పై అవగాహన ర్యాలీ



**సింగరాయకొండ, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**

ప్రపంచ క్యాన్సర్ వ్యాధి దినోత్సవం సందర్భంగా మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని కందుకూరు రోడ్డు నుండి పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీని చేపట్టారు.ఈ కార్యక్రమాన్ని ఆరోగ్యకేంద్రం డాక్టర్ చైతన్యకృష్ణ, ధీరేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భం గా చైతన్య కృష్ణ మాట్లాడుతూ మంచి సమతుల ఆహారపు అలవాట్లు, వ్యాయామం చేస్తూ జంక్ ఫుడ్, మద్యపానం ధూమపానంకు దూరంగా ఉంటే క్యాన్సర్ ను నివారించవచ్చునన్నారు. మహిళలకు రొమ్ము,గర్భాశయం ముఖద్వారా క్యాన్సర్ అధికంగా వస్తున్నాయని, వీటిని త్వరగా గుర్తించేందుకు ఓరల్ సర్వైకల్ పరీక్షలు ద్వారా క్యాన్సర్లును గుర్తించవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్ ఆలీ, విజయమ్మ, రాజమ్మ,సంపూర్ణమ్మ సి హెచ్ఓలు, ఆశా కార్యకర్తలు ఆరోగ్య సహాయకులు పాల్గొన్నారు.

## ప్రకాశం జిల్లాను అమరావతి హైకోర్టులో కొనసాగించాలి



**సింగరాయకొండ ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**

కర్నూలులో నూతనంగా ఏర్పాటు అయ్యే హై కోర్టు బెంచ్‌లో ప్రకాశం జిల్లాను మినహాయించాలని, పాత విధానంగా అమరావతి హైకోర్టులో కొనసాగించాలని తెలుగుదేశం పార్టీ జిల్లా న్యాయ విభాగం అధ్యక్షులు సన్నిబోయిన శ్రీనివాసులు నాయుడు మంగళవారం ఓ ప్రకటన లో తెలిపారు. ఒంగోలు నుండి అమరావతి హైకోర్టుకు అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయని, కర్నూల్ హైకోర్టు బెంచ్ కు వెళ్లాలంటే ఒక బస్సు సౌకర్యం మాత్రమే ఉన్నదని, అదేవిధంగా ఒంగోలు నుండి కర్నూలుకు వెళ్లాలంటే 128 కి. మీ దూరం ప్రయాణం చేయాలంటే కక్షి దారులు,న్యాయ వాదులకు డబ్బు, సమయం వృధా అవుతుందని,దానిని దృష్టిలో ఉంచి కర్నూల్ బెంచ్ నుండి ప్రకాశం జిల్లాను మినహాయించాలని కోరారు.

## గ్రామంలో రిజిస్ట్రేషన్ సమస్యపై విచారణ




**సింగరాయకొండ, ఫిబ్రవరి 4,ప్రభాతవార్త**

మాళంపుపాడు గ్రామంలో జరిగిన రీ సర్వే, ఎల్పీ నెంబర్ సమస్యతో నిలిచిపోయిన రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు మీకోసం కార్యక్రమం లో జిల్లా కలెక్టర్కు అర్జీను రూపంలో విన్నవించారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించడంతో డిప్యూటీ కలెక్టర్ వర ప్రసాద్,స్థానిక తహసీల్దార్ టి. రవికుమార్, రెవిన్యూ సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు రీ సర్వేపై వచ్చిన సమస్యలు పై కొన్ని సర్వే నెంబర్లు కు రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిచి పోయిందని రెవిన్యూ అధికారులు కు తెలియజేసారు. పూర్తిస్థాయిలో రీ సర్వేపై వచ్చిన సమస్యలను పరిశీలించి త్వరగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగించేందుకు చర్యలు చేపడతామని గ్రామస్తులకు తెలిపారు .ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ సెల్ల అధ్యక్షులు సన్నిబోయిన శ్రీనివాసులు నాయుడు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ప్రసాద్, టిడిపి నాయకులు చిరుపోటి గిరి, నరాల సుధాకర్, మల్లికార్జున, రెవెన్యూ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

## మాఘమాసం వచ్చింది....

### - శుభ ముహూర్తాలు తెచ్చింది..





**ఒంగోలు కల్చరల్,ఫిబ్రవరి 4,ప్రభాతవార్త**

పండగ నెల శూన్య మాసం అనంతరం గృహప్రవేశం వివాహాలుమాఘమాసం శుభకార్యాలకు మంచి ముహూర్తాలు... ఒక్కటి కానున్న వేలాది జంటలు....కళ్యాణ మండపాలకు డిమాండ్...ఒంగోలు కల్చరల్ ఫిబ్రవరి 4 (ప్రభాతవార్త) వేదమంత్రాల మధ్య ఒక్కటవుతున్న నూతన జంటలమాఘ మాసం స్వాగతం పలుకుతుంది. డిసెంబర్ నెల నుండి ధనుర్మాసం పండగ నెల మొదల్లె పెద్ద పండగ సంక్రాంతి పండగ వివర వరకు ముహూర్తాలు లేకపోవడంతో శుభకార్యాలకు మాఘమాసం ఫిబ్రవరి నెల 2 తేదీ నుండి మొదలై ఫాల్గుణ మాసం మార్చి నెల కొత్త సంవత్సరం విశ్వావాసు నామ ఉగాది కి చైత్రమాసం, వైశాఖమాసంలో మంచి ముహూర్తాలు ఉన్నాయని అర్చక స్వామి రాము శర్మ తెలిపారు. ఫిబ్రవరి నెల లోనే ప్రకాశం జిల్లా వ్యాప్తంగా సుమారు 1000 పైగా జంటలు ఈ మాఘమాసం లోమంచి ముహూర్తాలు అధికంగా ఉండడంతో మాఘ మాసం లో చేసుకొనే జంటలు ఒకటి కానున్నాయి. ఇప్పటికే ముహూర్తాలు పెట్టుకున్న వారి ఇళ్లల్లో పెళ్లి హడావుడి మొదలైంది. మాఘమాసంలో కైలాస గౌరి నోములు వ్రతాలతో వివాహ శుభకార్యాలకు అవసరమయ్యే కళ్యాణ మండపాలు, పురోహితులకు, డెకరేషన్, క్యాటరింగ్ వాళ్లకు, పురోహితులకు మంచి గిరాకీ ఏర్పడింది, కళ్యాణ మండపాలకు ముందస్తు బుకింగ్ లు చేసుకుంటున్నారు, ధరలు కూడా గతం కంటే ఈసారి ధరలు ఎక్కువగా ఉన్నాయి.మాఘ మాసం శివానుగ్రహం..పరమేశ్వరుడు మహాశివరాత్రి రోజున రాత్రి సమయాన లింగోద్భవం భక్తులకు దర్శనం ఇచ్చిన రోజు భక్తులు ఉపవాసాలు జాగరణతో మహాశివరాత్రిని భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. ఈ మాఘ మాసంలో మహిళా శుభకార్యలు కైలాసగౌరీ నోములు వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో కలియుగ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు. మరియు శ్రీశైలం ముక్కంటికి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా కనుల పండగ నిర్వహిస్తారు. పండగ పర్వదినాలు ఈ మాఘ మాసంలోనే వస్తాయి.మాఘమాసంలో మంచి ముహూర్తాలు ఫిబ్రవరి మాఘమాసం 2,3,7, 13, 14, 18 19 20, 21 23 25, మార్చి నెల ఫాల్గున మాసం లో 1,2,67,12, ఏప్రిల్ నెల చైత్రమాసం లో 14 16 18 19 20 21 25 29 30, మే నెలలో వైశాఖమాసం 1 5 6 8 15 17 18 జూన్ నెలలో జేష్ఠ మాసం. 1 4 7 తేదీలలో వివాహా ,గృహ రంభ, గృహప్రవేశాలకు బలమైన ముహూర్తాలు ఉండటం వల్ల ఆ తేదీలు ఆ మాసాలలో అధికం సంఖ్యలో వివాహ శుభకార్యాలు జరుగుతున్నాయని అర్చక స్వామి రాము శర్మ తెలిపారు.

## రోటరీ ఆధ్వర్యంలో 440వ రక్తదానం కార్యక్రమం



**అద్దంకి , ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**

రక్తహీనత సమస్యతో బాధపడుతున్న కాకాని పాలెం నివాసి సందిరెడ్డి హనుమయమ్మ (85)కు వైద్యులు అత వ్యసరంగా బి.పాజిటివ్ రక్తం ఎక్కించ వలసినది అని చెప్పగా, రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి వారి ఆధ్వర్యంలో రోటరీ బ్లడ్ బ్యాంకు డైరెక్టర్ కార్యదర్శి చుండూరి మురళీ సుధాకరరావు పాత దామావారిపాలెంనికి చెందిన షేక్ అబ్దుల్ మాలిక్ (52)ని ప్రోత్సహించి రక్తదానం చేయించారు. ఇది చుండూరి మురళీ సుధాకరరావు ప్రోత్సహించిన 440వ రక్తదానం. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, అనంతరం చుండూరి మురళీ సుధాకరరావుని, రక్త దాత అబ్దుల్ మాలిక్‌ని రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య అభినందించారు.

## యాంత్రీకరణ పద్ధతిలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోండి - ఏడిఎ



**అద్దంకి , ఫిబ్రవరి 4 , ప్రభాతవార్త**

ఆధునిక వ్యవసాయ యాంత్రీకరణ పద్ధతులతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవచ్చునని అద్దంకి సహాయ వ్యవసాయ సంచాలకులు కె.ధన్‌రాజ్ అన్నారు. బొమ్మనంపాడు మరియు జార్లపాలెం గ్రామాలలో నిర్వహించినపొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ మాట్లాడుతూ డ్రోన్‌లా ద్వారా రసాయనిక ఎరువులు మరియు పురుగుమందుల పచికారి ద్వారా సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చని తెలిపారు. మండలంలో రాయితీ పై డ్రోన్‌లు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ రైతులకు రైతు రిజిస్ట్రేషన్ ద్వారా ప్రత్యేక సంఖ్యను కేటాయించడం జరుగుతుందని, ప్రతి రైతు తమ ఆధారాలను గ్రామ వ్యవసాయ సహాయకులుకు సమర్పించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని దీని ద్వారా రాబోయే రోజుల్లో అన్నీ వ్యవసాయ పథకాలు వర్తిస్తాయని తెలిపారు. ఈ పంట నమోదు 10వ తేదితో ముగియనున్నదని ఈ లోపు తాము సాగు చేసిన పంటలు రైతులు నమోదు చేయుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కోటేశ్వరరావు, గ్రామ వ్యవసయ సహాయకులు వీర శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఛలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ



**అద్దంకి , ఫిబ్రవరి 4 , ప్రభాతవార్త**

అద్దంకి ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఛలో హైదరాబాద్ పోస్టర్ ఎమ్మార్పీఎస్ అద్దంకి నియోజకవర్గం ఇన్‌చార్జిలు తేల శ్రీనివాసరావు, పూనూరి రమేష్, అవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు నరేంద్ర మాట్లాడుతూ ప్రతి ఎమ్మార్పీఎస్ కార్యకర్త మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు హైదరాబాద్ వచ్చి లక్ష డప్పులు, వేయి గొంతులు అని కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసినదిగా, మాదిగ సమాజానికి పిలుపునిచ్చారు. హైదరాబాద్ వచ్చేటప్పుడు ప్రతి ఒక్క ఎమ్మార్పీఎస్ కార్యకర్త డప్పుతో పాటు తెల్ల షర్టు, నల్ల ప్యాంటు ధరించి రావలసినదిగా ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ టౌన్ ప్రసిడెంట్ ఆంటోని, బుల్లియ్య, అద్దంకి మండల అధ్యక్షులు చక్రవర్తితోపాటు ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కిమ్స్ ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన



**కొరిశపాడు , ఫిబ్రవరి 4 , ప్రభాతవార్త**

మండలంలోని తమ్మవరం గ్రామంలో మంగళవారం ప్రముఖ కార్పోరేట్ వైద్యశాల కిమ్స్ వైద్యులు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఉదయం నుంచి మండలంలోని పలు గ్రామాల నుంచి రోగుల రాకతో పంచాయతీ కార్యాలయం కిటకిటలాడింది. ఈ శిబిరంలో బిపి, షుగరు, గుండె జబ్బులతో బాధపడే వారితో పాటు పలువురు నేత్ర సంబంధిత వ్యాధులు వారు కూడ పరీక్ష చేయించుకున్నారు. వీరందరికీ ఉచితంగా పరీక్షలు చేయడంతో పాటు మందులను కూడ ఉచితంగానే అందజేశారు. శస్త్రచికిత్సలు వంటి వైద్య సేవలను అందించడానికి ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ పథకం కింద గుర్తించి వారిని ఒంగోలు కిమ్స్ వైద్యశాలకు తరలించడానికి ఏర్పాటు చేస్తామన్నారు. ఈ శిబిరంలో మండలంలోని పలు గ్రామాల నుంచి సుమారు 300కు పైగా రోగులు వైద్యసేవలు పొందినట్లు సిబ్బంది తెలియజేశారు. ఈ శిబిరంలో కిమ్స్ వైద్యులు డాక్టర్ కట్టా సాయితేజ, రామాంజనేయులు, విజయలక్ష్మి, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు. ఈ శిబిరానికి సహకరించిన గ్రామ సర్పంచ్ శివ నాగేంద్ర వీరాంజనేయులు లకు వైద్యులతోపాటు గ్రామస్తులు కూడ అభినందనలు తెలియజేశారు.

## ప్రతి రైతన్నాకూ ఫార్మర్ ఐడి ...



**దొనకొండ, ఫిబ్రవరి 4 , ప్రభాతవార్త**

దొనకొండ మండలంలో పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతు వివరాలని ఫార్మర్ రిజిస్ట్రీ నందు నమోదు చేసి ప్రత్యేక ఫార్మర్ ఐడి ఇస్తామని మండల వ్యవసాయ అధికారి వి. లక్షీ ్మ నారాయణ తెలిపారు .ఈరోజు రామాపురం రైతు సేవా కేంద్ర పరిధిలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమం లో రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ప్రతి రైతు సిబ్బంది తో సహకరించి పేర్లు నమోదు చేయించకోవాలని రైతులని కోరారు. ఆధార్ నెంబర్ మాదిరి ప్రతి రైతుకి ప్రత్యేక సంఖ్య ని కేటాయిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కేంద్ర ప్రభుత్వము తీసుకొచ్చిన "ఫార్మర్ రిజిస్ట్రీ " కార్యక్రమాన్ని గురించి రైతులకు వివరించి,దీని ద్వారా ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను (ఐడి నంబర్ ) కేటాయించటం జరుగుతుందని తెలిపారు.గ్రామ వ్యవసాయ, ఉద్యాన మరియు పట్టుపరిశ్రమ సహాయకులు ఫార్మర్ రిజిస్ట్రీ వెబ్సైట్లో రైతుల వివరాలు నమోదు చేస్తారు. రైతు రిజిస్ట్రీ పోర్టల్ లో నమోదు చేసిన తర్వాత రైతుకు ప్రత్యేక సంఖ్యను కేటాయిస్తారు. అన్ని రైతు సేవా కేంద్రాల్లో వెసలు బాటను కల్పించనున్నారు. అర్హులు: భూమి గల రైతు, కౌలు రైతు, వ్యవసాయ కూలీ, వ్యవసాయ ఆధారిత వృత్తులపై జీవించేవారు. నమోదు చేసేందుకు కావలసినవి : రైతు ఆధార్ సంఖ్య, పట్టాదారు పాసుబుక్, చరవాణి నంబర్. ప్రయోజనాలు: అర్హులైన రైతులను గుర్తించటం, ప్రభుత్వం నుంచి వచ్చే వివిధ రకాల రాయితీలు, భూ ఆధారిత చెల్లింపులు అయినటువంటి పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల బీమా,పంట నష్టపరిహారం, పంట రుణాలపై వడ్డీ రాయితీ, రాయితీ ద్వారా వ్యవసాయ పనిముట్లు అందించుట మొదలైనవి ఫార్మర్ రిజిస్ట్రీ నెంబర్ ఉన్నవారికి అందించడం జరుగుతుందని తెలిపారు.మార్కాపురం ఉద్యాన శాఖధికారి రమేష్ గారు మాట్లాడుతూ ప్రస్తుతం మిరప పంట లో వున్న నల్ల తామర పురుగు నివారణ చర్యలని వివరించారు. వేసవిలో నీటి వసతి కల రైతులు కూరగాయల సాగు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమం లో గ్రామ రైతులు, గ్రామ వ్యవసాయ సహయకులు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## మిరప పంటను పరిశీలించిన ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు



**మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**

మంగళవారం మండలంలోని బొందలపాడు, మాల్యవంతునిపాడు గ్రామాల యందు మండల వ్యవసాయ శాఖాధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు అధ్యక్షతన మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో కలిసి గ్రామాల్లో సాగు చేసిన మిరప పంటను పరిశీలించారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడుతూ ప్రస్తుతం మిరప కోతల సమయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పుడే కాయ నాణ్యత బాగుండి, రంగు ఆకర్షణీయంగా ఉండి మంచి ధర లభిస్తుందని తెలిపారు. దాని వలన మందుల అవశేషాలు ఉండవని తెలిపారు. బాగా రంగు ఉండి పక్వానికి వచ్చిన కాయలను కోయాలని దీని వలన మిరపకు మంచి ధర లభిస్తుందని తెలిపారు. బొందలపాడు, మాల్యావంతుని పాడు గ్రామాల యందు గ్రామసభలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాల్యవంతునిపాడు, బొందలపాడు రైతు సేవాకేంద్రాల సిబ్బంది నాగవేణి, రమణి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## పెద్దదోర్నాలలో దొంగతనం



**పెద్దదోర్నాల, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**

పెద్దదోర్నాల ప్రభుత్వ వైద్యశాలలో స్టాఫ్ నర్సుగా పని చేస్తు పాల్తి రాజేష్ ఇంట్లో సోమవారం రాత్రి దొంగతనం జరిగింది. పెద్ద దోర్నాలకు చెందిన చందలూరు మస్తాన్‌రెడ్డి ఇంట్లో రాజేష్ అద్దెకు ఉంటున్నాడు. తన కుమారుడికి బాగాలేనందున భార్య, కుమారుడు గుంటూరు వైద్యశాలలో ఉంటున్నారు. రాజేష్ పెద్ద దోర్నాల ప్రభుత్వ వైద్యశాలలో రాత్రి డ్యూటీలో ఉండగా ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంటి కటాంజనము, బీరువా తాళాలను పగలగొట్టి బీరువాలోని పది వేల నగదు, రాజేష్ కుమారునికి చెందిన రెండు బ్రాస్లెట్లు, నాలుగు ఉంగరాలు దొంగలించారు. పెద్దదోర్నాల ఎస్సై వి.మహేష్ దొంగతనం జరిగిన ఇంటిని పరిసరాలను క్లూస్ టీమ్‌తో కలిసి పరిశీలించారు. కేసు నమోదు చేసి ఎస్సై వి.మహేష్ దర్యాప్తు చేస్తున్నారు.

## రథసప్తమి వేడుకలలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్




**మార్కాపురం, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**

చారిత్రాత్మక శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి వారి దేవాలయంలో జరుగుతున్న రథసప్తమి వేడుకల లో మంగళవారం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం జరుగుతున్న సప్త వాహనమహోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులతో కలిసి భద్రతా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. దేవాలయం ఆలయ పరిసరాలు,ప్రవేశ మార్గములు,రథసప్తమి కీలక ఘట్టమైన రజిత రథంవద్ద భద్రతా,బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. దేవాలయం,పోలీసు అధికారులతో , ఆలయకమిటీ సభ్యులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. దర్శనానికి విచ్చేసేభక్తులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయం వద్ద బందోబస్తు ఏర్పాట్లు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికబద్ధంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టాలని, అధికారులకు శాంతి భద్రతల గురించి వివరించారు. మార్కాపురం డీఎస్పీ నాగరాజు,స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర,మార్కాపురం సీఐ సుబ్బారావు, మార్కాపురంటౌన్ ఎస్సై సైదుబాబు,రూరల్ ఎస్సై అంకమరావు, ఎస్సై రాజమోహన్‌రావు, ట్రాఫిక్ ఎస్సై అహరోను, సిబ్బంది ఉన్నారు.

**ఎన్‌సీసీ విద్యార్ధులకు అభినందనలు :**

రథసప్తమి సందర్భంగా జరుగుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమం, సప్త వాహనాల సేవా కార్యక్రమాలలో స్తానిక వాసవి విద్యానికేతన్ పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొని సేవలు అందించడం పట్ల జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ విద్యార్ధులను అభినందించారు. చదువుతో పాటు సేవా కార్యక్రమాలలో, క్రీడలలో శ్రద్ధ చూపి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆలయ సరదాగా గడిపారు. ఇలాంటి కార్యక్రమాలలో పాలుపంచుకున్న వాసవి విద్యానికేతన్ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు.

## రథసప్తమి సూర్య జయంతి సందర్భంగా

### సింగరకొండలో ప్రత్యేక పూజలు



**అద్దంకి , ఫిబ్రవరి 4 , ప్రభాతవార్త**

బాపట్ల జిల్లా అద్దంకి మండలం సింగరకొండ క్షేత్రములో కొలువై వున్న శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వారికి మంగళవారం మాఘశుద్ధ సప్తమి అశ్విని నక్షత్రం రథసప్తమి సూర్యజయంతి సందర్భంగా శ్రీ పద్మినీ ఉషా ఛాయా సమేత శ్రీ సవితృసూర్యనారాయణ స్వామివారి పూజ అత్యంత వైభవోపేతంగా జరిగింది. ముందుగా వేదపండితులు అర్చకులు గణపతి పూజ చేసి సూర్య భగవానునికి షోడశోపచారాలతో పూజించడం జరిగింది. గోధుమ రవ్వతో పొంగలి చేసి నైవేద్యం సమర్పించి హారతి మంత్రపుష్పం తీర్థ ప్రసాదాలు భక్తులకు ఇచ్చి ఆశీర్వదించినారు. ఈ కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైఫల్యాలపై వైసీపీ పోరాటం ఆగదు



**బల్లికురవ, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**

అధికారమే లక్ష్యంగా ఎన్నికల వేళ అబద్ధపు హామీలను ప్రకటించి టీడీపీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ దేవినేని కృష్ణబాబు అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని సోమవరప్పాడు, కొత్తూరు గ్రామాల్లో స్థానిక వైసీపీ నేతలతో, కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. సంస్థాగతంగా గ్రామాలలో బూత్ స్థాయి నుండి ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయడంతో పాటు గ్రామ పార్టీ కమిటీల ఎంపిక కూడా కొనసాగుతుందన్నారు. గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తూనే ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాలలో బజారుకో గొలుసు షాపు నిర్వహిస్తూ ప్రజలను నిలువునా దోచుకుంటున్నారన్నారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అన్నారు. నెలలు గడిచిపోతున్న ఇచ్చిన హామీని మర్చిపోతున్నారన్నారు. మెగా డీఎస్సీ అంటారు, నిరుద్యోగ బృతి అంటారు, తల్లికి వందనం లేదు, ఇలా చెప్పుకుంటూ పోతే ఏ ఒక్క హామీని ప్రభుత్వం నెరవేర్చలేదని, ఇచ్చిన హామీల అమలుకై గ్రామ స్థాయి నుండి ప్రభుత్వ విధానాలపై పోరాటం చేస్తామన్నారు.

## కత్తెర పురుగు నివారణకు చర్యలు చేపట్టండి



**బల్లికురవ, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**

మండలంలోని చెన్నుపల్లి, ముక్తేశ్వరం గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులతో కలిసి వ్యవసాయాధికారి కుమారి మొక్కజొన్న పొలాలను సందర్శించి కత్తెర పురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఆమె రైతులతో మాట్లాడుతూ రబీ పంట నమోదు చివరి దశలో ఉందని, రైతులు పంట వివరాలు ఖచ్చితంగా నమోదు చేశారో లేదోనిర్ధారించుకొని ఈకేవైసీ వేయాలని తెలిపారు. రైతులకు ప్రత్యేక గుర్తింపు నెంబర్ కోసం అగ్రిస్టాక్ యాప్ ఇవ్వడం జరిగిందని, రైతులు రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించి, ఐడీ నెంబర్ జనరేట్ చేయించుకోవాలన్నారు. ఈఐడీ నెంబర్ అన్ని కార్యక్రమాల లబ్ధికి ఉపయోగపడుతుందన్నారు. రాబోయే పంట కాలానికి ముందుగా రైతులు భూసార పరీక్షలు చేయించుకుని, సూక్ష్మ పోషక లోపాలు, భూమికి క్షార గుణం ఉంటే సరిచేసుకుంటే మంచి దిగుబడులు పొందవచ్చని తెలిపారు. తొలకరిలో పచ్చిరొట్టపైర్లు పెంచుకొని భూమిలో కలియదున్నడం వలన భూసారం పెరుగుతుందన్నారు. ప్రస్తుతం కోస్తున్న పంటల వ్యర్థాలను కూడా రోటావేటర్ సహాయంతో భూమిలో కలపాలన్నారు. నేషనల్ పెస్ట్ సర్వేలన్స్ సిస్టం యాప్ ద్వారా రైతులు తమ పంటలలో ఉన్న పురుగులు,తెగుళ్లకు వెంటనే నివారణ చర్యలు తెలుసుకోవడానికి వీలవుతుందని, రైతులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకుని మంచి దిగుబడులు పొందచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు శ్రీనివాస్,రోజా, రైతులు పాల్గొన్నారు.

## క్యాన్సర్‌పై అవగాహన



**తాళ్లూరు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**

ప్రపంచ క్యాన్సర్ నిర్మూలన దినోత్సవం సందర్భంగా తూర్పు గంగవరం పీహెచ్‌సీలో వైద్యాధికారులు కే.మౌనిక, శ్రీకాంత్‌రెడ్డిలు ఏఎన్ఎం, ఆశాలకు మంగళవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్‌లు మాట్లాడుతూ పొగాకు, తంబాకు, గుట్కా ఇతర పొగాకుతో తయారు చేసే పదార్థాల వల్ల క్యాన్సర్ వస్తుందన్నారు. సిగరెట్, బీడీలు తాగవద్దని తెలిపారు. మహిళల్లో అధికంగా రొమ్ము, థైరాయిడ్, గర్భాశయ, అండాశయ క్యాన్సర్లు వస్తున్నట్లు వివరించారు. 40 ఏళ్ల దాటిన మహిళలు అనుమానం ఉంటే దగ్గరలోని క్యాన్సర్ ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

## టాలెంట్ టెస్టులో కొప్పెరపాడు విద్యార్థుల ప్రతిభ




**బల్లికురవ, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**

ఈఈఎంటీ రాష్ట్ర స్థాయి టాలెంట్ టెస్టు ఫలితాలు మంగళవారం విడుదల అయ్యాయి. ఈ ఫలితాలలో మండలం లోని కొప్పెరపాడు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి బత్తుల అభిరామ్ 68 మార్కులతో జిల్లాలో రెండో స్థానం సాధించాడు. 7వ తరగతి విభాగంలో మేకల లహరేశ్వర్ 59 మార్కులతో జిల్లాలో మొదటి ర్యాంకు సాధించాడు. ఈ విద్యార్ధులు వరుసగా రూ.6వేలు, రూ.5వేలు బహుమతిగా పొందనున్నారు. విజయం సాధించిన విద్యార్ధులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు పురంశెట్టి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు దమ్ము అంజయ్య అభినందించారు.

## ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు



**కురిచేడు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**

కురిచేడు మండలం పొట్లపాడు వద్ద రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. దొనకొండ మండలం బాధాపురం గ్రామానికి చెందిన వైదన మరియదాసు తన ద్విచక్ర వాహనంపై బాధాపురం నుండి విజయవాడకు వెళ్తుంగా కురిచేడు మండలంలోని పొట్లపాడు గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడ్డాడు. మరియదాసు కుడి కాలు ఎముక విరిగింది. ఇది గమణించిన అటుగా వెళ్తున్న ద్విచక్ర వాహనదారులు వెంటనే 108కి సమాచారం ఇవ్వగా దొనకొండ 108 అంబులెన్స్ సిబ్బంది పైలెట్ ఎం.ప్రసాదరావు, ఈఎంటీ ఎన్.ప్రసాద్‌లు అతనికి ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం వినుకొండకు తరలించినట్లు సమాచారం.

## పేదల పెన్నిధి కామ్రేడ్ నీరుకట్టు మస్తానయ్య

### - సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ

**పొమూరు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**



పేద బడుగు, బలహీన వర్గాల పాలిట ఆపద్బాం దువుడిగా వారి జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయునిగా కామ్రేడ్ నీరుకట్టు మస్తానయ్య చిరకాలం గుర్తుండిపోతారని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నేపల్లి లక్ష్మీ నారాయణ తెలిపారు. కీ.శే కామ్రేడ్ నీరుకట్టు మస్తానయ్య 26వ వర్ధంతిని పొమూరులో ఘనంగా నిర్వహించారు. తొలుత కందుకూరు రోడ్డులో గల నీరుకట్టు మస్తానయ్య స్థూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు. మస్తానయ్య ఆశయాలను సాధిద్దాం, అమరహే నీరుకట్టు మస్తానయ్య అంటూ సీపీఐ నాయకులతో పాటు ఆయన సానుభూతిపరులు నినాదాలు చేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ వందలాది మంది ప్రభుత్వ అధికారులతో ,నాయకులతో మాట్లాడి పోరాడి వారికి స్థలాలు ఇవ్వడమే కాక సొంతింటి కల నిజం చేసిన ఆదర్శమూర్తిగా ప్రశంసించారు. మస్తానయ్య నిరక్షరాస్యుడైన పేదరికంలో ఉండే వారందరూ ఉన్నత స్థానానికి ఎదగాలని ఎంతో ఆశయం కలిగి జీవించారని అన్నారు. ఏఐటీయుసీ జిల్లా నాయకులు పొలపర్తి మస్తాన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సీపీఐ నాయకులు, మస్తానయ్య అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీపీఐ నాయకులు సయ్యద్ మౌలాలి, ఆకుల మోహన్‌రావు, వజ్రాల సుబ్బారావు, రాగిపాటి సూరిబాబు, రైతు సంఘం కనిగిరి నాయకులు పేరం రఘునాథరెడ్డి, వెంకటరెడ్డి, పోతల ప్రభాకర్, వెలగపూడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మస్తానయ్య వర్ధంతి సందర్భంగా పేదలకు దుప్పట్లు పంపిణీ

**పొమూరు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**



కామ్రేడ్ నీరుకట్టు మస్తానయ్య 26వ వర్ధంతిని ఆయన కుటుంబ సభ్యులు నిరుపేదల నడుమ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి కుటుంబ సభ్యులతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ, మస్తానయ్య సతీమణి నీరుకట్టు బాలమ్మ, జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షులు డాక్టర్ ఆకుపాటి వెంకటేష్, టీడీపీ నాయకులు నీరుకట్టు నాయబ్ రసూల్‌లు మాట్లాడుతూ నిరుపేదల ఆశాజ్యోతిగా ఆయనను కొనియాడారు. ప్రతి ఒక్కరూ మస్తానయ్య బాటలో పయనిస్తే సమాజంలో అసమానతలు ఉండవన్నారు. మస్తానయ్యను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చాంద్‌భాషా, ఇండ్లా నరసింహారావు, పుప్పాల రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## శనగ, వరిలో పంటలను పరిశీలించి వ్యవసాయాధికారి

**నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**



నాగులుప్పలపాడు మండలంలోని మాచవరం, రాపర్ల గ్రామాల్లో వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖల అధికారులచే పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం జరిగింది. మండల వ్యవసాయాధికారి వెంకటరావు పొలాలను సందర్శించి రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ రబీలో పంట వేసిన ప్రతి రైతు కూడా ఈ పంట తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. శనగ పంటలో ఎర్ర మచ్చ తెగులు రాకుండా కాంటాఫ్ 400 ఎంఎల్ ఒక ఎకరానికి పిచికారి చేసుకోవాలన్నారు. శనగ పంట బెట్టకు వచ్చినట్లయితే 13-0-45 అనే నీటిలో కలిగే ఎరువులు ఎకరాకు ఒక కేజీ పిచికారి చేయాలని తెలియజేశారు. అదే విధంగా రాపర్ల గ్రామంలో వరి పంటను పరిశీలించి అగ్గి తెగులు గుర్తించి వాటి నివారణకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. రాబోయే వారం రోజుల్లో ప్రతి గ్రామంలోనూ ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు నెంబరు ఇవ్వడం మొదలు పెడతామని తెలియజేశారు. ఈ గుర్తింపు సంఖ్య రైతుకు వ్యవసాయ శాఖలో పొందే సేవలకు ఉపయోగపడుతుందని తెలియజేశారు. రైతులకు 50శాతం రాయితీ మీద స్ప్రింక్లర్లు అందజేస్తున్నామని తెలియజేశారు.

## తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

### - వ్యవసాయాధికారి స్వర్ణలత

**టంగుటూరు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**



మండలంలోని జయవరం, టి.నాయుడుపాలెం గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి జి.స్వర్ణలత ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రైతుల పైర్లను వ్యవసాయాధికారి పరిశీలించి పలు సూచనలు, సలహాలు అందజేశారు. రబీ 2024-25 సీజన్‌కు ఈ పంట నమోదు చేసుకోవాలన్నారు. శనగ, పొగాకు పంట పొలాలను సందర్శించి ప్రస్తుత వర్షాల వలన శనగ పంట సాగు చేయడం ఆలస్యం అయిన కారణంగా శనగ పంటకు తుప్పు తెగులు వచ్చే అవకాశం ఉన్నందున రైతులు తొలి దశ నుండి తెగెలు ముందు హెక్సాకొనజోల్(కాంటాఫ్) 500 మి.లీ ఒక ఎకరానికి పిచికారి చేసుకున్న యెడల తుప్పు తెగులు రాకుండా నివారించుకోవచ్చని, రైతులకు తెలియజేశారు. అదే విధంగా వివిధ పంటల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు, తెగుళ్ల నివారణ గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఐ.ప్రావీణ్యం, ఎల్.ప్రైసి రీమాల్, పశుసంవర్ధకశాఖ సహాయకులు లక్ష్మీ నారాయణ, విస్తరణ అధికారులు సీహెచ్ఎన్ శ్రీనివాసరావు, ఎన్.వెంకటేశ్వర్లు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## భాష్యం ఉచిత వైద్య శిబిరం

**చీమకుర్తి, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**

చీమకుర్తి రచ్చమిట్ట సెంటర్ నందు గల భాష్యం ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు బుధవారం ఉచిత వైద్య శిబిరంను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ జయకృష్ణ తెలిపారు. ఉదయం పది గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు హ్యాపీ డెంటల్ హాస్పిటల్ మరియు మోడరన్ కంటి హాస్పిటల్ వారి పర్యవేక్షణ లో మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో మోడ్రన్ ఐ హాస్పిటల్ ఒంగోలు నుండి డా.వెంకటరమణారెడ్డి, డా. అర్పణ షాఫర్ ఉచిత కంటి పరీక్షలు చేస్తారు. హ్యాపీ డెంటల్ హాస్పిటల్ ఒంగోలు నుండి డా.కళ్యాణవర్ధన్ మరియు హేమామాలిని ఉచిత దంత పరీక్షలు చేయనున్నారు. ఈ మెగా వైద్య శిబిరం భాష్యం ప్రకాశం జోనల్ ఇన్ ఛార్జ్ శ్రీ కృష్ణగణేష్ అధ్యక్షతన, బ్రాంచ్ ఫాలో అప్ ఇన్ ఛార్జ్ ఆజాద్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. మారుతున్న జీవన శైలికి అనుగుణంగా ప్రతి ఒక్కరు వ్యక్తిగత ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని అందుకు ఇలాంటి వైద్య శిబిరాలు ప్రోత్సాహకరంగా ఉంటాయని, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ జయకృష్ణ పిలుపునిచ్చారు.

## విద్యానికేతన్ విద్యార్థుల ప్రతిభ

**చీమకుర్తి, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**




చీమకుర్తి పట్టణంలోని విద్యానికేతన్ విద్యార్థులు జిల్లా స్థాయి అబాకస్ వేదిక్ మ్యాథ్స్ విజయం సాధించారు. స్కూల్ కరస్పాండెంట్ పి రవీంద్రబాబు మంగళవారం ఈ వివరాలను తెలిపారు. ఒంగోలులో ఈ నెల 2న జరిగిన జిల్లాస్థాయి అబాకస్ విభాగంలో పి. హేమ లక్ష్మీసింధు విజువలైజేషన్ పోటీల్లో పాల్గొని జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానం, సిహెచ్ మోక్ష సంపత్ స్టార్ జూనియర్స్ లెవెల్ 1 జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానం, పి సాయి దక్షిత్ జూనియర్ లెవెల్ 1 పోటీల్లో జిల్లా స్థాయిలో తృతీయ స్థానం సాధించారు. కే వరుణ్ తేజ్ వేదిక్ మాథ్స్ వాల్యూం 3లో జిల్లా స్థాయిలో తృతీయ స్థానం, వేదిక్ మాథ్స్ వాల్యూం 5లో జిల్లా స్థాయి పోటీల్లో తృతీయ స్థానం సాధించడం జరిగింది. అబాకస్ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థిని విద్యార్థులు వారికి ట్రైనింగ్ ఇచ్చిన ఉపాధ్యాయుని ఉపాధ్యాయులని మంగళవారం స్కూల్లో జరిగిన అభినందన కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ పాల్గొని విద్యార్థిని విద్యార్థులని అభినందించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కే శ్రీనివాసరావు, కే ప్రమీల పిఈటి టీచర్స్ జి కోటేశ్వరరావు, కే వెంకట్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది.

## చీరాలలో రాజకీయ దుమారం రేపిన ఎన్టీఆర్ విగ్రహ ప్రతిష్ఠ


- చీరాల గడియారస్తంభం వద్ద విగ్రహ ప్రతిష్ఠకు టెంకాయ కొట్టిన మాజీ మంత్రి
- మాజీ మంత్రి పాలేటి రామారావు పై చర్య తీసుకోవాలని కౌన్సిలర్లు కలెక్టర్‌కి ఫిర్యాదు
- బాపట్ల ఎంపీని చీరాల రాజకీయాల్లో తల దూర్చవద్దని హెచ్చరించిన టీడీపీ పట్టణ అధ్యక్షుడు
- కౌన్సిల్లో ఆమోదం మాత్రమే పర్మిషన్ కాదు మున్సిపల్ కమీషనర్ అబ్దుల్ రషీద్

**చీరాల టౌన్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**





చీరాల నియోజకవర్గంలో నందమూరి తారక రామారావు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం స్థానిక రాజకీయాల్లో దుమారం రేపింది. సాధారణ కౌన్సిల్ సమావేశంలో మాజీ మంత్రి డాక్టర్ పాలిటి రామారావు చీరాలలో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహం ఏర్పాటు చేయాలని అర్జీ పెట్టుకోగా అర్జీని కౌన్సిల్ సమావేశంలో కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. దీనిని పరిగణలోకి తీసుకుని మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు ప్రస్తుత మున్సిపల్ వైస్ చైర్మన్ జైసన్ బాబు, ఇతర వైసీపీ కౌన్సిలర్లు సోమవారం సాయంత్రం స్థానిక గడియారస్తంభం సెంటర్లో శంకుస్థాపన నిర్వహించారు. ఇది తెలుసుకుని స్థానిక ఎమ్మెల్యేలు ఎంఎం కొండయ్య ఉండగా మాజీ మంత్రి ఎవరు అక్కడ ప్రతిష్ఠించడానికి అని స్థానిక టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు.



### పసుపు నీళ్లతో శుద్ధి చేసిన టీడీపీ నాయకులుః

గడియారస్తంభంవద్ద మాజీ మంత్రి డాక్టర్ పాలేటిరామారావు విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించిన ప్రాంతాన్ని టీడీపీ నాయకులు మంగళవారం పసుపునీళ్లతో శుద్ధి చేశారు.మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు ఉద్దేశ పూర్వకంగానే ఈ ప్రాంతంలో శంకుస్థాపన నిర్వహించారని అసలు టీడీపీ శాసన సభ్యులు కొండయ్య ఉండగా వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లతో పాలేటి రామారావు శంకుస్థాపన నిర్వహి స్తారని వారు డిమాండ్ చేశారు. శంకుస్థాపన చేసిన స్థలాన్ని పసుపు నీళ్లతో టీడీపీ నాయకులు శుద్ధి చేశారు.

### బాపట్ల ఎంపీ కృష్ణ ప్రసాద్ చీరాల రాజకీయాల్లో కలుగచేసుకోవడం మానుకోవాలిః పట్టణ అధ్యక్షులు గజవల్లి శ్రీను

చీరాల రాజకీయాల్లో బాపట్ల ఎంపీ కృష్ణ ప్రసాద్ కలుగచేసుకోవడం మానుకోవాలని చీరాల పట్టణ అధ్యక్షుడు గజవల్లి శ్రీను అన్నారు. మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు, నందమూరి తారక రామారావు విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించడంతో ఈ వ్యవహారానికి సూత్రధారిగా బాపట్ల ఎంపీ ఉన్నారని వారు అన్నారు. చీరాల రాజకీయాలలో కలుగజేసుకోవద్దని ఇదే విధానం మరలా జరిగితే పార్టీ పెద్దలకు ఫిర్యాదు చేయవలసి వస్తుందని వారు హెచ్చరించారు.

### మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన కౌన్సిలర్లుః

స్థానిక చీరాల నియోజకవర్గంలో గడియారస్తంభం వద్ద ఎన్టీఆర్ విగ్రహ ప్రతిష్ట నిర్వహించి రాజకీయ దుమారానికి దారి తీస్తున్నారని అతనిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కి చీరాల మున్సిపల్‌కౌన్సిలర్లు ఫిర్యాదు చేశారు. మున్సిపాలిటీలో విగ్రహం ఏర్పాటు చేయడానికి కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. కాని ఎటువంటి పర్మిషన్లు లేదు అన్నారు. గడియారస్తంభం వద్ద విగ్రహ ప్రతిష్ట కాకుండా శాసనసభ్యులు ఎంఎం కొండయ్య కేటాయించిన స్థలంలో విగ్రహ ఏర్పాటుకు పర్మిషన్ ఇవ్వాలని వారు కలెక్టర్‌ని కోరారు. కలెక్టర్‌ని కలిసిన వారిలో కౌన్సిలర్లు సూరగని లక్ష్మీ, మించాల సాంబశివరావు, సల్లూరి సత్యానందం, మల్లెల లలిత రాజశేఖర్,ఇతర సభ్యులు పాల్గొన్నారు.

### కౌన్సిల్ సమావేశంలో ఆమోదించారుః మున్సిపల్ కమీషనర్ అబ్దుల్ రషీద్

సాధారణ కౌన్సిల్ సమావేశంలో విగ్రహ ఏర్పాటుకు మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు అర్జీ పెట్టుకోగా కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. అంతే ఆమోదించిన అంశాన్ని జిల్లా కలెక్టర్‌కి సిఫార్సు పంపిస్తామని జిల్లా విగ్రహ ఏర్పాటు కమిటీ వారు, కలెక్టర్ ఆమోదించినప్పుడే పర్మిషన్ వస్తుందని అంతే కాని చీరాల గడియారస్తంభం వద్ద నందమూరి తారక రామారావు విగ్రహం ఏర్పాటు చేయుటకు ఎటువంటి పర్మిషన్ లేదని ఆయన మీడియాకు తెలియజేశారు.

### రాజకీయాలను వేడెక్కిస్తున్న పాలేటి రామారావు

రాష్ట్రంలోనే చీరాల రాజకీయం ఒక సంచలనం. ఇక్కడ ఎవరు ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో, ఎవరు కలిసి మెలిసిఉంటారో తెలియని పరిస్థితి ఇక్కడ అదే కోవలో మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు ఎన్టీఆర్ విగ్రహ ప్రతిష్ఠని వైసీపీ కౌనన్సిలర్లు, వైస్ చైర్మన్లతో కలిసి విగ్రహ ప్రతిష్ఠకు టెంకాయ కొట్టి మరి ప్రారంభించారు. ఇది చీరాల నియోజకవర్గ తెలుగు తమ్ముళ్లలో ఆందోళన ఆవేశాన్ని పెంచాయి. చీరాల శాసనసభ్యులు ఎంఎం కొండయ్య ప్రారంభించాలి కాని మాజీ మంత్రి ఎలా ప్రతిష్ఠ చేస్తాడని తెలుగు తమ్ముళ్లు ప్రతిష్ట చేసిన స్థలాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేసి ఆయన చేసిన ప్రతిష్ఠా కార్యక్రమాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చీరాల రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మృతుని కుటుంబానికి రూ.13వేలు ఆర్థిక సాయం

**చీరాల, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**



చీరాల రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆమోదగిరి పట్నం, సిలోన్ కాలనీలో ఇటీల గుండె పోటుతో మరణించిన సీనియర్ పాత్రికేయులు కి.శే కొల్లిమర్ల సాంబశివరావు స్వగృహంలో వారి కుటుంబ సభ్యులకు రూ.13వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో చందలూరి బాల వెంకటేశ్వరరావు, పోలుదాసు రామకృష్ణ, మామిడాల శ్రీనివాసరావు, జివై ప్రసాద్, దోగుపర్తి వెంకట సురేష్ పాల్గొన్నారు.

## నాటుసారా స్థావరంపై దాడి

**వేటపాలెం, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**



వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు, వారి సిబ్బంది సాధారణ విధులలో భాగంగా దేశాయిపేట గ్రామం వివేకానంద కాలనీలో బహిరంగ ప్రదేశాలకు వెళ్ళగా అక్కడ ఇద్దరు వ్యక్తులు నాటు సారా తయారు చేస్తున్నట్లు గమణించి దాడి చేయగా పోలీసులు రావడం చూసి వారు పారిపోవడానికి ప్రయత్నించారు. పోలీసులు చాకచక్యంగా ఇద్దరిని పట్టుకుని అదుపులోకి తీసుకోగా ఒకరు పరారీలో ఉన్నారు. వారి వద్ద నుండి ఒక ప్లాస్టిక్ చెరుకులో 10 లీటర్ల నాటు సారా, ప్లాస్టిక్ చేరుకును స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించగా మనుపాటి మాధవరావు సూచనల అనుసరించి బోగిరి భరత్, లాజరు అనువారు నాటుసారా తయారు చేసి అమ్ముతున్నారని తెలిసింది. కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

## వైఎస్ జగన్‌ను కలిసిన కనిగిరి వైసీపీ ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణ యాదవ్

**కనిగిరి, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మంగళవారం తాడేపల్లి కార్యాలయంలో కనిగిరి వైసీపీ ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణయాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా కనిగిరి నియోజకవర్గంలో పార్టీ బలోపేతంపై అధినాయ కుడితో చర్చించారు.పార్టీ అధిష్టానం ఈ నెలలో పిలుపునిచ్చిన ఫీజు పోరు కార్యక్రమాన్ని కనిగిరి నియోజకవర్గం తరుపున విజయవంతం చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. రానున్న రోజుల్లో వైసీపీ స్థానిక సంస్థల్లోనూ సత్తా చాటునుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

## బూచేపల్లిని సన్మానించిన దర్శి నియోజకవర్గ రైతు అధ్యక్షుడు బంక నాగిరెడ్డి

**ముండ్లమూరు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**



దర్శి నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులుగా అవకాశం కల్పించినందుకు ప్రకాశం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మకి, దర్శి ఎమ్మెల్యే, ప్రకాశం జిల్లా వైసీపీ అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపి పూలమాలతో ఘనంగా సన్మానించిన దర్శి నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులు బంకా నాగిరెడ్డి. ఈ సందర్భంగా రైతులు పక్షాన నిలబడుతూ రైతులు సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తానని వైసీపీ అభివృద్ధికి, వైసీపీ పార్టీ కోసం పని చేస్తానని బంకా నాగిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా మండల నాయకురాలు మేడికొండ జయంతి తదితరులు పాల్గొన్నారు.

## విభిన్న ప్రతిభావంతులకు ఉచిత బస్సు పాసులు అందజేసిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

**దర్శి, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**



దర్శి నియోజకవర్గంలోని 35 మంది విభిన్న ప్రతిభావంతులకు పొదిలి ఆర్టీసీ డీఎం శంకరరావు దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జీ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ చేతుల మీదుగా ఉచిత బస్సు పాసులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది, నియోజకవర్గంలోని విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు.

## వైభవంగా రథసప్తమి పండుగ వేడుకలు

**కనిగిరి, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**



రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం నందు మంగళవారం జరిగిన గ్రామోత్సవం అత్యంత వైభవంగా కొనసాగింది. చిన్న శేష వాహనంపై స్వామివారి ఊరేగింపును ఉభయదాతలు దేవకి సుబ్రహ్మణ్యం, కనిగిరి మున్సిపాలిటీ 17వ వార్డు కౌన్సిలర్ దేవకి రాజీవ్ దంపతులు ప్రారంభించారు. స్వామివారి ఏడు వాహనములపై ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. ఇది భక్తులకెంతో హర్షం కలిగించింది. ఈ సందర్భగా మహిళల కోలాట భజనలు, కులుకు భజనలు, మేళతాళాలతో ఆలయ పరిసరాలు భక్తిమయంగా మారాయి. ఈ ఘనోత్సవంలో ఆలయ అధ్యక్షులు గోనుగుంట్ల గోపాల్, నార్లపాటి సాంబా, కొప్పరపు సత్యాలు సహా కమిటీ సభ్యులు పాల్గొని ఉత్సవాన్ని మరింత విజయవంతం చేశారు. ఈ విధంగా రథసప్తమి పర్వదినం భక్తుల హర్షధ్వానాలతో భజనలు, వాహన సేవలతో భక్తి శ్రద్ధల మధ్య అత్యంత ఘనంగా జరిగింది.

## శ్రీ వెంకటేశ్వరస్వామి రథసప్తమి పూల అలంకరణకు లక్ష రూపాయల విరాళం

**కనిగిరి, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**



కనిగిరిలో వెలసి ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి రథసప్తమి మహోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్వామివారి రథపూల అలంకరణ కోసం కనిగిరి వైసీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పల్నాటి భాస్కర్‌రెడ్డి, పల్నాటి తిరుపతిరెడ్డిలు ఒక్కొక్కరు రూ.50వేలు చొప్పున మొత్తం రూ.1,00,000 విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో హారతి సమర్పించారు. అనంతరం పల్నాటి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గ ప్రజలకు శ్రీ వెంకటేశ్వరస్వామి ఆశీస్సులు లభించాలని, సుఖశాంతులు, అష్టైశ్వర్యాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ విరాళాన్ని అందజేసిన భక్తులను ఆలయ అర్చకులు ఆశీర్వదించారు. రథసప్తమి సందర్భంగా స్వామివారి రథోత్సవానికి కనిగిరి ప్రాంతంలోని భక్తులు పెద్దఎత్తున హాజరై భక్తి పారవశ్యంతో పాల్గొన్నారు.

## దంతులూరి కరుణాకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు

**కనిగిరి, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**



కనిగిరి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు దంతులూరి కరుణాకర్ జన్మదిన సందర్భంగా మంగళవారం పలువురు రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు, వ్యాపార వేత్తలు, విలేకర్లు, ప్రజలు సోషల్ మీడియా వేదికగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దంతులూరి కరుణాకర్ నిండు నూరేళ్లుఆయురారోగ్యాలతో ఉండాలంటూ ఆకాంక్షించారు. కనిగిరి వైసీపీ ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణయాదవ్, పొమూరు వైసీపీ నాయకులు గంగసాని హుస్సేన్‌రెడ్డి, సీనియర్ రిపోర్టర్ పీవీసీ నారాయణ, బాబు, దాదిరెడ్డి మాలకొండరెడ్డి, తేజ, తాతపూడి సురేష్, వెంకట్, కంటు కేశవ, శిగా కృష్ణారావు, సోషల్ మీడియా రాజు, విలేకరి రంగారావు, ఇతర రాజకీయ నాయకులు, ప్రముఖులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## కొర్లమడుగు, కొత్తపల్లిలో పొలంపిలుస్తోంది

**దర్శి, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**



దర్శి మండలంలో కొర్లమడుగు, కొత్తపల్లి రైతు సేవా కేంద్రాల పరిధిలోని పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయాధికారి వి.బాల కృష్ణ నాయక్ అధ్యక్షత వహించారు. వారు మాట్లాడుతూ రైతులందరూ కూడా వ్యవసాయ శాఖ సేవలను వినియోగించుకోవాలని, వ్యవసాయ శాఖ నందు అవలంభిస్తున్నటువంటి పథకాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా క్షేత్ర సందర్శన జరుగుతుందని, పంటలపై ఆశించు చీడపీడలు, తెగుళ్ల గురించి క్షేత్ర సందర్శన ద్వారా తెలియజేయడం జరుగుతుందన్నారు. డాక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ వివిధ పంటల యొక్క సస్యరక్షణ చర్యల గురించి రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు డి.సునీత, భాయ్, పి.శివ సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

## నూతన గృహ ప్రవేశ వేడుకలో పాల్గొన్న గొట్టిపాటి లక్ష్మీ

**దర్శి, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**



దర్శిలోని 19వ వార్డులో తిరుమల వెంకటేశ్వర్లు(బిల్లా) సోదరుడు తిరుమల నాగేంద్రబాబు నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జీ గొట్టిపాటి లక్ష్మీ, డాక్టర్ కడియాల లలిత్ సాగర్‌లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో పాల్గొని దేవుని ఆశీర్వాదాలు అందుకున్నారు. వారితో పాటు దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, టౌన్ పార్టీ అధ్యక్షుడు యాదగిరి వాసు, కౌన్సిలర్ దారం నాగవేణి, సుబ్బారావు, నియోజకవర్గంలోని వివిధ హోదాల్లో ఉన్న నాయకులు పాల్గొన్నారు.

## తీన్మార్ మల్లన్నపై తీవ్రంగా మండిపడ్డ కైపు వెంకటకృష్ణారెడ్డి

**దర్శి, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**



తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ కుమార్ వరంగల్ బీసీ సభలో రెడ్ల గురించి నోటికొచ్చినట్లు మాట్లాడిన తీన్మార్ మల్లన్న తగిన బుద్ధి చెప్పాలి. అమాయకులైన తెలంగాణ బీసీ సోదరులను మాయ మాటలు చెప్పి పబ్బం గడుపుకునే నువ్వు మీడియా ముసుగులో బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు సంపాదించుకునే నువ్వు రెడ్ల గురించి మాట్లాడతావా, తెలంగాణ రెడ్లు నీ మాటలు పట్టించుకోకపోవచ్చు, ఆంధ్ర రెడ్లు నీ గురించి ఆలోచిస్తున్నారు, నీకు బుద్ధి చెప్పే రోజులు తొందరలోనే ఉన్నాయన్నారు.

## వేముల, వేములబండ గ్రామాల్లో పొలం పిలుస్తోంది

**ముండ్లమూరు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**



ముండ్లమూరు మండలంలోని వేముల, వేములబండ గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మండల వ్యవసాయాధికారితో కలిసి దర్శి వ్యవసాయ సంచాలకులు కే.బాలాజీ నాయక్ పెసర, మినుము పంట పొలాలను సందర్శించి ఈ పంటలతో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను రైతులకు తెలియజేశారు. పంటలలో బూడిద తెగులు, తెల్లదోమ సోకి ఉన్నాయని దర్శి సహాయ వ్యవసాయ సంచాలకులు కే.బాలాజీ నాయక్ తెలియజేశారు. అనంతరం సమావేశంలో ముండ్లమూరు మండల వ్యవసాయాధికారి వారు మాట్లాడుతూ రబీ కాలంలో బూడిద తెగులు వ్యాప్తి ఉధృతి ఎక్కువగా ఉంటుందన్నారు. వాటి నివారణకు చేపట్టే సస్యరక్షణ చర్యలు గురించి వివరించారు. ఈకార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## వేడుకగా వెంకటేశ్వరుని నగరోత్సవం

**చీమకుర్తి, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**



రథసప్తమి సందర్భంగా కలియుగ వైకుంఠ దేవుడు శ్రీ వెంకటేశ్వర స్వామి నగరోత్సవ వైభవంగా జరిగింది. చీమకుర్తి గోవింద స్వాములు, భక్తులు చీమకుర్తి పట్టణ వీధుల్లో మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చీమకుర్తిలోని హరిహర క్షేత్రం నందు వెంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని ఈరోజు ఉదయం పూలమాలలతో విశేషంగా అలంకరించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి మేళతాళాలతో ఊరేగింపు చేపట్టారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామివారికి టెంకాయ కర్పూరం సమర్పించారు. ఈ కార్యక్రమానికి పంతులు వేదమంత్రాలతో స్వామి వారి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీమకుర్తిలోని గోవింద భక్త బృందం, భక్తులు పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో గురు స్వామి, సోమ శేషారావు, కోట రామారావు, నూకల రాఘవ, దొంతు సుధాకర్, వాసి కొండలు, మాధవ, ప్రసాదు, పాల్గొన్నారు.

5-2Pg5.qxd:5-2Pg5.qxd 01/01/01 8:20 AM Page 1




# అంతరిక్షంలో ఏం జరుగుతోంది?

## మన నావిగేషన్ ఉపగ్రహం పనిచేస్తుందా! కూలిపోతుందా?

### భూకేంద్రాల నుంచి అలుపెరగకుండా శ్రమిస్తున్న శాస్త్రవేత్తలు

### ఇప్పటికీ అసలు కక్ష్యను చేరని ఎన్‌విఎస్-2



రాకెట్ ప్రయోగానికి ముందు క్లీన్ రూంలో నావిగేషన్ ఉపగ్రహానికి తుది పరీక్షలు చేస్తున్న దృశ్యం (ఫైల్)

**శ్రీహరికోట (తడ), ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:** భారత నావిగేషన్ ఉపగ్రహం ఎన్‌విఎస్2 ఇస్రో శాస్త్రవేత్తలను కంటికి కునుకు లేకుండా చేస్తోంది. ఈ ఉపగ్రహం ప్రస్తుతం అంతరిక్షంలో పరిభ్రమించకుండా ఒక్కచోటనే ఉండిపోయినట్లు తెలుస్తోంది. నావిగేషన్ సేవల కోసం శ్రీహరికోట నుంచి గత నెల 29న జిఎస్‌ఎల్‌వి-ఎఫ్15 రాకెట్ ద్వారా 2,250 కిలోల బరువు ఉన్న ఎన్‌విఎస్-02 ఉపగ్రహాన్ని ఇస్రో అంతరిక్షంలోకి చేర్చింది. సాధారణంగా నిర్ణీత కక్ష్యకు కొంచెం అటుఇటూ వెళ్లినప్పటికీ ఉపగ్రహంలోని లామ్‌ను మండించి ఖచ్చితమైన కక్ష్యకు చేరుస్తారు. ఈ వ్యవస్థ ఒక్క జిఎస్‌ఎల్‌వి రాకెట్లోనే ఉంటుంది. భూమి నుంచి కనీసం 36 వేల కిలోమీటర్ల జిఎస్‌ఓ ఆర్బిట్‌లో ఉపగ్రహం పనిచేయాల్సి రావడంతో లిక్విడ్ అపోజి మోటార్ (లామ్)ను ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం ఈ లామ్ పనిచేయడం లేదు. దీనితో ఉపగ్రహంలోని త్రస్టర్లను మండించడానికి శాస్త్రవేత్తలు మరో ప్రయత్నం చేస్తున్నారు. బెంగళూరు సమీపంలోని హసన్‌లో ఉన్న మాస్టర్ కంట్రోల్ ఫెసిలిటీ కేంద్రం నుంచి శాస్త్రవేత్తలు అంతరిక్షంలోని ఉపగ్రహాన్ని నియంత్రించే కార్యక్రమంలో ఉన్నారు. వాస్తవానికి 29న ప్రయోగించిన 100వ రాకెట్ ఈ ఉపగ్రహాన్ని క్షేమంగానే విడిచిపెట్టింది. గత నెల 30న అందులో సాంకేతిక లోపం తలెత్తింది. మొదటిసారి రైజింగ్ ఆపరేషన్ చేయాలనుకున్నప్పుడే లోపం శాస్త్రవేత్తలు గమనించినట్లు సమాచారం. మళ్లీ ఈనెల 1న రెండోసారి రేజింగ్ ఆపరేషన్ సమయాన ఉపగ్రహం పనితీరు సక్రమంగా లేదని గుర్తించారు. ఆక్సిడైజర్ పిఎల్‌కు అందిస్తే ఉపగ్రహం పూర్తిగా తమ అదుపులోకి వచ్చి అనుకున్న కక్ష్యకు చేరువై మిగిలిన నావిగేషన్ ఉపగ్రహాలతో కలిసి ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు నమ్ముతున్నారు. అయితే అది సాధ్యమేనా అనే అనుమానాలు లేకపోలేదు. ఒకవేళ ఉపగ్రహం అక్కడే కదలకుండా ఉంటే అంతరిక్షంలో ఏదయినా ప్రమాదం జరిగే అవకాశం లేకపోలేదని కొందరు అంటున్నారు. ఈ ఉపగ్రహాన్ని వేరే ఉపగ్రహాలు ఢీకొనడం వంటి సంఘటనలు జరిగే అవకాశాన్ని కాదనలేక పోతున్నారు. అలాకాకుండా ఉపగ్రహాన్ని క్రమేణా భూవాతావరణంలోకి తీసుకొచ్చి ప్రమాదం తప్పించవచ్చన్నది ఒక ప్రయత్నంగా ఉంది. అయితే ఎన్‌విఎస్02 నుంచి ఇస్రో శాస్త్రవేత్తలు ఇప్పటిదాకా కావాల్సిన సమాచారం రాబట్టుకోవడం మాత్రమే చేస్తున్నారు. త్రస్టర్లను మండించలేకపోవడం, వృత్తాకార కక్ష్యకు ఉపగ్రహం చేరకపోవడం వలన కక్ష్యలో వచ్చే మార్పుల కారణంగా ఉపగ్రహం ముక్కలై మండిపోవడం జరుగుతుందన్నది ఒక వాదన. భవిష్యత్ తరం నావిక్ వ్యవస్థలో భాగంగా ఇస్రో ఇప్పటికే ఎన్‌విఎస్01ను ప్రయోగించి ఉంది. ఇది రెండవ ఉపగ్రహం. మరో మూడు ఇలాంటి ఉపగ్రహాలు ప్రయోగించి ఒక దానికొకటి సహకారంతో మన జిపిఎస్ సేవలు విస్తృతం చేయాలని శాస్త్రవేత్తలు నమ్మకం పెట్టుకొని దీన్ని ప్రయోగించారు. కనీసం రూ.300 కోట్లు వెచ్చించినట్లు తెలుస్తోంది. అయితే ఈ ఉపగ్రహం ఏదయినా అయితే మళ్లీ మరో నాలుగు ఉపగ్రహాలను రూపొందించాల్సిన అవసరం ఇస్రో శాస్త్రవేత్తలకు ఉంది. దానికి కొంత సమయాభావం పడుతుందని లెక్కలు వేస్తున్నారు. మొత్తంమీద పూర్తి స్వదేశీ నావిగేషన్ వ్యవస్థ మనకు అందుబాటులోకి రావాలంటే ఈ ఉపగ్రహం పనితీరు మెరుగుపడాలని ప్రజలు కూడా ఆశిస్తున్నారు.

# విదేశీయులను వెంటనే పంపించేయండి



## అసోం ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:** అసోం ప్రభుత్వంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అక్రమంగా రాష్ట్రంలోకి వచ్చిన విదేశీయులను వెంటనే పంపివేయకుండా నిర్బంధ కేంద్రాల్లో నిరవధికంగా ఉంచడంపై మండిపడింది. వారిని స్వస్థలాలకు పంపడానికి ముహూర్తం కోసం ఎదురు చూస్తున్నారా అని ప్రశ్నించింది. నిర్బంధ కేంద్రాల్లో ఉంచిన 63 మందిని రెండు వారాల్లోగా పంపించేయాలని న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. ఎవరైనా దేశంలోకి అక్రమంగా ప్రవేశించినవారని తెలిసినప్పుడు వారిని పంపివేయడానికి వెంటనే చర్యలు తీసుకోవాలి. నిర్బంధంలో ఉన్న విదేశీయులను వారి దేశాలకు పంపించమంటే వారి చిరునామా తెలియదని పేర్కొంటూ మీరు తరలింపు ప్రక్రియను ప్రారంభించడానికి నిరాకరిస్తున్నారు. అది మనం పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశంకాదు. అలాగే వారిని జీవితాంతం కేంద్రంలో ఉంచి పోషించలేం కదా వెంటనే వారిని వారి దేశాలకు తరలించండి. దానికి ఏమైనా ముహూర్తం కోసం ఎదురుచూస్తున్నారా? అని సుప్రీంకోర్టుప్రశ్నించింది. అస్సాంలో ఉన్న అన్ని నిర్బంధ కేంద్రాల నుంచి ఇప్పటి వరకు ఎంత మందిని వారిదేశాలకు పంపించారన్న నివేదికలను సమర్పించాలని ఆదేశించింది. అస్సాం సహా మరి కొన్ని రాష్ట్రాల్లో అక్రమ వలసదారులు పెద్ద ఎత్తున పెరిగిపోవడంతో స్థానికుల్లో అభద్రతాభావంఅధికమవుతోంది. తమ వనరులు పొరుగు దేశస్తుల పాలవుతున్నాయని తాము మైనారిటీలుగా మారే ముప్పుందని వారు వాపోతున్నారు. వలసదారుల్లో కొందరు మాదకద్రవ్యాల అక్రమ రవాణా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతూ దేశభద్రతకు ముప్పుగానూ పరిణమిస్తున్నారు. ఈనేపథ్యంలో అక్రమంగా రాష్ట్రంలోకి ప్రవేశిస్తున్న వారిని తమ దేశాలకు పంపడంపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన అత్యున్నత న్యాయస్థానం పై విధంగా స్పందించింది.

# రాహుల్‌పై సభా హక్కుల ఉల్లంఘన నోటీస్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:** లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపైజరిగిన చర్చలప్రారంభంలో రాహుల్‌చేసిన ప్రసంగం సభాహక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని ఆయనపై వెంటనే చర్యలు తీసుకోవాలని బిజెపి ఎంపి నిషికాంత్ దూబే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు విజ్ఞప్తి చేసారు. రాహుల్‌గాంధీ పార్లమెంటులో స్వయంగా చైనీ దళాలు భారత గడ్డపై ఉన్నాయని ప్రకటించారు. ఆయన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు తీవ్రంగా స్పందిస్తూ రాహుల్ అబద్ధాలు వల్లెవేస్తున్నారంటూ పెద్దపెట్టున నినాదాలుచేసారు. రాహుల్ ప్రసంగంలో చరిత్రాత్మక అంశాలను విస్మరించారని, మన దేశాన్ని అపహాస్యం చేసారని, భారత గణతంత్ర వ్యవస్థను కించపరిచారంటూ దూబే తన లేఖలో స్పీకర్‌కు వివరించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలుతెలిపే అంశంపై ప్రసంగించిన రాహుల్ తన ప్రసంగంలో కేంద్రంలోని ఎన్డీయే సర్కారు, ప్రధాని మోడీపై ధ్వజమెత్తారు. ఉత్పత్తిరంగాన్ని నిర్వీర్యం చేసారని, మేకిన్ ఇండియా కార్యాచరణ మంచిదే అయినా భారత్ వినియోగించుకోలేకపోయిందని, అందుకు బాధ్యత ప్రధాని మోడీదేనని అన్నారు. అంతేకాకుండా చైనా దళాలు భారత గడ్డపైకి ప్రవేశించడానికి కూడా ప్రధాని మోడీయే బాధ్యుడనితెలిపారు. కాంగ్రెస్ నాయకుడు బోగస్ వార్తలనుప్రచారంచేస్తున్నారని ఇలాంటి అసంబద్ధ వాదనలు, భావజాలం, భాషను ఇకపై వాడకూడదని గుర్తుచేస్తున్నామని మంత్రి కిరెన్ రిజిజు అన్నారు. ఆ తర్వాత స్పీకర్ ఓంబిర్లాను కలిసి గాంధీ వ్యాఖ్యలకు ఆధారాలు చూపించాలని డిమాండ్ చేసారు. అంతేకాకుండా బిజెపి ఎంపిలు గాంధీపై సభాహక్కుల నోటీస్ ఇచ్చేందుకు సిద్ధం అవుతున్నారు. సాక్ష్యాధారాలు చూపించకపోతే హక్కుల ఉల్లంఘననోటీస్ తప్పదని వారంటున్నారు. పార్లమెంటను తప్పుదోవ పట్టించేవిధంగా వ్యవహరించినసభ్యులపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు జారీచేసే హక్కు పార్టీ ఎంపిలకు ఉంటుంది. పార్లమెంటులో ప్రసంగిస్తూ రాహుల్ గాంధీ నిరుద్యోగం అంశాన్ని కూడా ప్రస్తావించారు. ఉత్పత్తిరంగ ఉద్యోగాలను చైనాకు అప్పగించేసామని, చైనా దళాలు మనభూభాగంలోని 4వేల కిలోమీటర్ల లోపలికి చొచ్చుకువచ్చాయని ఆరోపించారు. మేకిన్‌ఇండియా విఫలం కావడంతోనే చైనా మన భూభాగంలోకి వచ్చేస్తోందని ఉత్పత్తిరంగానికి కూడా చైనాకు అప్పగిస్తున్నామని ఆయన ఆరోపించారు.



# నేడు మహాకుంభ మేళాకు ప్రధాని మోడీ

## త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్‌లో జరుగుతున్న అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహాకుంభమేళాలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ పాల్గొననున్నట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 5న ఆయన త్రివేణీ సంగమంలో పుణ్యస్నానం ఆచరించనున్నట్లు సమాచారం. ఈ మేరకు ప్రధాని షెడ్యూల్‌ను ఓ సీనియర్ ఐపిఎస్ అధికారి చెప్పినట్లు సమాచారం. బుధవారం ఉదయం 10 గంటలకు ప్రధాని ప్రయాగ్‌రాజ్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి 10.45 గంటలకు అరైల్ ఘాట్‌కు వెళతారు. ఘాట్ నుంచి బోటులో ప్రయాణించి మహాకుంభమేళా జరుగుతున్న ప్రాంతానికి చేరుకుంటారు. ఉదయం 11 గంటల నుంచి 11.30 గంటల మధ్య త్రివేణీ సంగమంలో ప్రధాని పుణ్యస్నానం ఆచరిస్తారు. 11.45 గంటలకు బోటులో తిరిగి అరైల్ ఘాట్‌కు వెళతారు. అక్కడి నుంచి ప్రయాగ్‌రాజ్ ఎయిర్‌పోర్టుకు వెళ్లి ఢిల్లీ బయలుదేరుతారు అని సదరు సీనియర్ పోలీస్ అధికారి వెల్లడించినట్లు సమాచారం. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని ఎలాంటి కార్యక్రమాల్లో పాల్గొనబోరని తెలుస్తోంది. కేవలం పుణ్యస్నానం ఆచరించి గంగానదికి పూజలు చేయనున్నారని సమాచారం. దాదాపు గంటన్నర పాటు మోడీ ప్రయాగ్‌రాజ్‌లో ఉండనున్నారు. ఈ క్రమంలోనే నగరంతో పాటు కుంభమేళా వద్ద ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేసినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. ప్రధాని వెంట యుపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఉండనున్నారట. మహా కుంభమేళా ప్రారంభానికి ముందు ప్రధాని మోడీ ప్రయాగరాజ్ వెళ్లిన సంగతి తెలిసిందే. రూ.5500కోట్లతో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. 144యేళ్లకోసారి వచ్చే జనవరి 13న కుంభమేళా ప్రారంభం కాగా ఫిబ్రవరి 26వ తేదీ వరకు కొనసాగనుంది. ఇప్పటికే దాదాపు 35కోట్లకు పైగా భక్తులు కుంభమేళాకు వెళ్లి పుణ్యస్నానాలు ఆచరించారు.

# మైయిటీలను రెచ్చగొడుతున్న సిఎం బీరేన్‌సింగ్

## సుప్రీంలో కుకీ మానవహక్కుల సంస్థ పిటిషన్

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 4:** మణిపూర్‌రాష్ట్రంలో జాతుల వైరాన్ని ముఖ్యమంత్రి బీరేన్‌సింగే రెచ్చగొడుతున్నారని దాఖలయిన పిటిషన్లపై విచారణకు ముందు సిఎఫ్‌ఎస్‌ఎల్ నివేదిక వచ్చిన తర్వాత నిర్ణయిస్తామని సుప్రీంకోర్టుప్రకటించింది. లీక్ అయిన ఆడియో టేపులను సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లేబరేటరీకి పంపించామని, ఆ స్వరం ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్‌దేనా అని నిర్ధారించిన తర్వాత పిటిషన్ల విచారణపై నిర్ణయానికి వస్తామని చీఫ్‌జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్‌లతో కూడిన బెంచ్ ప్రకటించింది. సిఎఫ్‌ఎస్‌ఎల్ నివేదిక ఆరువారాల్లోపు సీల్డ్ కవర్‌లో అందచేయాలని ఆదేశించింది. పిటిషన్ విచారణను మార్చి 24వ తేదీకి వాయిదా వేసింది. తదుపరి వాయిదాకు ముందు ఈ కేసును మళ్లీ లిస్టింగ్ చేసుకోవాలని అప్పటికి సిఎఫ్‌ఎస్‌ఎల్ నివేదిక అందుతుందని న్యాయమూర్తులు వెల్లడించారు. కుకీ ఆధ్వర్యంలోని మానవహక్కుల ట్రస్టు ఈ ఆడియో టేపులపై స్వతంత్ర విచారణ జరిపించాలనికోరుతూ పిటిషన్ దాఖలుచేసింది. విచారణలో భారత సొలిసిటర్ జనరల్ తుషార్‌మెహతా మణిపూర్ ప్రభుత్వం తరపున వాదనలు వినిపించారు. పిటిషనర్ వేర్పాటువాద ఆలోచనలతో ప్రత్యేక సిద్ధాంతాలను అమలుచేసదిగా ఆతని వైఖరి ఉందని వాదించారు. అంతేకాకుండా సుప్రీంకోర్టు నియమించిన జడ్జిల ప్యానెల్ కూడా ఇలాంటి సంఘటనలను ప్రస్తావిస్తూ ఆందోళన వ్యక్తం చేసింది. మణిపూర్‌లో ఈ రావణకాష్టం అలాగే కొనసాగేందుకు ఈ తెగలు కృషిచేస్తున్నాయని కలవరం వ్యక్తంచేసిన అంశాన్ని గుర్తు చేసారు. కోర్టుముందుంచిన ఆడియో టేపులపై సిఎఫ్‌ఎస్‌ఎల్ నివేదిక వచ్చాకగాని నిర్ణయానికి రాలేమని అన్నారు. న్యాయవాది ప్రశాంత్ భూషణ్ మాట్లాడుతూ ఈ ఆడియో టేప్‌లను ఒక ప్రైవేటు ఫోరెన్సిక్ సైన్స్‌ల్యాబ్ ట్రూత్ ల్యాబ్స్ విశ్లేషించిందని 93శాతం ఈ స్వరం ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్‌కు చెందినదిగానే వెల్లడించినట్లు గుర్తుచేసారు. ప్రభుత్వ సంస్థల నివేదిక కంటే ట్రూత్‌ల్యాబ్ నివేదిక హేతుబద్ధంగా ఉంటుందని ప్రశాంత్‌భూషణ్ చెప్పారు. కుకీ గ్రూప్ సంస్థ తన పిటిషన్‌లోకోర్టు పర్యవేక్షణలో విచారణ జరిపించాలని ఆడియో క్లిప్‌లపై సత్వర విచారణచేయాలని కోరింది. క్రైస్తవులు ఎక్కువగా ఉన్న కుకీలకు, హిందుత్వం ఎక్కువ తీసుకున్న మైయిటీ కులస్తులమధ్య జాతులవైరం నడుస్తున్న సంగతి తెలిసిందే. ఆల్ ట్రైబల్ స్టూడెంట్స్‌యూనియన్ ఆఫ్ మణిపూర్ (ఆట్సుమ్) 2023 మే 3వ తేదీ నిర్వహించిన ర్యాలీ అనంతరం ఈ ఉద్రిక్తతలు చెలరేగాయి. 2023మేనెలనుంచి కూడా మణిపూర్‌లో ఉద్రిక్తతలు పెరిగిపోయాయి. కేంద్ర ప్రభుత్వం పారా మిలిటరీ దళాలను పంపించి పరిస్థితిని అదుపు చేస్తున్నా ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది.

# ట్రంప్ చర్యకు చైనా ప్రతిచర్య



## దిగుమతులపై సుంకాలు పెంచిన జిన్‌పింగ్

### భయాలు రేకెత్తిస్తోన్న ఇరు దేశాల వాణిజ్య యుద్ధం

**వాషింగ్టన్, ఫిబ్రవరి 4:** అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొదలుపెట్టిన వాణిజ్య యుద్ధానికి చైనా నుంచి బలమైన ప్రతిస్పందన వచ్చింది. చైనా నుంచి వచ్చే అన్ని ఉత్పత్తులపై 10 శాతం సుంకం విధిస్తూ ట్రంప్ కార్య నిర్వాహక ఉత్తర్వులపై సంతకం చేయగా.. అమెరికా నుంచి దిగుమతి చేసుకునే బొగ్గు, లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్‌లపై 15 శాతం సుంకాలు విధిస్తున్నట్లు చైనా ప్రకటించింది. చమురు, వ్యవసాయ పరికరాలపై ఆ టారిఫ్ 10 శాతం ఉంటుందని స్పష్టం చేసింది. టంగ్‌స్టన్ సంబంధిత పదార్థాల ఎగుమతులపై నియంత్రణ విధించింది. పివిహెచ్ కార్పొరేషన్, ఇల్యుమినా ఇంక్ వంటి అమెరికా సంస్థలను విశ్వసనీయత లేని వాటి జాబితాలో చేర్చింది.


ఇదేగాకుండా అనైతిక వ్యాపార పద్ధతులు అవలంబిస్తున్న అమెరికాకు చెందిన టెక్ దిగ్గజం గూగుల్‌పైనా చైనా విచారణ జరపనుంది. ఈ రెండు పెద్ద దేశాలు ఒకదానిపై ఒకటి సుంకాలు విధించుకోవడంతో ట్రేడ్ వార్ భయాలు మొదలయ్యాయి. ఇప్పటికే చైనా కరెన్సీ యువాన్ విలువ పతనమైంది. ఆ ప్రభావం ఇతర దేశాల కరెన్సీలపైనా పడింది. ఆస్ట్రేలియా డాలర్, న్యూజిలాండ్ డాలర్ విలువలు పడిపోయాయి. ట్రంప్ సుంకాలు విధించడంపై ఇప్పటికే చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ మండిపడింది. దాన్ని డబ్ల్యుటిఒలో సవాల్ చేస్తామని ప్రకటించింది. తమ దేశ ప్రయోజనాలు, హక్కులు కాపాడుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. ఇతర దేశాలను సుంకాలతో ప్రతిసారీ బెదరించకుండా, ఫెంటానిల్ వంటి సమస్యలను సొంతంగా పరిష్కరించుకోవాలని అమెరికాకు చైనా హితవు పలికింది.

తాజాగా సుంకాల రూపంలో కౌంటర్ ఇచ్చింది. ఇదిలా ఉంటే ముందు నుంచీ హెచ్చరిస్తున్నట్లుగానే తమ పొరుగుదేశాలైన మెక్సికో, కెనడాలతోపాటు చైనాపైనా ట్రంప్ సుంకాల కొరడా ఝళిపించారు. దీర్ఘకాలిక మిత్రదేశాలైన కెనడా, మెక్సికోల నుంచి తాము దిగుమతి చేసుకునే ఉత్పత్తులపై 25 శాతం చొప్పున టారిఫ్ విధించారు.

అయితే ఈ రెండు దేశాల విషయంలో తర్వాత ట్రంప్ కాస్త ఉపశమనం కల్పించారు. ఇరు దేశాలల అధినేతలు అమెరికా సరిహద్దుల వెంట భద్రతను కట్టుదిట్టం చేస్తామని హామీ ఇవ్వడంతో టారిఫ్‌ల అమలును నెల రోజుల పాటు నిలిపివేశారు.

# తొక్కిసలాట పెద్ద సంఘట కాదు..అనుకోకుండా జరిగిన దుర్ఘటన

## అయోధ్య ఎంపి హేమమాలిని



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:** మహాకుంభ్‌నగర్‌లో జరిగిన తొక్కిసలాట పెద్ద సంఘటన ఏమీ కాదని అనుకోకుండా జరిగిన సంఘటన అని దురదృష్టకరమని అన్నారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మహాకుంభ్‌మేళాకు భారీ ఏర్పాట్లు చేసారని ఇంత పెద్దఎత్తున జరిగిన ఆధ్యాత్మికమేళాలో ఏర్పాట్లు అద్భుతంగా ఉన్నాయని, ఈ తొక్కిసలాట అనుకోకుండా జరిగిందని, దేశవిదేశాలనుంచి అనేకమంది వస్తున్నారని, లక్షలాదిగా వస్తున్న భక్తులను అదుపు చేయడం కూడా ఒకదశలో కష్టమే అవుతుందని అయోధ్య ఎంపి అన్నారు. ప్రతిపక్షసభ్యులు చేస్తున్న ఆరోపణలపైనా స్పందించారు. వాస్తవంగా మృతులసంఖ్యను యుపి ప్రభుత్వం దాచిపెడుతుందన్న వాదనలపై ఆమె స్పందిస్తూ వాళ్లు ఏదనుకుంటూ అదే చెపుతుంటారని, తప్పుడు వార్తలు ప్రచారంచేయడం వారి నైజమని ఆమె విమర్శించారు. గతవారంలోనే హేమమాలిని త్రివేణి సంగమంలో పవిత్రస్నానం చేసారు. తనకు లభించిన అదృష్టమని, త్రివేణి సంగమంలోస్నానంచేయడం తన పూర్వజన్మ సుకృతమని ఆమె అన్నారు. అయితే హేమమాలిని వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపి తారిక్ అన్వర్ స్పందించారు. యుపిలోని కతిహార్‌కు చెందిన ఈ ఎంపి హేమమాలినికి ఇలాంటి తొక్కిసలాటలపై అవగాహన లేదని అన్నారు. ఆమె మహాకుంభ్‌మేళకు వెళ్లినపుడు ఆమెకు విఐపి మర్యాదలు అందాయని, అధికారులు మొత్తం విఐపిల మర్యాదల్లో మునిగి తేలుతున్నారని, క్షేత్రస్థాయిలో సామాన్యుల బాధలు వారికి ఎలా తెలుస్తాయని అన్నారు. ఇదొక పెద్ద సంఘటన కానేకాదని ఆమె చెప్పడం బాధితులపట్ల ఆమెకున్న వైఖరిని స్పష్టం చేస్తుందని విమర్శించారు.

# మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మెమోరియల్‌కు స్థలం కేటాయించిన కేంద్రం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:** మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ డిసెంబర్‌లో తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆయన స్మారకం ఏర్పాటుకోసం కేంద్రం భూమి కేటాయించిందని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఢిల్లీలోని రాజ్‌ఘాట్ ప్రాంగణంలో మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ స్మారకం కోసం ఇచ్చిన స్థలం పక్కనే ఉన్న ఈ భూమిని సింగ్ కుటుంబ సభ్యులకు ఇచ్చిందని పేర్కొన్నాయి. ఈ ప్రక్రియ కోసం సింగ్ కుటుంబ సభ్యులు ఏర్పాటు చేయనున్న ట్రస్ట్ కోసం ప్రభుత్వం వేచి చూస్తోందని మీడియా కథనాలు తెలిపాయి. ఒకసారి



అది ఏర్పాటైన తర్వాత ఆ స్థలాన్ని అప్పగించనుంది. అంతేకాకుండా నిర్మాణం నిమిత్తం రూ.25 లక్షలు ఇవ్వనుంది. ఢిల్లీలోని రాజ్‌ఘాట్ ప్రాంగణంలోని రాష్ట్రీయ సమితి కాంప్లెక్స్‌లో ప్రణబ్‌ముఖర్జీ స్మారకం కోసం ప్రభుత్వం స్థలం కేటాయించింది. ఈ విషయాన్ని గత నెల ఆయన కుమార్తె శర్మిష్ఠ ముఖర్జీ ధృవీకరించారు. కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఢిల్లీ సిఎం అతిశిపై పోలీసుల ఎఫ్‌ఐఆర్




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు మరికొద్దిగంటల్లో పోలింగ్‌ప్రారంభం అవుతున్న తరుణంలో ఢిల్లీ ముఖ్యమంత్రి ఆప్ ఎమ్మెల్యే అతిషి మొర్లేనాపై పోలీసులు కేసునమోదు చేసారు. ఆమె కల్కాజీ అసెంబ్లీస్థానంనుంచి పోటీచేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అతిక్రమించారంటూ ఆమెపై ఢిల్లీపోలీసులు కేసునమోదు చేసారు. స్థానిక గోవింద్‌పూరి పోలీస్‌స్టేషన్‌లో ఢిల్లీసీఎం అతిశిపై పలు సెక్షన్లకింద కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసు దర్యాప్తు సాగుతోందని పోలీస్ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఫతేసింగ్ మార్గ్‌లో ఆప్ అభ్యర్థి అతిషి 50నుంచి 70 మంది మద్దతు దారులతోపాటు పది వాహనాలతో కనిపించడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆప్రాంతాన్ని ఖాళీ చేయాలని పోలీసులు ఆదేశించారు. కానీ ఆ అధికారిని తన విధులు నిర్వర్తించకుండా అడ్డుకున్నారని పోలీసులు వాదిస్తున్నారు. మరోవైపు సీఎం అతిశి తన ఎక్స్ ఖాతా వేదికగా స్పందించారు. బిజెపి అభ్యర్థిరమేష్ బిదూరి తోపాటు వాళ్లకుటుంబ సభ్యులు బహిరంగంగా దాడులకు దిగుతున్నారని విమర్శించారు. వీరిపై ఎన్నికల సంగం ఎలాంటి చర్యలు చేపట్టదన్నారు. ఆ క్రమంలో ఎన్నికల కమిషన్‌పై ఆమె విమర్శలు గుప్పించారు.

# చిన్నారి మాటలకు ఫిదా అయిన మంత్రి..

## అంగన్‌వాడీ మెనూలో మార్పులు

**తిరువనంతపురం, ఫిబ్రవరి 4:** బుజ్జిబుజ్జి మాటలతో ఓ చిన్నారి చేసిన రిక్వెస్ట్ నెట్టింట్లో వైరల్‌గా మారింది. ఇది కాస్త మంత్రి దృష్టికి చేరడంతో ఆమె స్పందించారు. దానిని ఆమె ఫేస్‌బుక్‌లో షేర్ చేశారు. అంగన్వాడీలో ఉప్మాకు బదులు బిర్యానీ, చికెన్ ఫ్రై కావాలి అని కేరళకు చెందిన శంకు అనే చిన్నారి తన తల్లిని అడుగుతున్న వీడియో ఆన్‌లైన్‌లో చక్కర్లు కొట్టింది. ఇంట్లో బిర్యానీ తింటూ పిల్లాడు ఈ కోరిక కోరాడు. ఆ ముద్దుముద్దు మాటలను తల్లి వీడియో తీసి, పోస్ట్ చేయడంతో అది వైరల్ అయింది. ఇది కాస్త మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి వీణా జార్జ్ దృష్టికి చేరింది. దానిని ఫేస్‌బుక్ ఖాతాలో పోస్టు చేశారు. ఇప్పుడు పెడుతున్న ఆహారాన్ని ఒకసారి పరిశీలిస్తాం. పోషకాహారం అందేలా



ప్రస్తుతం వివిధ రకాల పదార్థాలను అందిస్తున్నాం. ఈ ప్రభుత్వ హయాంలో అంగన్వాడీ ద్వారా గుడ్లు, పాలు అందించే పథకం విజయవంతంగా అమలవుతోంది అని మంత్రి మాటాడారు. ఇక శంకు వీడియోను చూసి నెటిజన్లు ముచ్చటపడ్డారు. అంగన్వాడీ పిల్లలకు మరింత మెరుగైన ఆహారం అందించాలని కోరారు.

# శీఘ్రంగా అణుబాంబు తయారీపై ఇరాన్ సైంటిస్టుల దృష్టి

**టెహ్రాన్, ఫిబ్రవరి 4:** ఇరాన్ ప్రభుత్వం అణుబాంబు తయారుచేయాలనుకోవాలనే దానిని సిద్ధం చేసేందుకు ఉన్న మార్గాలను అక్కడి శాస్త్రవేత్తలు రహస్య యత్నాలు మొదలుపెట్టారు. ఈ విషయాన్ని అమెరికా ఇంటెలిజెన్స్ వర్గాలు పసిగట్టినట్లు ఇటీవల న్యూయార్క్ టైమ్స్ కథనం ప్రచురించింది. దేశ నాయకత్వం నుంచి అణుబాంబు తయారీకి గ్రీన్‌సిగ్నల్ వచ్చిన వెంటనే అందుబాటులో ఉన్న యూరేనియం నిల్వలతో కొనిన నెలల్లోనే దానిని సిద్ధం చేసేలా ప్రణాళిక వేస్తున్నారు. ఇంటెలిజెన్స్ అధికారులు సమాచారాన్ని బైడెన్ అధికారంలో ఉన్నప్పుడే సేకరించారు. తాజాగా ఇప్పుడు ట్రంప్ కార్యవర్గంతో కూడా దీనిని పంచుకొన్నారు.



ఇటీవల సిరియా, పాలస్తీనా, లెబనాన్‌లో చోటు చేసుకొన్న పరిణామాలతో పశ్చిమాసియాలో ఇరాన్ పట్టు సడలిపోయింది. దానిని పరోక్ష బలగాలను ఇజ్రాయెల్, అమెరికా మద్దతుతో సిరియా తిరుగుబాటుదారులు అణచివేశారు. ఇజ్రాయెల్ క్షిపణి, వైమానిక దాడులతో ఆయుధ తయారీ సామర్థ్యం కూడా దెబ్బతిన్నది. మరోవైపు ట్రంప్ అధికారం చేపట్టిన వెంటనే ఇజ్రాయెల్‌లో నెతన్యాహును బలోపేతం చేశారు. ఇక ఇరాన్ కూడా బాంబుగ్రేడు యూరేనియంను ఉత్పత్తి చేసే దిశగా తన సంట్రిఫ్యూజ్ లో మార్పులు చేసి 60 శాతం వరకు శుద్ధి చేస్తోందని అంతర్జాతీయ అణుశక్తి చెబుతోంది. పౌర అణు అవసరాల కోసం ఏ దేశం కూడా ఆ స్థాయిలో యూరేనియంను శుద్ధి చేయదని చెబుతున్నారు.

వాస్తవానికి ఒక అణుబాంబు తయారీకి 42 కిలోలు 90 శాతం శుద్ధి చేసిన యూరేనియం ఉంటే సరిపోతుంది. ప్రస్తుతం ఇరాన్ వద్ద 200 కిలోల మేరకు 60 శాతం శుద్ధి చేసిన యూరేనియం ఉంది. గత వారం ఇరాన్ విదేశాంగ మంత్రి మాట్లాడుతూ తమ అణుస్థావరాలపై దాడులు చేస్తే చాలా వేగంగా, బలంగా స్పందిస్తామని హెచ్చరించారు. ఇది ఆలౌట్ వార్‌కు దారి తీస్తుందని పేర్కొన్నారు.

# టెక్సాస్ నుంచి వలసదారుల విమానం..

## స్వదేశానికి 205 మంది భారతీయులు



**వాషింగ్టన్, ఫిబ్రవరి 4:** అక్రమ వలసదారులపై అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొదటి నుంచి కఠినంగా వ్యవహరిస్తున్నారు. దీంతో అమెరికా చరిత్రలోనే అతిపెద్ద బహిష్కరణ ఆపరేషన్ సాగుతోంది. ఈ క్రమంలో అమెరికాకు అక్రమంగా వలసవెళ్లిన భారతీయులను విమానంలో వెనక్కి తరలిస్తున్నారు. ఇప్పటికే ఓ విమానం భారత్‌కు బయల్దేరింది. అందులో 205 మంది భారతీయులు ఉన్నారని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఆ విమానం పంజాబ్‌లోని అమృత్‌సర్‌కు చేరుకుంటుందని తెలుస్తోంది.

సి-17 యుఎస్ ఎయిర్‌క్రాఫ్ట్ వీరిని తరలిస్తోంది. భారత్‌కు చేరుకోవాడానికి 24 గంటలు పడుతుందని అంచనా. అక్రమ వలసదారులపై అమెరికా అనుసరిస్తున్న విధానాలపై ఇప్పటికే భారత్ తన స్పందనను తెలిపింది. అక్రమ వలసలకు తాము వ్యతిరేమని, ఈ అంశం అనేక రకాల వ్యవస్థీకృత నేరాలతో ముడిపడి ఉందని పేర్కొంది. వీసా గడువు ముగిసినా లేదా సరైన దస్త్రాలు లేకుండా భారతీయులు అమెరికాతో సహా ఎక్కడ ఉన్నా వారిని తిరిగి తీసుకువచ్చేందుకు వీలు కల్పిస్తామని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. త్వరలో ప్రధాని మోడీ అమెరికా పర్యటనకు వెళ్లనున్నారని తెలుస్తోంది. ఈ తరుణంలో అక్రమంగా వలస వెళ్లిన భారతీయుల తొలి విడత తరలింపు జరుగుతోంది.

05 - 02 Pg6exHMNWJQE.qxd:05 - 02 Pg6exHMNWJQE.qxd 01/01/01 9:41 AM Page 1



# అనూహ్యరాజకీయ పరిణామాల నడుమ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో కూటమి పట్టు

## -26ఓట్లతో డిప్యూటీ మేయర్‌గా టిడిపి కార్పొరేటర్ మునికృష్ణ



డిప్యూటీ మేయర్ మునికృష్ణ

**తిరుపతి,ఫిబ్రవరి 4ప్రభాతవార్తప్రతినిధి:** వారంరోజులుగా వైసిపి కార్పొరేటర్లలో నెలకొన్న ఆధిపత్యపోరు...సందిగ్ధత...సమన్వయంతో నడిపించలేని అనైక్యత చివరకు 35వ డివిజన్ ఒకేఒక టిడిపి కార్పొరేటర్ ఆర్‌సి మునికృష్ణ రెండవ డిప్యూటీ మేయర్‌గా ఎన్నికయ్యారు. అంచనాలు తారుమారుచేస్తూ వైసిపి కార్పొరేటర్లు ఆరునెలలముందునుండే కూటమిపార్టీల చెంతన చేరడంతో మంగళవారం ఉదయం జరిగిన డిప్యూటీ మేయర్ ఎన్నికకు ముందే నాటకీయ పరిణామాలతో ఏకంగా 25మంది వైసిపి కార్పొరేటర్లు కూటమిపార్టీకి మద్దతు తెలపడంతో టిడిపి పాగా వేసినట్లయింది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్‌లో 50మంది కార్పొరేటర్లుఉండగా ఒక డివిజన్‌లో 2021లో ఎన్నికలు వాయిదాపడ్డాయి. ఏడాదిన్నరక్రిందట 24వ డివిజన్ వైసిపి కార్పొరేటర్ హనుమంతునాయక్ మరణంతో ఖాళీఅయ్యింది. గత ఏడాది మార్చిలో ఎన్నికల నేపథ్యంలో 4వడివిజన్ కార్పొరేటర్(పూర్వ డిప్యూటీ మేయర్)భూమన అభినయ్‌రెడ్డి రాజీనామా చేశారు. 35వ డివిజన్ కార్పొరేటర్ ఆర్‌సి మునికృష్ణ ఒక్కడే గతంలోనూ టిడిపి నుండి ఎన్నికైన వాడే. గత నాలుగేళ్ళలో ఆయన కౌన్సిల్‌లో ఎదుర్కొన్న పరాభవాలు, అనుభవాలు, చేదు సంఘటనలు ఇప్పుడు ఆయనకు కలిసొచ్చిన అవకాశంగా డిప్యూటీ మేయర్ పదవిని అందుకునేలా చేసిందనేది కూటమికి మద్దతుగా నిలిచిన 25మంది వైసిపి కార్పొరేటర్లు వాదన వినిపించడం విశేషం. 47మంది కార్పొరేటర్లు బలమున్న తిరుపతి నగరపాలక కౌన్సిల్‌లో వైసిపి ఎంపి డాక్టర్ మద్దిల గురుమూర్తి(వైసిపి), తిరుపతి సిట్టింగ్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు(జనసేన), ఎంఎల్‌సి డాక్టర్ సిపాయిసుబ్రమణ్యం(వైసిపి) ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఉన్నారు. మంగళవారం ఉదయం తర్జనభర్జనలు అనంతరం మొదలైన డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో 26మంది కార్పొరేటర్లు టిడిపి మునికృష్ణకు ఓటువేశారు. వైసిపి అభ్యర్థి లడ్డు భాస్కర్‌రెడ్డికి 21మంది మద్దతుగా నిలిచారు. దీంతో వైసిపికి పూర్తిస్థాయి బలమున్నప్పటికీ కొందరు కార్పొరేటర్లు తీరుతో టిడిపి కార్పొరేటర్ డిప్యూటీ మేయర్‌గా ఎన్నికయ్యారు. ఆయన డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైనట్లు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి శుభం బన్సల్ ప్రకటించారు. తిరుపతి నగరపాలక కౌన్సిల్‌లో గత ఎనిమిదినెలలుగా వైసిపికి చెందిన కార్పొరేటర్లు 20మందివరకు కూటమివైపే మొగ్గు చూపుతున్నారు. గతంలోనే ఏకంగా వీరంతా కలసి టిడిపి పార్టీ కండువాలు వేసుకునేందుకు అమరావతివెళ్ళారు. అక్కడ టిడిపి అధినేత, సిఎం చంద్రబాబునాయుడు నుండి సంకేతాలు రాకపోవడంతో స్వతంత్రులుగానే కొన సాగుతున్నారు. వీరంతా ఇప్పుడు డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో తమ ఓటును కూటమి బలపరిచిన ఆర్‌సి మునికృష్ణకే వేసి మద్దతు తెలిపారు. కాగా 2021 ఏప్రిల్‌లో జరిగిన తొలి కౌన్సిల్ ఎన్నికల్లో 50 మంది కార్పొరేటర్లకుగాను అప్పటి అధికారంలో ఉన్న వైసిపి ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి 22 డివిజన్లలో వైసిపి కార్పొరేటర్లను ఏకగ్రీవం చేసుకున్నారు.మిగిలిన 28 డివిజన్లకు ఎన్నికలు 26మంది వైసిపివారే. తాజాగా ఉన్న 48మంది కార్పొరేటర్లలో ఒక టిడిపి కార్పొరేటంకు అనూహ్యంగా అవకాశం దక్కింది. ఇప్పటికీ మేయర్‌గా కొనసాగుతున్న డాక్టర్ శిరీష, ఉప మేయర్‌గా ఉన్న ముద్రనారాయణ రానున్న రోజుల్లో పదవులు వదలుకుంటారా?లేక కూటమిచెంత చేరుతారా అనేది కాలం నిర్ణయించనుంది.

తిరుపతిలో బలమైన బిసి వర్గానికి చెందిన రష్ ఆస్పత్రి అధినేత డాక్టర్ సిపాయిసుబ్రమణ్యంను డిప్యూటీ మేయర్ ఎన్నికకు కొన్ని గంటల ముందు కూటమి పార్టీలు కిడ్నాప్‌చేశారని, ఫోన్‌లో కూడా అందుబాటులో లేరని వైసిపి వర్గీయులు ఆరోపించారు.

## అమరావతి మీదుగా ఎర్రుపాలెం నంబూరు మధ్య కొత్త రైల్వే లైన్ పనులు

**విజయవాడ.ఫిబ్రవరి4,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతి మీదుగా ఎర్రుపాలెం నంబూరు మధ్య కొత్త రైల్వే లైన్ పనులు నాలుగేళ్లలో పూర్తి చేయనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. 56 కి.మీ. మేర నిర్మించే ఈ ప్రాజెక్టుకు రూ.2,545 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేసినట్లు వెల్లడించారు. విజయవాడలో డీఆర్ఎం నరేంద్ర ఎ.పాటిల్ వేర్వేరుగా విలేకరులకు వెల్లడించారు ఏపీలోని వివిధ ప్రాజెక్టుల నిర్మాణానికి భూసేకరణలో జాప్యమయ్యేదని, సీఎం చంద్రబాబు వివిధ శాఖలతో ఏర్పాటుచేసిన టాస్క్‌ఫోర్స్ వల్ల సమన్వయ సమావేశాలు నిర్వహించి, సమస్యలు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. భూసేకరణ త్వరగా పూర్తయితే పనుల్లో వేగం పెరుగుతుందని చెప్పారు.గతేడాది బడ్జెట్‌లో ఏపీకి రూ.9,151 కోట్లు కేటాయించారు.ఈసారి రూ.9,417 కోట్లకు పెంచారు. రైలు ప్రమాదాలు నివారించే కవచ్ వ్యవస్థను కర్నూలు గుంతకల్లు మార్గంలోని 122 కి.మీ. మేర అందుబాటులోకి తెచ్చాం. బల్హార్ష విజయవాడ మార్గంలో ఏపీ పరిధిలో 36 కి.మీ, విజయవాడ గూడూరు మధ్య 293 కి.మీ, నల్వార్ గుంతకల్లు ఎర్రగుంట్ల రేణిగుంట మార్గంలో 401 కి.మీ, విజయవాడ దువ్వాడ మధ్య 330 కి.మీ. పరిధిలో కవచ్ ఏర్పాటు పనులు వివిధ దశల్లో ఉన్నాయి.

# ఎపిలో కుల గణన సర్వే చేపట్టాలి

## : పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



**విజయవాడ. ఫిబ్రవరి4. ప్రభాత వార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కుల గణన సర్వే చేపట్టాలని కూటమి ప్రభుత్వాన్ని పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ఐదున్నర కోట్ల రాష్ట్ర జనాభాలో వెనుకబడిన వర్గాల వారి సంఖ్య ఎంతో తేల్చాలంటూ ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఆమె సూచించారు. మంగళవారం విజయవాడలో ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల విలేకర్లతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఐదున్నర కోట్ల జనాభాలో వెనుకబడిన వర్గాల వారి సంఖ్య ఎంతో తేల్చాలన్నారు. అలాగే కుల వివక్షకు గురవుతున్న బలహీన వర్గాల ప్రజలు ఎంత మంది ఉన్నారో లెక్కలు తీయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మనమెంతో మనకంతా అన్నట్లుగా.. రాజకీయ, సామాజిక, విద్యా, ఉద్యోగాలలో వారి వాటా వారికి దక్కాల్సి ఉందని పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల అభిప్రాయపడ్డారు. జనాభా ప్రాతిపదికన న్యాయంగా రిజర్వేషన్లు అమలు కావాల్సి ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు కులగణన చేపట్టినా.. బీజేపీ దత్తపుత్రుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆ సర్వే వివరాలు తొక్కిపెట్టారని వైఎస్ షర్మిల వ్యంగ్యంగా అన్నారు. ఆ వివరాలు బయటకు రాకుండా జాగ్రత్త పడ్డారంటూ మాజీ సీఎం వైఎస్ జగన్ పై మండిపడ్డారు. బీజేపీ డైరెక్షన్ లోనే సర్వే రిపోర్టు బయటకు పొక్కకుండా కుట్ర చేశారంటూ వైఎస్ జగన్ పై ఆగ్రహం వ్యక్తం చేసారు.దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేస్తుంటే.. రిజర్వేషన్ల రద్దుకు కుట్ర అంటూ బీజేపీ తప్పు దారి పట్టించే ప్రయత్నం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ఉచ్చులో మీరు పడవద్దంటూ సీఎం చంద్రబాబుకు ఈ సందర్భంగా వైఎస్ షర్మిల సూచించారు. వెంటనే ఏపీలో సైతం కులగణన సర్వే చేపట్టాలని.. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన దేశానికే ఆదర్శమని ఈ సందర్భంగా వైఎస్ షర్మిల అభివర్ణించారు. ఇదో చారిత్రాత్మక ఘట్టమన్నారు. ఈ సర్వే యావత్ భారతావనికి దిక్సూచి అని తెలిపారు. దేశ భవిష్యత్ కోసం రాహుల్ గాంధీ దూరదృష్టికి ఇదొక నిదర్శన మన్నారు.

## మార్చి ఆఖరు వరకూ ఖరీఫ్ ధాన్యం సేకరణ

**విజయవాడ ఫిబ్రవరి 04 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఖరీఫ్ ధాన్యం సేకరణ గడువును ప్రభుత్వం పొడిగించింది. మార్చి నెలాఖరు వరకు సేకరించనున్నట్లు పౌరసరఫరాల సంస్థ వీసీ, ఎండీ మనజీర్ జిలాని తెలిపారు. మార్చి తర్వాత వచ్చినా, అవసరమైతే రబీలో సేకరించే విషయాన్ని పరిశీలిస్తామని చెప్పారు. నిజమైన రైతుల వద్ద ఉన్న ధాన్యం మొత్తాన్ని కొంటామని, రైతుల పేరుతో ఇతరులు విక్రయించాలని చూస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కృష్ణా జిల్లాల్లో పలుచోట్ల పంట కోసి, వరి కుప్పలువేశారు. అదే పొలంలో రెండో పంటగా అపరాలు వేసినందున , ఆపంట చేతికొచ్చే వరకు వరి కుప్పలు నూర్చే వీల్లేదు. శ్రీకాకుళం జిల్లాలోనూ ధాన్యం నిల్వలున్నాయి. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో ఖరీఫ్ ధాన్యం ఆలస్యంగా వస్తుంది. ఆయా జిల్లాల రైతుల వినతుల మేరకు ధాన్యం సేకరణ గడువును ప్రభుత్వం పొడిగించింది. వైకాపా హయాంలో 2023 ఖరీఫ్‌లో 29 లక్షల టన్నుల ధాన్యం సేకరించగా, ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక 2024 ఖరీఫ్‌నకు సంబంధించి ఇప్పటికే 31.52 లక్షల టన్నులు సేకరించింది. మరో 4 లక్షల టన్నుల వరకు రైతుల వద్ద ఉన్నట్లు అంచనా. అప్పట్లో ధాన్యం అమ్మిన రైతులకు నెలల తరబడి డబ్బులు రాకపోగా, ఈ ప్రభుత్వం 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేస్తోంది. ఇప్పటికే రూ.7222 కోట్లు చెల్లించింది.

# ఇంద్రకీలాద్రిలో సూర్యోపాసన సేవ

## వైభవంగా శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుని కళ్యాణం



**ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ ఆలయంలో వైభవంగా శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామివార్ల కళ్యాణోత్సవాన్ని మంగళవారం మాఘమాసం శుద్ధ షష్టి సందర్భంగా నిర్వహించారు. ముందుగా శ్రీ స్వామి అమ్మవార్లను చూడముచ్చటగా అలంకరించిన కళ్యాణ వేదికలపై వేంచేపు చేసి వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కళ్యాణం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దుర్గమ్మ ఆలయంలో మాఘమాసం షష్టి, రథసప్తమి తిథుల సందర్భంగా వేదోక్తంగా సూర్యోపాసన సేవను మంగళవారం నిర్వహించారు. ఆదిత్య హృదయం, సూర్యాష్టకం, సూర్యనమస్కారాలు ఆచరిస్తూ అరుణ పారాయణ గావించిన అర్చకులు శ్రీ స్వామివారికి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. లోకసంక్షేమార్థం నిర్వహించిన ఈ సేవలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈఓ కె రామచంద్ర మోహన్ మాట్లాడుతూ ఈ మాఘమాసంలో సూర్యోపాసన సేవలను ఈనెల 8వ తేదీ శనివారం భీష్మఏకాదశి, 9వ తేదీ ఆదివారం మాఘశుద్ధ ద్వాదశి, 12వ తేదీ మాఘమాస పూర్ణిమ, 16 ఆదివారం, 23వ తేదీ ఆదివారం, 24 సోమవారం బహుళ ఏకాదశి, 26 బుధవారం మాఘబహుళ చతుర్ధశి పర్వదినాల్లో ఉదయం 8 గంటలకు అరుణ పారాయణ, సూర్యనమస్కారాలు, ఆదిత్య హృదయం, సూర్యాష్టకం పఠిస్తూ పండితులు పూజాదికాలు నిర్వహిస్తారని, రు.1000ల ఉభయంతో దంపతులు పూజలో పాల్గొనవచ్చని తెలిపారు.

# ఎగువ కాఫర్ డ్యాం పొడవునా బట్రెస్ డ్యాం

**విజయవాడ ఫిబ్రవరి 04 ప్రభాతవార్త ప్రతినిధి:** పోలవరంలో విదేశీ నిపుణులు డి సిస్కో, డేవిడ్ పాల్ ఆధ్వర్యంలోసోమవారమూ కీలక చర్చలు జరిగాయి. ఇందులో పోలవరం అథారిటీ సభ్య కార్యదర్శి రఘురామ్ , కేంద్ర జలసంఘం నుంచి సరబ్‌జీత్‌సింగ్ బక్షి, రాకేష్, అశ్వనీకుమార్ వర్మ,రమేష్ కుమార్‌తో పాటు ఇంజినీర్ ఇన్ చీఫ్ ఎం.వెంకటేశ్వరరావు, వివిధ కేంద్ర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. కొత్తగా నిర్మిస్తున్న డయాఫ్రం వాల్ కోసం ఏర్పాటు చేసిన ప్లాట్‌ఫాం వరదల సమయంలో సీపేజీ నీటితో మునిగిపోకుండా ఎలాంటి చర్యలు చేపట్టాలి ఏయే జాగ్రత్తలు తీసుకోవాలో కూడా ఈ సమావేశంలో చర్చించారు. పోలవరం ప్రాజెక్టులో ఎగువ కాఫర్ డ్యాం సీపేజీని నియంత్రించేందుకు ఆ డ్యాం పొడవునా బట్రెస్ డ్యాం నిర్మించాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఉన్న ఎగువ కాఫర్ డ్యాం 2458 మీటర్ల పొడవునా దిగువ వైపు దీన్ని నిర్మిస్తారు. డ్యాం గర్భం వద్ద నిర్మించడం వల్ల దిగువ వైపు నుంచి వస్తున్న సీపేజీని అరికట్టడానికి ఇది ఉపకరిస్తుందని పోలవరం విదేశీ నిపుణులు ఇప్పటికే తేల్చారు. అందుకు సంబంధించి సోమవారం నాటి సమావేశంలో చర్చించారు. ఇందులో చెప్పిన మార్పులు, చేర్పులు చేసి పంపితే తాము అనుమతులు ఇస్తామని కేంద్ర జలసంఘం పెద్దలు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## తొలిదశలో గుర్తించడం, సరైన చికిత్స అందించడం ద్వారానే క్యాన్సర్ మహమ్మారిని ఎదుర్కోగలం

### - మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ ఫిబ్రవరి 04 ప్రభాతవార్త ప్రతినిధి:** నివారణ, ముందస్తు పరీక్షలు, తొలిదశలో గుర్తించడం, సరైన చికిత్స అందించడం ద్వారానే క్యాన్సర్ మహమ్మారిని ఎదుర్కోగలమని ఏపీ ఆరోగ్యశాఖా మంత్రిసత్యకుమార్ యాదవ్ అన్నారు.

ప్రపంచ క్యాన్సర్ దినం సందర్భంగా ఎక్స్ వేదికగా వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ట్వీట్ చేశారు. నోటి , రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌లకు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉచిత ముందస్తు పరీక్షలు నిర్వహిస్తోంది. ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలి మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.



సూర్య భగవానునికి ప్రత్యేకాభిషేకాలు

# సత్యవ్రత భాస్కరక్షేత్రంలో రథసప్తమి వేడుకలు

**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త** సత్యవ్రత భాస్కర క్షేత్రంలో పురాణఇతిహాసాలు పేర్కొంటున్న శ్రీకాళహస్తి క్షేత్రంలో రథసప్తమి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. హిందూ సంస్కృతీ, సాంప్రదాయాల్లో రథసప్తమి విశిష్టమైన పర్వదినంగా భావిస్తారు. ఇంటింటా సూర్యపూజలను నిర్వహించి సూర్యదేవునికి విశేష పూజలను నిర్వహించారు.

**శివయ్యసన్నిధిలో సూర్యభగవానునికి అభిషేకాలు:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో రథసప్తమి సందర్భంగా సూర్యదేవునికి విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారి ఆలయంలోని సూర్యదేవుని విగ్రహానికి విశేష అభిషేకాలు నిర్వహించి పుష్పాలంకరణలు చేసి హారతులిచ్చారు.ఆలయ ఇఒ డి.బాపిరెడ్డి పర్యవేక్షణలో ఏర్పాట్లు జరిగాయి. అభిషేకాల్లోనూ ఆలయానికి విచ్చేసిన భక్తజనం స్వామి వారి ఆలయంలోని సూర్యదేవున్ని దర్శించుకొని భక్తి శ్రద్ధలతో మొక్కుకున్నారు. అలాగే జలవినాయకుని సమీపంలోని సూర్యదేవుని ఆలయంలోనూ విశేష పూజలను నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు నిర్వహించి విశిష్ట అలంకారం చేశారు. స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో సూర్యదేవున్ని దర్శించుకొని పూజలు జరుపుకున్నారు.

**సూర్యపుష్కరిణి జలాలతో . . .** ఇక్కడే వెలసియున్న సూర్యపుష్కరిణి జలాలతో గతంలో స్వామి అమ్మవార్లకు నిత్యం అభిషేకాలను నిర్వహించే వారు. ఇక్కడి సూర్యపుష్కరిణి విశిష్టత గురించి పురాణాల్లో చెప్పబడి వుంది. సూర్య ప్రభ వాహనంపై స్వామి వారిని వుంచి గ్రామోత్సవం నిర్వహించారు.

**ఊరేగింపులు:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం రథసప్తమి సందర్భంగా ఆలయంలో అభిషేకాల నిర్వహణ జరిగింది. సాధారణంగా శ్రీకాళహస్తీశ్వరుని సూర్యప్రభవాహనంపై అమ్మవారిని చప్పరంపై ప్రతిష్టించి గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవంతో పాటు ఉభయదారులు సమీప గ్రామానికి చెందిన మునగాల భక్త వత్సల నాయుడు కుటుంబసభ్యులు వెంటరాగా కన్నుల పండువగా గ్రామోత్సవం జరిపారు. స్వామి అమ్మవార్లను అలంకార మండపంలో చక్కగా ముస్తాబు చేసి తేరువీధిలోని వాహనాల మండపం వద్ద ఉత్సవ వాహనాల్లో ప్రతిష్టించి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఉత్సవంను ఆలయ ఇన్స్పెక్టర్ హరియాదవ్,సిఎస్ఓ నాగభూషణం యాదవ్,ద ఫేదార్ రాజా తదితరులు వెంటరాగా ఉత్సవం కన్నుల పండువగా సాగింది.

# ఎన్డీఏ కూటమి నాయకుల అనైతిక విధానాలపై ఇసికి ఫిర్యాదు

**విజయవాడ,ఫిబ్రవరి4,ప్రభాతవార్తప్రతినిధి:** అడ్డదారిలో విజయం సాధించడమే లక్ష్యంగా మున్సిపల్ ఉప ఎన్నికల్లో రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి నాయకులు రౌడీయిజం చేస్తూ అనైతిక విధానాలపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ కి ఫిర్యాదు చేశామని విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం వైయస్సార్‌సీపీ ఇంఛార్జ్ మల్లాది విష్ణు వెల్లడించారు. తిరుపతిలో ఓటింగ్‌కు వెళ్తున్న తమ పార్టీ కార్పొరేటర్లు ప్రయాణిస్తున్న బస్సు పై దాడి చేసి ధ్వంసం చేయడంతో పాటు, నలుగురు కార్పొరేటర్లను కిడ్నాప్ చేసి తీసుకెళ్లారని ఆయన తెలిపారు. చివరకు ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యంను కూడా టీడీపీ గూండాలు కిడ్నాప్ చేసి తీసుకెళ్లిన ఘటన చూస్తే.. మనం ఏపీలో ఉన్నామో.. బీహార్‌లో ఉన్నామో అర్థం కాని పరిస్థితి అని చెప్పారు. మున్సిపల్ ఎన్నికలు జరిగిన అన్ని చోట్లా ఇదే పరిస్థితి నెలకొందని ఎస్ఈసీ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడిన మల్లాది విష్ణు వెల్లడించారు. ఇలాంటి ఘటనలు చోటుచేసుకునే ప్రమాదం ఉందని ఎన్నికలకు ముందు నుంచే ఎస్ఈసీకి చెప్పామని, పరిస్థితిని ఎప్పటికప్పుడు పోలీసుల దృష్టికి తీసుకెళ్తూ అప్రమత్తం చేస్తూనే ఉన్నామని మల్లాది విష్ణు తెలిపారు. తిరుపతి కార్పొరేటర్లకు భద్రత కల్పించమని ప్రాధేయపడినా పోలీసులు పట్టించుకోలేదని, తమకేమీ సంబంధం లేదన్నట్లు వ్యవహరించారని చెప్పారు. పవిత్రతకు మారుపేరైన తిరుపతి విశిష్టతను కూటమి నాయకులు దౌర్జన్యకాండతో కాల రాస్తున్నారని, కార్పొరేటర్లను, ఎమ్మెల్సీలను తమవైపు తిప్పుకునేందుకు కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు బరిలోకి దిగి ప్రలోభాలకు గురి చేశారని, లొంగని వారిని బెదిరించారని వెల్లడించారు.

అందుకే వరసగా మూడు రోజుల నుంచి ఎస్ఈసీకి ఫిర్యాదు చేస్తున్నామని వివరించారు. తిరుపతిలో తమ పార్టీకి కేవలం ఒకే కార్పొరేటర్ ఉన్నప్పటికీ సీఎం చంద్రబాబు ఆదేశాలతో, డిప్యూటీ మేయర్ పదవి కోసం టీడీపీ చేసిన అరాచకాలు, దౌర్జన్యాలను ప్రజలే ఈసడించుకుంటున్నారని మల్లాది విష్ణు వివరించారు.

## పింఛన్ల పంపిణీ ఉదయం 7గంటలకు ప్రారంభించాలని సిఎం ఆదేశం

## హర్షం వ్యక్తం చేసిన గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం

**విజయవాడ, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** ప్రతినెలా 1వ తేదీన పంపిణీ చేసే పెన్షన్లు ఉదయం 5 కు కాకుండా 7 గంటలకు ప్రారంభించేలా ఆదేశాలిచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అప్పలనాయుడులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే సాయంత్రం 5 గంటలలోపు ప్రభుత్వ ఉద్యోగులు పెన్షన్లను 100 శాతం పూర్తి చేయగలరని, దీన్ని దృష్టిలో వుంచుకుని ముఖ్యమంత్రి ఉన్నతాధికారులు మరోమారు ఆలోచించి నిర్ణయించాలని కోరారు.

# తిరుపతి ఐఐటిలో నేషనల్ ఇంటిగ్రేషన్ టూర్



తిరుపతి ఐఐటిలో ఈశాన్య ప్రాంత విద్యార్థులు

**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 4 ప్రభాతవార్త** తిరుపతి ఐఐటిలో మంగళవారం ఈశాన్య ప్రాంతాలకు చెందిన 25 మంది విద్యార్థులు హాజరై పాల్గొన్నారు. వారికి ఐఐటిటి డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్ సత్య నారాయణ ఐఐటి విద్య గురించి లాభాలు, భవిష్యత్తు గురించి విద్యార్థులకు వివరించారు. 25 మంది విద్యార్థులు స్టూడెంట్స్ ఎక్స్‌పీరియన్స్ ఇన్ ఇంటర్-స్టేట్ లీవింగ్ ప్రోగ్రాం కింద వారి నేషనల్ ఇంటిగ్రేషన్ టూర్‌లో భాగంగా తిరుపతి ఐఐటి క్యాంపస్ సందర్శనకు వచ్చారు. ఈ టూర్ లక్ష్యం ఏమిటంటే టూర్ ఉద్దేశ్యం విద్యార్థులు దేశ వ్యాప్తంగా వివిధ సాంస్కృతిక సంప్రదాయ పద్దతులను అవగాహన చేసుకోవటానికి అధ్యయనం చేయటానికి పరిచయం చేసుకోవటానికి సమీకరించటానికి అవకాశాన్ని అందించటం జరుగుతుందన్నారు. విద్యార్థులకు డైరెక్టర్ ప్రొఫేసర్ కె.యన్, సత్యానారాయణ డీన్ ఆఫ్ కాంపిటెన్సి డెవలప్‌మెంట్ అండ్ అవుట్‌రిచ్ యాక్టివిటీస్ ప్రొఫేసర్ అరుణ్ తంగిరాల జాతీయ సమైక్యత, సాంస్కృతిక మార్పిడి ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు అత్యాధునిక ల్యాబ్‌లు మౌళిక సదుపాయాలు, వివిధ సాంకేతికతలు సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్శన వారికి ప్రీమియర్ ఇన్‌స్టిట్యూట్ విద్యా,పరిశోధనా వాతావరణంలో విలువైన సమాచారాన్ని అందించారు.విద్యార్థుల్లో ఐక్యత,అవగాహను పెంపొందించానికి కీలక పాత్ర పోషిస్తూ దేశం సంబందాలను బలోపేతం చేసుకుంటుందన్నారు.

# ఉగాది నుంచి పి4 విధానం అమలు: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

## - ప్రజల నుంచి అభిప్రాయాల సేకరణకు పోర్టల్



పీ-4 విధనంపై సమీక్ష నిర్వహిస్తున్న సీఎం చంద్రబాబు

**విజయవాడ., ఫిబ్రవరి 4,ప్రభాతవార్తప్రతినిధి:** పేదరిక నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పీ4 విధానాన్ని ఉగాది పండుగ నుంచి ప్రారంభిచనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. పీ4 విధానం ద్వారా సమాజంలో ఆర్థికంగా అగ్రస్థానంలో ఉన్న 10 శాతం మంది...అట్టడుగున ఉన్న 20 శాతం మందికి చేయూతనివ్వడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని సీఎం అన్నారు. దీనిపై సమగ్ర విధి విధానాలను రూపొందించేందుకు ప్రజల నుంచి సలహాలు, సూచనలు, అభిప్రాయాలను తీసుకునేందుకు ప్రత్యేకంగా పోర్టల్‌ను తీసుకురావాలని అధికారులను సీఎం ఆదేశించారు. పేదరిక నిర్మూలన విషయంలో ప్రజల అభిప్రాయాలు, ఆలోచనలను తీసుకుని పీ4 విధానాన్ని అమలు చేయనున్నట్లు సీఎం తెలిపారు. సచివాయంలో ప్లానింగ్ శాఖపై సమీక్ష సందర్భంగా పీ4 కార్యక్రమం ప్రారంభంపై అధికారులతో చర్చించారు. పారిశ్రామిక వేత్తలు, ఎన్ఆర్ఐలతో పాటు కొంత ఉన్నత స్థాయిలో ఉన్నవారు పేదలకు సాయం చేసేందుకు ముందుకొస్తున్నారని ....వీరందరినీ ఒక గొడుగు కిందకు తెచ్చి పీ4 విధానం అమలు చేస్తామని చెప్పారు. ఇదే సమయంలో ప్రత్యేక సర్వే ద్వారా అట్టగుడున ఉన్న వర్గాలను గుర్తించి...వారికి సాయం అందేలా చేస్తామన్నారు. దీనికోసం అవసరమైన డేటాను సేకరించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఇప్పటికే పలువురు పారిశ్రామిక వేత్తలు తమ సొంత ఊళ్లు, మండలాలను అభివృద్ధి చేసేందుకు ముందుకు వచ్చారని...అలా ఆసక్తి ఉన్న వారిని స్వయంగా ఆహ్వానించి...ఉగాది రోజున పీ4 కార్యక్రమాన్ని ఆవిష్కరిస్తామన్నారు. పబ్లిక్‌ప్రైవేట్‌పీపుల్స్ పార్ట్నర్‌షిప్ విధానం అమలు ద్వారా పేదరిక నిర్మూలకు అడుగులు వేస్తామని సీఎం చంద్రబాబు అన్నారు. ఈ సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఆర్థికశాఖా మంత్రి పయ్యావుల కేశవ్, ప్లానింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# కల్తీపాలపై పూర్తి స్థాయిలో దర్యాప్తు

**అనంతపురం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త బ్యూరో** ఉమ్మడి అనంతపురం జిల్లాలో కల్తీపాల విక్రయం జోరుగా సాగుతోందని ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజిలెన్స్ డిఎస్పీ నాగభూషణం హెచ్చరించారు. కల్తీ పాలను నేరుగా డైరీలకు పంపుతున్నారని, ఇది అనంతపురం జిల్లానే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్నట్లు మా దృష్టికి వచ్చిందన్నారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. మంగళవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో కల్తీ పాల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయని, దీనిపై నిగాబెట్టి రాప్తాడు నియోజకవర్గంలోని బండమీదపల్లి గ్రామంలో పెద్ద ఎత్తున కల్తీపాల తయారీ విక్రయం కొనసాగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా రామిరెడ్డి అనే వ్యక్తి ఇంట్లో కల్తీ పాలకు సంబంధించి తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి అనేక రకాలైనటువంటి కెమికల్ ఉపయోగించి పాలను తయారు చేస్తున్న విషయాన్ని గుర్తించామన్నారు. పాలలో చిక్కదనం కోసం పామాయిల్, ఉప్పున మాల్టోడెక్సిన్ అనే రసాయన పదార్థాలను కలుపుతున్నారని, తాము ఆ ఇంటిపై దాడి చేసినప్పుడు ఆ రసాయన పదార్థాల నిల్వలు ఉన్నాయని ఆయన చెప్పారు. రామిరెడ్డిని అదుపులోకి తీసుకొని విచారించగా చాలా కాలంగా ఈ పాలను తయారుచేసి విక్రయిస్తున్న విషయాన్ని వెల్లడించినట్లు తెలిపారు. ఈ ప్రక్రియ మిగతా వాళ్లు కూడా కొందరు చేస్తున్నట్లు అనుమానాలు ఉన్నాయని, ఇది జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్నట్లు తమకు అనుమానాలు ఉన్నాయన్నారు. శాంపిల్స్ హైదరాబాద్‌లోని పరీక్ష కేంద్రాలకు పంపామని, ఫుడ్ సేఫ్టీ వాళ్లు కూడా పంపారని నివేదికలు వచ్చాక తగు చర్యలు తీసుకుంటా మన్నారు. కల్తీ పాలను పాల డైరీలు పంపుతున్నారని, నేరుగా వినియోగదారులు పంపలేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. కల్తీ పాల వల్ల ప్రజలకు క్యాన్సర్ రావడమే కాకుండా అనేక రకాల జబ్బులు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. బండమీదపల్లి గ్రామంలో నలుగురు వ్యక్తులు ఈ విధమైనటువంటి తయారీ చేసి నేరుగా పాల డైరీలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కల్తీపాల తయారీ భారీగా సాగుతోందని ప్రతి ఒక్కరూ దీన్ని గుర్తించి అప్రమత్తంగా ఉండాలని డిఎస్పీ హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటున్న ఇటువంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతంలో జిల్లాలో అనేక చోట్ల ఈ రకమైన పాల తయారీ చేసి విక్రయాలు చేస్తున్న విషయాన్ని పసిగట్టగా ఆఖరికి బండమీద పల్లిలో తయారీదారుల వ్యవహారం వెలుగులోకి వచ్చిందన్నారు.

5-2pg7exHMNWJQE.qxd:5-2pg7exHMNWJQE.qxd 01/01/01 9:39 AM Page 1



# కులగణన సర్వేపై శాసన మండలిలో చర్చ

## ప్రకటన ప్రవేశపెట్టిన డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క

### అనుమానాల నివృత్తికి అవకాశం ఇచ్చిన మండలి ఛైర్మన్



**హైదరాబాద్, ఫిబ్రవరి, 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రత్యేకంగా సమావేశమైన శాసనమండలిలో ప్రభుత్వం రెండు ప్రకటనలను ప్రవేశ పెట్టింది. సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కులసర్వే-2024పై అలాగే తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ లోని ప్రత్యేక వర్గాల ఉప ఉపవర్గీకరణపై డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్‌తో నియమించబడిన ఏకసభ్య కమిషన్ ఇచ్చిన నివేదికపై ప్రకటనను ప్రభుత్వం తరపున మంగళవారం శాసన మండలిలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టారు. ప్రభుత్వం ప్రకటన చేసిన నేపథ్యంలో రెండు అంశాలపై చర్చ లేకుండా కేవలం మండలి సభ్యులకు ఉన్న అనుమానాలను నివృత్తి చేసుకోవడానికి అవకాశం కల్పించారు. మంగళవారం రాష్ట్ర శాసన సభతోపాటు శాసనమండలి ప్రత్యేకంగా సమావేశమైంది. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారభం కాగానే.. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ప్రస్తుతం కేబినెట్ మీటింగ్ కొనసాగుతోంది.. కొంత సమయం ఇస్తే మీటింగ్ ముగిసిన తరువాత రెండు అంశాలపై ప్రభుత్వం ప్రకటన చేస్తుందని తెలిపారు. దీంతో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. మధ్యాహ్నం 2.20 గంటలకు సభ ప్రారంభం కాగానే.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కుల గణన నివేదికను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మండలిలో ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో శాసన మండలిలో కేబినెట్ ఆమోదం తెలిపిన కులగణన నివేదిక రిపోర్టును ప్రవేశ పెట్టారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టారు. ప్రకటనపై సాధారణంగా చర్చ ఉండదని సభ్యులు కేవలం అనుమానాలను(క్లారిఫికేషన్స్) అడగాలని మండలి ఛైర్మన్ సూచించారు. ప్రతిపక్ష నేత మదుసూదనాచారి మాట్లాడుతూ బీసీ కులగణనపై సమగ్రంగా చర్చ జరగాలి.. అలాంటి చర్చ జరగాలంటే పూర్తిస్థాయి నివేదికను సమర్పించాలని కోరారు. నివేదిక కోసం రాష్ట్ర ప్రభుత్వం కొండను తవ్వి ఎలుకను పట్టినట్టుగా ఉందని విమర్శించారు. డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాష్ మాట్లాడుతూ ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ వెబ్‌సైట్‌లో నివేదిక ఉందని దానిపై స్పష్టం ఇవ్వాలని బండ ప్రకాష్ కోరారు.

ప్రభుత్వం ప్రకటించిన కులగణన వివరాలతో స్థానిక సంస్థల ఎన్నికల్లో, ఉద్యోగాల్లో బీసీలకు రిజర్వేషన్లు 42 శాతం కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ చెప్పడం లేదన్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నివేదికను మండలిలో ప్రవేశపెట్టిన సందర్భంగా సభ్యుల ప్రశ్నలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు సమాధానమిచ్చారు. షెడ్యూల్ కులాలు, తెగలు, వెనుకబడిన తరగతులు, రాష్ట్రంలోని ఇతర బలహీన వర్గాల సంక్షేమానికి విధానాల రూపకల్పన చేయడానికి ప్రభుత్వం కుటుంబ సర్వే సమాచారాన్ని ఉపయోగిస్తుందన్నారు. రాష్ట్రంలో మొత్తం బీసీల సంఖ్య 56. 33 శాతం అని సమగ్ర ఇంటింటి సర్వే ద్వారా తేలింది. ఈ సంఖ్యల ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు, బడ్జెట్లో కేటాయింపులకు సర్వే సమాచారాన్ని వినియోగిస్తామన్నారు. సర్వే సమాచారం ఆధారంగా సమగ్రత, పారదర్శకత ప్రాతిపదికగా నడిచే పాలనకు నూతన దశ ప్రారంభాన్ని ఈ సర్వే సూచిస్తుందన్నారు. ఈ సర్వే సమాచారం ఆధారంగా రాబోయే రోజుల్లో చాలా చేయబోతున్నామని.. ఈ సర్వే రాష్ట్రంలోని ప్రజల వివిధ రకాల స్థితిగతులపై ఫుల్ బాడీ చెకప్ ఒక ఎక్స్ రే లాంటిదన్నారు. వెనుకబడిన వర్గాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో ఉందని ఈ సర్వే స్పష్టం చేస్తుందని భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలో 3.56 లక్షల మంది సర్వేలో పాల్గొనలేదని.. అందులో కేసీఆర్, కేటీఆర్, హరీష్, పల్లా రాజేశ్వర్ రెడ్డి లాంటి వారు ఉన్నారన్నారు. వారు ఇప్పుడు ఆసక్తి కనబరిచి సమాచారం ఇస్తే తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని.. టిఆర్ఎస్ నాయకులు సమగ్ర కుటుంబ సర్వే పేరిట ఒకేరోజు ఆరు గంటల్లో సర్వే పూర్తి చేశామని తెలిపారు. మీరు చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే ఏం చేసుకున్నారో.. ఎవరికీ తెలియదు. మీరు అధికారంగా చేసి ఉంటే సభలో పెట్టలేదు బహిరంగంగా ప్రకటన చేయలేదు కాబట్టి అది అధికారిక డాక్యుమెంట్ ఎలా అవుతుందని ప్రశ్నించారు. రాష్ట్రంలో కులగణనపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి సైంటిఫిక్ సర్వే జరగలేదు.. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలోనే ఇది మొదటిది. సర్వే ఆధారంగా రాష్ట్ర వనరులు సంపదను అభివృద్ధికి కావలసిన విధంగా వినియోగిస్తాం. రాజకీయ, విద్య, ఆర్థిక రంగాల్లో వెనుకబడిన వారిని గుర్తించి ఆ వర్గాల ప్రగతికి వినియోగిస్తాం.

బలహీన వర్గాలకు మేలు జరగాలన్న ఆలోచన ఉండదు కాబట్టి టిఆర్ఎస్ నాయకులకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సర్వేపై నమ్మకం ఉండదన్నారు. వివిధ ప్రజా సంఘాలు సామాజికవేత్తలు మేధావులు ఇతర భాగస్వాములు అభిప్రాయాలు పరిగణలోకి తీసుకొని సర్వే షెడ్యూల్ను రూపొందించాం. హౌస్ లిస్టింగ్ షెడ్యూల్, సర్వే షెడ్యూల్, ఎన్ని మరేటర్లకు మార్గదర్శకాలు జారీ చేశాం. సర్వే ఫారం లో మొత్తం 57 ప్రశ్నలు ఉండగా అదనపు, ఉప ప్రశ్నలతో కలిపి మొత్తం 75 క్షేత్రస్థాయిలో సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ మరియు కుల అంశాలకు సంబంధించిన సమాచారం సేకరించబడిందన్నారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాను 150 కుటుంబాలతో కూడిన ఎన్యూమరేషన్ బ్లాక్‌గా విభజించి తద్వారా 94,261 బ్లాక్ లను ఏర్పాటు చేశారు

ప్రతి ఎన్యూమరేషన్ బ్లాక్‌కి ఎన్యూమరేటర్‌ను, ప్రతి పదిమంది ఎన్యూమరేటర్లను పర్యవేక్షించడానికి ఒక సూపర్వైజర్‌ను నియమించామన్నారు. తద్వారా రాష్ట్రవ్యాప్తంగా 1, 03, 889 ఎన్యుమరేటర్లు మరియు సూపర్వైజర్లను నియమించడం జరిగింది. 6 నవంబర్ 20 24న హౌస్ లిస్టింగ్ ప్రారంభమైంది

6 నవంబర్ నుంచి 8 నవంబర్ వరకు మూడు రోజులపాటు హౌస్ లిస్టింగ్. అసలైన సర్వే 9 నవంబర్ 24 నుంచి తెలంగాణ గవర్నర్ గారితో ప్రారంభమైంది. సర్వే మొత్తం 50 రోజుల్లో పూర్తయింది. సర్వే పూర్తయ్యే సమయానికి గ్రామీణ ప్రాంతంలో 66,99,62 నగర ప్రాంతంలో 45, 15, 532 కాగా మొత్తం సర్వే చేసిన కుటుంబాల సంఖ్య 1,12,15,1134 సర్వే నుంచి వచ్చిన ఫలితాలు రాష్ట్రంలో 3,54,77,554 మందిని సర్వే చేయడం జరిగింది.

ఎస్సీలలో 61,84,3119 ఉండగా ఇది మొత్తంలో 17.43 శాతం. బిసి(ముస్లిం మైనారిటీలు మినహా) 1,64,09,179 ఉండగా ఇది మొత్తంలో 46.25 శాతం. ముస్లిం మైనార్టీలలో మొత్తం 44,57,012 ఉండగా ఇది మొత్తంలో 12.56 శాతంగా ఉంది. ముస్లిం మైనారిటీలలో బీసీలుగా 35,76,588 ఉండగా ఇది మొత్తంలో 10.08 శాతంగా ఉంది. ముస్లిం మైనారిటీలలో ఓసీలు 8,80,424 ఉండగా ఇది మొత్తంలో 2.48 శాతంగా ఉంది. ముస్లిం మైనారిటీలు మినహా ఓసీలు 47, 21, 115 ఉండగా ఇది మొత్తంలో 13.31 శాతంగా ఉందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు.

# రీ సర్వే చేయాలి

## చట్టబద్ధత కల్పించాకే స్థానిక ఎన్నికలు

## అసెంబ్లీలో బిఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని



**హైదరాబాద్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కుల గణన సర్వేకు సంబంధించి ఫార్మెట్‌ను మార్చి రీసర్వే చేయాలని బిఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాసయాదవ్ డిమాండ్ చేశారు. ఈ సర్వే వివరాలపై పలు అనుమానాలు ఉన్నాయన్నారు. శాసనసభలో మంగళవారం ప్రవేశపెట్టిన కుల గణన సర్వే నివేదికపై జరిగిన చర్చలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సర్వే కోసం 56 అంశాలను పరిగణలోకి తీసుకున్నారని, అది సరికాదన్నారు. ఈ ప్రొఫార్మాలో పలు అంశాలు ఉండడంతో చాలా మంది సర్వేలో పాల్గొనలేదని చెప్పారు. హడావిడీగా కాకుండా ఈ అంశాలను తగ్గించి మళ్లీ ఫార్మెట్‌ను మార్చి రీ సర్వే చేయించాలని సూచించారు. ప్రభుత్వం కేవలం కుల గణన సర్వే నిర్వహించి అసెంబ్లీలో తీర్మానం చేస్తే సరిపోదన్నారు. ఈ సర్వే విషయంలో ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు చట్టబద్ధత కల్పించాలని స్పష్టం చేశారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా బీసీలు వెనకబడి ఉన్నారన్నారు. ఎన్నో దశాబ్దాలుగా బీసీలు తమ హక్కుల కోసం పోరాడుతూనే ఉన్నారని చెప్పారు. ప్రభుత్వం చేయించిన కులగణన సర్వేపై కొన్ని వర్గాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నా యని పేర్కొన్నారు. గడిచిన పదిహేనేళ్లలో బీసీల జనాభా పెరగలేదని సర్వేలో వెల్లడించడం సరికాదని తప్పుపట్టారు. 2011 జనాభా లెక్క ల ప్రకారం 3.54 కోట్ల మంది ఉన్నారని, 14 ఏళ్లలో 14 లక్షల జనాభానే పెరిగినట్లు చూపించడంలో వాస్తవం ఉందా అని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఏ కులం జనాభా ఎంత పెరిగిందో ప్రభుత్వం వెల్లడించాల్సిందేనన్నారు. దేశ, రాష్ట్రాభివృద్ధిలో వెనుకబడిన వర్గాలది కీలక పాత్ర అని తెలియచేశారు. ఎస్సీల జనాభా, ముస్లింల జనాభా తగ్గినట్లుగా ప్రభుత్వం నిర్వహించిన కుల గణన సర్వే చెప్తోందన్నారు. హైదరాబద్ నగరం పరిధిలో 30 శాతం మంది కూడా సర్వేలో పాల్గొనలేదని వెల్లడైనట్లు పేర్కొన్నారు. జీహెచ్ఎంసీలో చాలా మంది తమ వివరాలు చెప్పలేదని స్పష్టం చేశారు. సామాజిక, ఆర్థిక, రాజకీయంగా ఎదగాలని బీసీలు భావిస్తున్నా రని స్పష్టం చేశారు. జనాభా దామాషా మేరకు రాజకీయ న్యాయం జరగాలని బీసీ వర్గాలు భావిస్తున్నారన్నాయని చెప్పారు. కేవలం సర్వే చేయించి, ఆ నివేదికను అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించి చేతులు దులుపుకోవడం సరైనది కాదన్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు చట్టబద్ధత కల్పించాల్సిఉంచి కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించినట్లు బీసీ వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాల్సిందేనన్నారు. సర్వే ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాల్సిందేనని తేల్చిచెప్పారు.

# కులగణన ఉద్దేశం ఏమిటి?

## సిపిఐ ఎమ్మెల్యే కూనం నేని సాంబశివరావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:** కులగణనపై అసెంబ్లీలో చర్చ పెట్టి కేంద్రానికి పంపి చేతులు దులుపుకోవద్దని సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కులగణనపై అసెంబ్లీలో చర్చ సందర్భంగా మాట్లాడారు. కులగణన సర్వేపై అనేక అభ్యంతరాలు ఉన్నాయన్నారు. సర్వేను సభలో పెట్టారని, దీని ఉద్దేశ్యం ఏమిటో చెప్పాలన్నారు. మూడు లక్షల కుటుంబాలు సర్వేలు పాల్గొనలేదన్నారు. ఒకపనిచేస్తే విమర్శలు వస్తాయని, సమాచారం దాస్తే ఎవరికేం ఉపయోగం తనకు తెలియదన్నారు. ప్రభుత్వంపై విమర్శల కంటే సూచనలు చేస్తే ఉత్తమం అన్నారు. కులగణన లిస్టులను గ్రామాలలో ఉంచి మిగిలిన వారి పేర్లు నమోదు చేయాలన్నారు. రీ సర్వే చేయాలంటే ఎప్పటికీ అవ్వదన్నారు. 2014 సర్వేను ఈ సర్వేతో పోల్చకూడదన్నారు. ఒక్క రోజులో హడావుడిగా చేసిన సర్వేకు ఈ సర్వేకు చాలా తేడా ఉందన్నారు. సర్వేను సభలో ప్రవేశపెట్టారు. దీని ఉద్దేశ్యం ఏమిటన్నారు. బిసి రిజర్వేషన్లు పెంచుతారా? లేదా ? పెంచితే ఎంత పెంచుతారో చెప్పాలన్నారు. ఈ సర్వే కాగితాలకే పరమితం అవుతుందా అన్నారు. 50శాతం రిజర్వేషన్లు దాటొద్దని సుప్రించెప్పిందన్నారు. జడ్జిమెంట్‌కు లోబడే ప్రభుత్వం పనిచేస్తుందా అన్నారు. కామారెడ్డిలో 44శాతం పెంచుతామని హామి ఇచ్చారని, ఎంత పెంచినా ప్రాక్టికల్‌గా ఉండాలని, ఇక్కడ చర్చపెట్టి కేంద్రానికి పంపి చేతులు దులుపుకోవద్దన్నారు.

# హైడ్రా విషయంలో వెనక్కి తగ్గేది లేదు

## పేదల ఇళ్లు కూల్చుతామంటే ఊరుకోను

## ఇప్పటికే తనపై 173 కేసులు ఉన్నాయన్న దానం నాగేందర్

## పార్టీ మార్పునకు సంబంధించి నోటీసులు అందలేదన్న ఎమ్మెల్యే

**హైదరాబాద్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** నగరంలోని పేదల ఇళ్లను కూల్చివేస్తామంటే చూస్తూ ఊరుకునేది లేదని,అధికారుల విషయంలో వెనక్కి తగ్గేది లేదని ఖైరతా బాద్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత దానం నాగేందర్ అన్నారు. హైడ్రా అధికారుల విషయంలోనూ వెనక్కి తగ్గేదిలేదని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే తాను అధికారుల విషయంలో రాజీ పడలేదని అన్నారు. అవసరమైతే జైలుకు కూడా వెళ్తానని, ఇప్పటికే తనపై 173 కేసులు ఉన్నాయన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హైడ్రా ఆపరేషన్ విషయంలో దానం నాగేందర్ అసహనం వ్యక్తం చేశారు. ఆయన ఇంకా మాట్లాడుతూ, తన ఇంట్లో వైఎస్ రాజశేఖరరెడ్డి, కెసిఆర్ ఫొటోలు ఉన్నాయని, వారి ఫొటోలు ఉంటే తప్పేమిటని ప్రశ్నించారు. నాయకుల విషయంలో ఎవరి అభిప్రాయం వారికి ఉంటుందన్నారు.

ఱ పటాన్‌చెరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కెసిఆర్ ఫొటో ఉండ టంపై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు అసెంబ్లీ కార్యదర్శి నోటీసులు పంపించిన విషయాన్ని మీడియా ప్రతినిధులు ప్రస్తావించగా, ఇప్పటివరకు తనకు ఎలాంటి నోటీసులు రాలేదని ఆయన అన్నారు. నోటీసులు వచ్చాక స్పందిస్తానని తెలిపారు. 'పేదల ఇళ్లు కుల్చుతా అంటే ఊరుకోం. హైడ్రా విషయంలో కూడా వెనక్కి తగ్గేదిలేదు. నా ఇంట్లో వైఎస్సార్, కెసిఆర్ ఫొటో ఉంది. ఇంట్లో లీడర్ల ఫొటోలు ఉంటే తప్పేం టి? ఎవరి అభిమానం వాళ్లది' అంటూ దానం నాగేందర్ వ్యాఖ్యానించారు.

ఱఎలాంటి పబ్లిక్ నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలు చేస్తున్నారన్నారు. అధికారులు చేసే పనుల వల్ల ప్రజల మధ్య తాము తిరగలేకపోతున్నామని అన్నారు. పేదప్రజల జీవనాధారాన్ని అధికారులు ధ్వంసం చేస్తున్నా రంటూ ధ్వజమెత్తారు. ఆయన గతంలోనూ నగరంలో ఫుట్‌పాత్‌ల కూల్చివేతలపై అధికా రులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

# జనవరిలో ఎసిబి కేసుల సంఖ్య 19

## లంచం సొమ్ము రూ.1.45 లక్షలు,

## అక్రమ ఆస్తులు రూ.65.50 లక్షల జప్తు

**హైదరాబాద్, ఫిబ్రవరి, 4, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా ఈ యేడాది జనవరి నెలలో 19 ఎసిబి కేసులు నమోదయ్యాయి. ఇందులో పది కేసులు రెడ్ హ్యాండెడ్ ట్రాప్‌కు సంబంధించినవి కాగా ఒకటి ఆదాయానికి మించి ఆస్తులు కలిగినవి. మూడు కేసులు క్రిమినల్, అసభ్య ప్రవర్తన, మరో మూడు రెగ్యులర్ కేసులు, ఇంకో మూడు అక్రమాస్తులకు సంబంధించిన విచారణ కేసులు. ఈ సందర్భంగా ఆయా సర్కారీ విభాగాలకు చెందిన 14 మంది ఉద్యోగులు, ముగ్గురు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పట్టుబడగా, వీరివద్ద నుంచి లక్షా 45 వేల రూపాయల లంచం తాలూకు సొమ్మును జప్తు చేశారు. గిరిజన సంక్షేమ శాఖకు సంబంధించి ఒక అధికారి వద్ద 65 లక్షల 50 వేల అక్రమాస్తులు పట్టుబడ్డాయి. కాగా సర్కారీ విభాగాల్లో అవినీతి గురించి ఎవరి వద్ద ఎలాంటి సమాచారం ఉన్నా 1064 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ఎసిబి డిజి విజయ్‌కుమార్ తెలిపారు. దీంతోపాటు ఎసిబి విభాగా నికి సంబంధించి ఫేస్‌బుక్, ట్విటర్‌లోనూ ఫిర్యాదు చేయవచ్చన్నారు.

# నిజాం నిరంకుశత్వంపై పోరాడిన మగ్దూం మొయినుద్దీన్

## 117వ జయంతి వేడుకల్లో కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** ఆనాటి నిజాం నవాబు నిరంకుశత్వంపై మగ్ధూం మొయినుద్దీన్ రాజీలేని పోరాటం చేశారని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆయన నిర్మాణ దక్షకుడు, ఏఐటీయూసీ ఆనాటి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీగా మూడు నాలుగు పర్యాయాలు పనిచేశారని గుర్తు చేశారు. మగ్ధూం మొయినుద్దీన్ 117వ జయంతి సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయం మగ్ధూం భవన్‌లో కూనంనేని సాంబశివరావు మొయినుద్దీన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ మొయినుద్దీన్ ఉన్నతమైన చదువులు చదివి గొప్ప కవిగా పేరుగాంచారని అన్నారు. నిజాం దుందుడుకు చర్యలు, దమనకాండకు వ్యతిరేకంగా పోరాటం చేశారని గుర్తు చేశారు. ముస్లింలంతా నిజాం ప్రభువు తాబేదారులనే చర్చ జరుగుతుంటే షేక్ బందగి, షోయబుల్లాఖాన్, మొయినుద్దీన్ వంటి అనేకమంది న్యాయం కోసం మతం, కులాన్ని పక్కనపెట్టి నిజాం ప్రభువుకు వ్యతిరేకంగా, ప్రజల బాధలే లక్ష్యంగా అనేక పోరాటాలు నిర్వహించారని తెలిపారు. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్రం వస్తే 1947 సెప్టెంబర్ 11న నిజాం నవాబు స్వతంత్ర రాజ్యాంగ ప్రకటించుకున్నాడని కూనంనేని గుర్తు చేశారు. 1945 నుండి కమ్యూనిస్టులు పోరాటం చేసి సాధించిన భూములను పటేల్ సైన్యం కుమ్మక్కై భూములను లాక్కునే ప్రయత్నం చేయగా.. పటేల్ సైన్యం కమ్యూనిస్టులపై చేస్తున్న దాడులను తిప్పి కొట్టడానికి సాయుధ పోరాటమే శరణ్యమని 1947 సెప్టెంబర్ 11న ఆంధ్ర మహాసభ అధ్యక్షులు రావి నారాయణరెడ్డి, భారత కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ ప్రాంత కార్యదర్శి బద్దం ఎల్లారెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మగ్దం మొయినుద్దీన్‌లు ముగ్గురు సాయుధ పోరాటానికి పిలిపివ్వడం జరిగిందన్నారు.

# శాసనమండలి నుంచి బిఆర్ఎస్ వాకౌట్

## బిసి రిజర్వేషన్ల పెంపుపై ప్రభుత్వం స్పష్టత

## ఇవ్వాలి: ఎమ్మెల్సీ కవిత డిమాండ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే నివేదికపై ప్రతిపక్ష బీఆర్ఎస్ శాసనమండలి నుంచి వాకౌట్ చేసింది. శాసనమండలిలో ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేపై ప్రభుత్వం ప్రకటన చేసింది. అయితే ఈ నివేదికపై ప్రకటన కాకుండా చర్చకు అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ పట్టుపట్టింది. ప్రభుత్వం ప్రకటన జారీ చేస్తే దానిపై చర్చ ఉండదని.. కేవలం అనుమానాల నివృత్తి(క్లారిఫికేషన్స్) మాత్రమే ఉంటుందని మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రకటనపై క్లారిఫికేషన్లు ఉంటే అడగాలని ఛైర్మన్ సూచించారు. ప్రతిపక్ష నేత మధుసూదనాచారి మాట్లాడుతూ ప్రభుత్వం సమగ్ర కులగణన సర్వేపై కొండను తవ్వి ఎలుకను పట్టిందన్నారు. గతంలో బీఆర్ఎస్ చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే లెక్కలకి.. ఇప్పటి లెక్కలకి బీసీ జనాభా తగ్గిందనే అభిప్రాయం వ్యక్తం అవుతుందని అన్నారు. అందుకు మంత్రులు కలుగజేసుకొని గతంలో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహిస్తే వాటి వివరాలను గత బీఆర్ఎస్ ఎందుకు ప్రకటించలేదని.. ఎక్కడ దాచిపెట్టిందని ప్రశ్నించారు. వారు అప్పటి లెక్కలను బహిర్గతం చేసి ఉంటే.. ఇప్పటి లెక్కలతో పోల్చి చూసేవారమని ఉప ముఖ్యమంత్రి భట్టి సమాధానమిచ్చారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ల పెంపుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. కులగణన విషయంలో తదుపరి కార్యాచరణను ప్రభుత్వం ప్రకటిస్తుందని భావించామని.. కానీ రెండు రోజుల క్రితం కేబినెట్ సబ్ కమిటీ ఛైర్మన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి విలేకరుల సమావేశంలో చెప్పిన విషయాలనే.. ప్రకటన రూపంలో శాసనమండలిలో చెప్పడం ద్వారా ఉపయోగమేమిటో ప్రభుత్వం చెప్పాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం బీసీలకు రిజర్వేషన్లను పెంచిన తర్వాత ఎన్నికలు నిర్వహిస్తారా? లేదా? అన్నది ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. బీసీలను, బీసీ ముస్లింల జనాభాను వేరు చేసి ప్రభుత్వం చెబుతుందని, ఇది కేవలం జనాభాను తక్కువ చేసి చూపించాలన్న ఉద్దేశంతోనే చేస్తున్నారని అనుమానాలు కలుగుతున్నాయన్నారు. ప్రభుత్వం ఒక నిర్దిష్టమైన కార్యాచరణను ప్రకటించాలన్నారు. ఇంతవరకు ఖచ్చితమైన డేటానే లేదని ప్రభుత్వం చెప్పడం సరికాదని.. 2011 జనాభా లెక్కలు అందుబాటులో ఉన్నాయ న్నారు. అంతర్జాతీయంగా, జాతీయంగా 10 సంవత్సరాలలో సగటున 13.5 శాతం జనాభా పెరుగుతుందన్నది అంచనా అని.. ఆ లెక్కన ఇప్పుడు తెలంగాణ జనాభా 4 కోట్ల 18 లక్షలు ఉండాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన సర్వేలో ఎస్సీ, ఎస్టీ, బీసీల జనాభా తగ్గినట్లు కేవలం ఓసీల జనాభానే పెరిగినట్టు కనిపిస్తుందన్నారు. అన్ని వర్గాల జనాభా తగ్గి కేవలం ఒక వర్గం జనాభా ఎలా పెరుగుతుందని ప్రశ్నించారు. ప్రభుత్వం చర్చకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ సమయంలో ఛైర్మన్ చర్చకు అంగీకరించక పోవడంతో.. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ వెల్‌లోకి వచ్చి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తాము సమగ్ర కుల గణన సర్వే నివేదికను వ్యతిరేకిస్తున్నామని.. అందుకు నిరసనగా వాకౌట్‌చేస్తున్నట్టు ప్రకటించి సభ నుంచి బయటికి వెళ్లిపోయారు.

# బిసిలకు అన్యాయం చేస్తే మరో ఉద్యమం తప్పదు



మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తదితరులు

## మాజీమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** బీసీలకు ప్రభుత్వం అన్యాయం చేస్తే బీసీల ఐక్యంతో మరో అతిపెద్ద ఉద్యమం వస్తుందని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని అన్నారు. తెలంగాణ ఉద్యమం కన్నా తీవ్రంగా ఈ ఉద్యమం ఉండబోతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తుందో ప్రజలు గమనిస్తున్నారని, బీసీల కోసం మరో ఉద్యమం రాబోతోందన్నారు. 1947 స్వతంత్ర ఉద్యమం, 1969 తెలంగాణ ఉద్యమం మనం చూడలేదని, కేసీఆర్ నడిపిన తెలంగాణ ఉద్యమం చూశామని, కానీ ఇప్పుడు బీసీలకు అన్యాయం జరిగితే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. శాసనసభ రూల్స్, ప్రొసిజర్స్ తుంగలో తొక్కారని, తెలంగాణ సమాజం న్యాయం కోసం, కామారెడ్డి డిక్లరేషన్ యథాతథంగా అమలు చేయడం కోసం తెలంగాణ సమాజం ఎదురుచూస్తుందన్నారు. స్పీకర్ శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు అడిగిన వెంటనే సభ వాయిదా వేయడం ఖండిస్తున్నామన్నారు. స్పీకర్ సభను వాయిదా వేసే ముందు మమ్మల్ని అడగరా అని ప్రశ్నించారు. ప్రాధాన్యత గల అంశాలపై నాలుగు రోజులు చర్చ లేకుండా ఒక్క రోజులో ముగించడం ఏమిటన్నారు. నేను ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఉన్నానని, ఇంత బాధ్యతా రహి తంగా, అన్యాయంగా, కుట్ర పూరితంగా వ్యవహరించడం ఎప్పుడు చూడలేదన్నారు. సర్వేలో అనుమానాలు ఉన్నాయని, అవి నివృత్తి కావాలన్నారు. కుల గణన తప్పు అని మేము అంటున్నామని, కరెక్టు అని నిరూపించుకోవాలన్నారు. ఉదయం 11 గంటలకు అసెంబ్లీ అని పిలిచి నిమిషం కూడా నడపక ముందు వాయిదా వేయడం అంటే అవ మానించినట్లే అన్నారు.

### ఒక్క మాట మాట్లాడకుంటా వాయిదా : వేముల ప్రశాంత్‌రెడ్డి

అసెంబ్లీ ప్రారంభం కాగానే ఒక్క మాట కూడా మాట్లాడకుండానే వాయి దా వేశారని, శాసన సభ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా చేశారని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఉమ్మడి ఏపీ చరిత్రలో కూడా ఇలా జరగలేదని, సభలో ఒక్క మాట కూడా చెప్పకుండా వాయిదా వేశారన్నారు. ఒక్క మంత్రి కూడా శాసన సభలో లేరని, ఇది శాసనసభను అవమాన పరచడం కాదా అన్నారు.

### కాంగ్రెస్ బిసిలకు ఇచ్చే గౌరవం ఇదేనా?: గంగుల కమలాకర్

కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చే గౌరవం ఇదేనా ? బీసీ గణనపై చర్చ అని అసెంబ్లీకి 11 గంటలకు పిలిచి వాయిదా ఎందుకు వేశారని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రశ్నించారు. బీసీలను రమ్మని సభ వాయిదా వేశారని, ఇదా మీరు బీసీలకు ఇచ్చే గౌరవమన్నారు. కేబినెట్ చర్చ లేకుండా, అప్రూవల్ లేకుండా ఇదేం పద్ధతని, ఏం చేసే ఉద్దేశ్యంతో మీరు ఇలా చేస్తున్నారని మండిపడ్డారు.



### బిసిలపై బిఆర్ఎస్ మొసలి కన్నీరు: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

బిసిలపై బీఆర్ఎస్‌మొసలి కన్నీరు కారుస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. గతంలో ఒక్కరోజు సర్వే చేసి నివేదిక బయట పెట్టని ఈ పార్టీ ఈరోజు బీసీ కుల గణనపై మాట్లాడుతుందన్నారు. స్పీకర్ అనుమతితో సభ వాయిదా పడిందన్నారు. స్థానిక సంస్థల్లో 34శాతం ఉన్న బీసీల రిజర్వేషన్లు 29శాతానికి తగ్గించిన ఘనత బీఆర్ఎస్ పార్టీ దన్నా రు. ఆ రోజు బీసీలపై మీకున్న చిత్తశుద్ధి ఏ మైందనిప్రశ్నించారు.

### దేశ చరిత్రలో గుర్తు ఉండిపోయే రోజు : బీర్ల ఐలయ్య

50 రోజుల్లో కులగణన దేశచరిత్రలో ఎన్నడూ జరగలేదని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. గంగుల కమలాకర్‌కు బీసీ కుల గణనపై మాట్లాడే హక్కు లేదని, మీరు గతంలో చేసిన సమగ్ర కుటుంబ సర్వే లెక్కలు ఫాంహౌస్‌లో దాచి పెట్టారని విమర్శించారు.

### తెలంగాణ రోల్ మోడల్: ప్రభుత్వ విప్ రాంచంద్రానాయక్

దేశ చరిత్రలో తెలంగాణ ఒక రోల్ మోడల్, కేవలం 50 రోజుల్లో కుల గణన పూర్తి చేశామని ప్రభుత్వ విప్ రాంచంద్రానాయక్ అన్నారు. సభాపతి అందరికీ మాట్లాడే అవకాశం ఇస్తామని అన్న కూడా రాజకీయ అవివేకంతో బీఆర్ఎస్ నేతలు ఇలా మాట్లాడుతున్నారన్నారు.

## మీడియా పాయింట్

దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ఇంటి దగ్గర తయారు చేసిన స్క్రిప్ట్ మీలాగా మేము చదవడం లేదని దేవరకద్ర ఎమ్మెల్యే చధుసూదన్ రెడ్డి అన్నారు. ఫాం హౌస్‌లో నలుగురు కూర్చొని బిల్లులు అసెంబ్లీలో పెట్టే సాంప్రదాయం మాది కాదన్నారు. ఇప్పుడు అంతా ప్రజాస్వామ్య బద్ధంగా జరుగుతుందని, ఇది హరీశ్‌రావు గుర్తించాలన్నారు.

### ప్రభుత్వ తీరు బాగాలేదు: ఎమ్మెల్యే పాయల్ శంకర్

శాసనసభలో ఈ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు బాగాలేదని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. బిజెపి ఎమ్మెల్యేలు కాటేపల్లి వెంకటరమణారెడ్డి, రాకేష్ రెడ్డి, రామారావు పవార్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ మేము హుటాహుటిన నియోజకవర్గం నుండి వస్తే సభ ప్రారంభించిన వెంటనే వాయిదా వేయడం బాధాకరన్నారు. వారికి సమస్యల పై చర్చించే ఆలోచన లేనట్లు ఉందని, కేబినెట్ మీటింగ్ కూడా ఒకే రోజు పెట్టాల్సిన అవసరం ఏముందన్నారు. మేము ప్రజా సమస్యలపై మాట్లాడితే ప్రజాసమయం దుర్వినియోగం అంటారని, మరి ఈ రోజు వారు చేసిందేమిటని ప్రశ్నించారు.





ప్రజావాణిలో దరఖాస్తుదారుల సమస్యలు వింటున్న డా.జి.చిన్నారెడ్డి

# ప్రజావాణికి అందిన దరఖాస్తులు 7,142

**హైదరాబాద్ (బేగంపేట) ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 7,142 దరఖాస్తులు అందాయి. ఇందులో అధిక శాతం ఇందిరమ్మ ఇళ్ల కోసం 4,860 దరఖాస్తులు వచ్చాయి. పౌర సరఫరాల శాఖకు సంబంధించి 1,861, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 175, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 46 దరఖాస్తులు, ప్రవాసీ ప్రజావాణికి ఒక దరఖాస్తు అందినట్లు అధికారులు తెలియజేసారు. ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

## ఐసిసి టీమ్ ఆఫ్ ది టోర్నీలో నలుగురు

# భారత్ అమ్మాయిలకు చోటు




**న్యూఢిల్లీ:** అండర్-19 మహిళల టీ20 ప్రపంచ కప్‌ను వరుసగా రెండోసారి సాధించిన భారత జట్టులోని పలువురు ప్లేయర్లకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) టీమ్‌లో చోటు దక్కింది. ఈ నెల 2వ తేదీన మలేసియాలో జరిగిన అండర్ టీ20 వరల్డ్ కప్ టైటిల్ పోరులో నికీ ప్రసాద్ నేతృత్వంలోని భారత అమ్మాయిల జట్టు తొమ్మిది వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాపై జయభేరిమోగించిన సంగతి తెలిసిందే. ఈ టోర్నీ ఆసాంతం విశేషంగా రాణించిన తెలంగాణ స్టార్ ఓపెనర్ గొంగడి త్రిష సహా మొత్తం నలుగురు భారత క్రికెటర్లకు ఐసీసీ టీమ్ ఆఫ్ ద టోర్నమెంట్‌లో స్థానం లభించింది. త్రిష ఓపెనింగ్ భాగస్వామి కమలిని, లెఫ్టార్మ్ స్పిన్ ద్వయం వైష్ణవి శర్మ, ఆయుశి శుక్లాలు కూడా ఐసీసీ ఎంపిక చేసిన జట్టులో ఉన్నారు. హార్డ్ హిట్టర్ త్రిష ఈ టోర్నీ చరిత్రలోనే తొలి సెంచరీతో సహా 309 పరుగులు చేసింది. లెగ్‌స్పిన్‌తో 7 వికెట్లను కూడా పడగొట్టింది. ఆమెతో జోడీగా దిగిన కమలిని 143 పరుగులు చేసింది. ఇంగ్లండ్‌తో జరిగిన సెమీఫైనల్లో కమలిని (50 బంతుల్లో 56 నాటౌట్) అజేయ అర్ధ సెంచరీతో ఆకట్టుకుంది. భారత స్పిన్నర్లలో ఆయుశి 14 వికెట్లను చేజిక్కించుకోగా, వైష్ణవి 17 వికెట్లతో టోర్నీలోనే అగ్రస్థానంలో ఉంది. మలేసియా పై హ్యాట్రిక్‌తో ఆమె (5/5) అత్యుత్తమ గణాంకాలు నమోదు చేసింది. ఇక ఈ ఐసీసీ టీమ్ ఆఫ్ ద టోర్నీలో స్థానం దక్కిన వారిలో కైలా రేనెకె (కెప్టెన్, దక్షిణాఫ్రికా), జెమ్మా బోతా (దక్షిణాఫ్రికా), త్రిష, కమలిని, ఆయుశి శుక్లా, వైష్ణవి శర్మ (భారత్), దేవినా పెరిన్, కేటీ జోన్స్ (ఇంగ్లండ్), కావోంహెబ్రే (ఆస్ట్రేలియా), చమొది ప్రబొద (శ్రీలంక), పూజ మహతో (నేపాల్), 12వ ప్లేయర్‌గా ఎన్‌తబిసెంగ్ నిని (దక్షిణాఫ్రికా) ఉన్నారు.

# నేషనల్ గేమ్స్‌లో.. తెలంగాణ షూటర్ సురభికి కాంస్యం



**న్యూఢిల్లీ:** నేషనల్ గేమ్స్‌లో తెలంగాణకు రెండో పతకం లభించింది. షూటర్ సురభి భరద్వాజ్ కాంస్య పతకం గెలిచింది. భోపాల్ వేదికగా జరిగిన విమెన్స్ 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ ఈవెంట్‌లో సురభి 488.8 స్కోరుతో మూడో స్థానంలో నిలిచి పతకం అందుకుంది. ఇండియా స్టార్ షూటర్, పంజాబ్‌కు చెందిన సిఫ్ట్ కౌర్ సమ్రా 461.2 స్కోరుతో గోల్డ్ అందుకుంది. అదే రాష్ట్రానికి చెందిన సీనియర్ షూటర్ అంజుమ్ మోద్గిల్ 458.7 స్కోరుతో సిల్వర్ గెలిచింది. మరో గేమ్‌లో మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రి పొజిషన్‌లో సురభి 425.9 పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచి నిరాశ పరిచింది. ఈ విభాగంలో ప్రియ (461.4), విదర్శ (461.1), మాణిని (448.6) పతకాలు కైవసం చేసుకున్నారు. మరోవైపు బాస్కెట్ బాల్ 3+3 మహిళల విభాగంలో తెలంగాణ విమెన్స్ టీమ్ ఫైనల్ చేరుకొని పతకం ఖాయం చేసుకుంది. ఇక మెన్స్ బాస్కెట్‌బాల్ టీమ్ కాంస్య పతక పోరుకు అర్హత సాధించింది.

## మరో లీగ్‌లోకి ఐపిఎల్ ఫ్రాంచైజీ ఎంట్రీ

### రూ.1,251.11 కోట్లతో కొత్త జట్టు కొనుగోలు

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ టీమ్ లక్నో సూపర్ జెయింట్స్ క్రికెట్ అభిమానులను అలరించేందుకు మరో లీగ్ లోకి అడుగుపెట్టింది. ది హండ్రెడ్ లీగ్ లోకి ఎంట్రీ ఇచ్చింది. తాజాగా ఈ లీగ్ కు చెందిన మాంచెస్టర్ ఒరిజినల్స్ టీమ్ వేలానికి రాగా, లీలీబి యాజమాన్యం ఆ జట్టును కళ్లు చెదిరే ధర పెట్టి దక్కించుకుంది. టీమ్ మొత్తం విలువలోని 49 శాతం వాటాను ఊహించని విధంగా భారీ ధరతో బిడ్డింగ్



వేసి గెలుపొందింది. అంతకుముందు హండ్రెడ్ లీగ్ లోని లండన్ స్పిరిట్ జట్టు కోసం బిడ్ వేసి విఫలమైన లక్నో సూపర్ జైంట్స్ యాజమాన్యం, ఇప్పుడు మాంచెస్టర్ ఒరిజినల్స్‌ను బిడ్డింగ్ వేసి సొంతం చేసుకుంది. దాదాపు 116 మిలియన్ పౌండ్ల (దాదాపు రూ.1,251 కోట్లు) భారీ ధరకు మాంచెస్టర్ ఒరిజినల్స్ జట్టును లక్నో యాజమాన్యం అయిన సంజీవ్ గోయెంకా ఆర్‌పిఎస్‌జి గ్రూప్ కొనుగోలు చేసింది. తమతో లక్నో జత కట్టడంపై మాంచెస్టర్ కు చెందిన లంకషైర్ యాజమాన్యం సంతోషం వ్యక్తం చేసింది. తాజాగా ది హండ్రెడ్ లీగ్ లోకి ఐపీఎల్ స్టార్ టీమ్ ముంబయి ఇండియన్స్ కూడా అడుగుపెట్టింది. ఈ లీగ్ కు చెందిన ఓవల్ ఇన్విన్సిబుల్స్ జట్టును భారీ ధరకు ముంబయి యాజమాన్యం కొనుగోలు చేసింది. దీంతో ది హండ్రెడ్ లీగ్ లోకి అడుగుపెట్టిన రెండో ఐపీఎల్ టీమ్ గా లక్నో జెయింట్స్ నిలిచింది. గతంలో 2016-17 సమయంలో ఐపీఎల్ లో రైజింగ్ పుణె జెయింట్స్ ను కొనుగోలు చేసిన సంజీవ్ గోయెంకా గ్రూప్ 2021లో లక్నో జట్టును రూ.7,090 కోట్లకు కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. అలానే సన్ రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యం అయిన సన్ గ్రూప్ కూడా హండ్రెడ్ లీగ్ లోని నార్తరన్ సూపర్ ఛార్జర్స్, ట్రెంట్ రాకెట్స్‌ను కొనుగోలు చేయాలని ఆసక్తిగా చూపిస్తున్నట్లు సమాచారం. వీటితో పాటు, ఢిల్లీ క్యాపిటల్స్ కో ఓనర్స్ అయిన జీఎమ్ఆర్ గ్రూప్ సౌత్‌రాన్ బ్రేవ్ లో వాటాను సొంతం చేసుకోవాలని ఆశిస్తోంది.



## భారత్‌లో తొలిసారి బాక్సింగ్ ప్రీమియర్ లీగ్

### వచ్చే నెలలో 6 ప్రధాన నగరాల్లో పోటీలు

**న్యూఢిల్లీ:** భారత బాక్సింగ్ అభిమానులను ఆకట్టుకునేందుకు మరో కొత్త లీగ్ ప్రారంభం కాబోతోంది. ఇటీవల దేశంలో తొలిసారి ఖో ఖో వరల్డ్ కప్ పోటీలు నిర్వహించిన భారత్ ఇప్పుడు బాక్సింగ్‌లో ఇండియన్ ప్రీమియర్ లీగ్‌ను ప్రారంభించబోతోంది. ఇందులో భాగంగా ప్రముఖ బాక్సింగ్ లీగ్‌గా పేరొందిన అంథోనీ పెట్టిస్ ఫైటింగ్ చాంపియన్‌షిప్ (ఏపీఎఫ్‌సీ), ఇండియన్ ప్రొ బాక్సింగ్ లీగ్ (ఐపీబీఎల్) భారత్‌లో తొలిసారి బాక్సింగ్ పోటీలు నిర్వహించబోతున్నాయి. వచ్చే నెలలో దేశంలోని ఆరు ప్రధాన నగరాలు ఢిల్లీ, హైదరాబాద్, జైపూర్, ముంబై, గోవా, బెంగుళూరు వేదికలుగా ఈ బాక్సింగ్ పోటీలను నిర్వ హించనున్నాయి. ఇందుకోసం యూఎఫ్‌సీ లైట్‌వెయిట్ మాజీ చాం పియన్ అంథోనీ పెట్టిస్ తొలిసారి భారత్‌కు రాబోతున్నాడు.

డబ్ల్యూ బీసీ, ఇండియా ఛాంపియన్ సబరి జైశంకర్, సెర్గియో పెట్టిస్ మధ్య ప్రధాన పోరు జరుగుతుందని ఇండియన్ ప్రో బాక్సింగ్ లీగ్ మంగళవారం ఒక అధికారిక ప్రకటనలో పేర్కొంది. ఇప్పటికే పలు ప్రపంచ బాక్సింగ్ కౌన్సిల్ (డబ్ల్యూ బీసీ) టైటిళ్లు సొంతం చేసుకున్న సబరి, సెర్గియో మధ్య పోరు రసవత్తరంగా సాగే అవకాశముంది.

# తొలి వన్డేలో డేంజరస్ ప్లేయర్స్

## పవర్ ఫుల్ ప్లేయింగ్ 11

### రేపు ఇంగ్లండ్‌తో రోహిత్ సేన ఢీ


**న్యూఢిల్లీ;** భారత్ వర్సెస్ ఇంగ్లాండ్ మధ్య మూడు వన్డే మ్యాచ్‌ల సిరీస్ ఈ నెల 6న ప్రారంభం కానుంది. టీ20 సిరీస్ లో భారత జట్టు 41తో విజయం సాధించిన నేపథ్యంలో, వన్డే సిరీస్‌పై అంచనాలు పెరిగాయి. రోహిత్ శర్మ నాయకత్వంలోని భారత జట్టు, ఇంగ్లాండ్‌ను ఓడించడానికి పవర్ ఫుల్ ప్లేయింగ్ ఎలెవెన్‌తో సిద్ధమవుతోంది. తొలి వన్డేలో టీమిండియా ప్లేయింగ్ 11లో డేంజరస్ ఆటగాళ్లతో రోహిత్ రంగంలోకి దిగుతున్నాడు. భారత్, ఇంగ్లండ్ మధ్య ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ముగిసింది. టీం ఇండియా పూణేలో విజయంతో సిరీస్‌ను కైవసం చేసుకుంది. కానీ, ముంబైలో కూడా ఎటువంటి రాయిని వదిలిపెట్టలేదు. ఐద వ, చివరి మ్యాచ్‌లో ఇంగ్లండ్‌ను 150 పరుగుల తేడాతో ఓడించి 4-1తో సిరీస్‌ను గెలుచుకుంది. భారత జట్టు మొదట బ్యాటింగ్‌లో ఇంగ్లండ్‌పై తన అత్యధిక టీ20ఐ స్కోరును చేసింది. తరువాత బౌలింగ్‌లో అద్భుతాలు చేసింది. ఇంగ్లండ్ జట్టును కేవలం 97 పరుగులకే ఆలౌట్ చేసింది. వాంఖడే స్టేడియం పిచ్ బ్యాటింగ్‌కు చాలా బాగుంది. కానీ, ఇంగ్లండ్ జట్టు విఫలమైంది. వన్డే సిరీస్‌లో భారత్, ఇంగ్లండ్ మరోసారి ఢీ కొట్టనుంది. టీ20 సిరీస్ ముగిసిన తర్వాత, ఇప్పుడు వన్డే ఫార్మాట్‌లో భారత్ ఇంగ్లండ్ మధ్య అభిమానులు ఉత్కంఠను చూసే అవకాశం మళ్లీ వచ్చింది. ఈ రెండు జట్ల మధ్య 3 వన్డే మ్యాచ్‌లు జరగాల్సి ఉంది. ఈ నెల 6 నుంచి సిరీస్ ప్రారంభం కానుంది. ఇందుకోసం, టీ20 సిరీస్‌లో భాగం కాని భారత జట్టులోని కొంతమంది ఆటగాళ్లు మొదటి వన్డే ఆడాల్సిన నాగ్‌పూర్‌కు చేరుకున్నారు. భారత్-ఇంగ్లండ్ మధ్య రెండో వన్డే ఈ నెల 9న కటక్‌లో జరగనుండగా, సిరీస్‌లోని మూడో, చివరి వన్డే ఈ నెల 12న అహ్మదాబాద్‌లో జరగనుంది. ఈ మ్యాచ్‌లన్నీ భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 1:30 గంటలకు ప్రారంభమవుతాయి. టాస్ అరగంట ముందుగా అంటే మధ్యాహ్నం 1 గంటలకు జరుగుతుంది. ఈ సిరీస్ కోసం




టీమిండియా ప్లేయర్లను ఇప్పటికే భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు ప్రకటించింది. ఇందులో చాలా మంది కీలక ఆటగాళ్లు తమ తమ బ్యాటక్లకు పదును పెడుతున్నారు. ఇంగ్లండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో భాగమైన కొంతమంది ఆటగాళ్లు ఈ ఇప్పుడు వన్డే జట్టులో కూడా కనిపించనున్నారు. ఇక ఈ వన్డే సిరీస్‌కు టీమిండియా ప్రాబబుల్ ప్లేయింగ్ 11లో రోహిత్ శర్మ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్, రిషబ్ పంత్ (వికెట్ కీపర్), హార్దిక్ పాండ్యా, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, అర్షదీప్ సింగ్, మహ్మద్ షమీ.

# ఐదు రోజులూ ఆఫీసుకు రావాల్సిందే: డెల్

**ముంబై, ఫిబ్రవరి 4:** టెక్ కంపెనీలన్నీ వర్క్ ఫ్రమ్ హోమ్ విధానానికి స్వస్తి పలుకు తున్నాయి. ఇప్పటికే చాలా సంస్థలు తమ ఉద్యోగులంతా ఆఫీసుకు రావాలని అల్టిమే టం జారీచేశాయి. తాజాగా ప్రముఖ కంప్యూటర్ల తయారీ సంస్థ డెల్ కూడా హైబ్రిడ్, రిమోట్ వర్క్ పాలసీకి స్వస్తి చెబుతున్నట్లు పేర్కొంది. ఈ విషయాన్ని కంపెనీ సిఇఒ మైఖేల్ డెల్ ఇ-మెయిల్ ద్వారా ఉద్యోగులకు సమాచారం అందచేసినట్లు కొన్ని కథనాలు వెలువడు తున్నాయి. డెల్ కార్యాలయాల దగ్గర నివసించే ఉద్యోగులు ఇకపై హైబ్రిడ్, రిమోట్ వర్క్ విధానంలో పని చేయడానికి వీలుండ దని మైఖేల్ డెల్ ఉద్యోగులకు పంపిన ఇ-మెయిల్‌లో తెలిపారు. వారంలో ఐదు రోజులు తప్పని సరిగా ఆఫీస్ నుంచి పని చేయాలని తెలియ చేశారు. మార్చి 3 నుంచే ఈ నిబంధనలు అమల్లోకి వస్తాయని అందులో స్పష్టంగా పేర్కొన్నారు. అయితే కార్యాలయం సమీపంలో నివసిస్తున్న ఉద్యోగులకు మాత్రమే ఈ నిబంధనలు వర్తిస్తాయని తెలుస్తోంది. సుదూర ప్రాంతాల్లో నివసించే ఉద్యోగులు రిమోట్‌గా పని చేసేందుకు సీనియర్ లీడర్ల నుంచి తగ్గిన కారణాలు చూపించి తప్పనిసరిగా అనుమతి పొందాల్సి ఉంటుంది. లేదంటే వారెవరికీ పదోన్నతులు ఉండవని తెలుస్తోంది. భవిష్యత్తులో నియమించు కొనే వారికి ఇకపై రిమోట్ విధానం ఉండదని అందులో పేర్కొంది. కరోనాకు ముందు నుంచే డెల్‌లో వర్క్ ఫ్రమ్ హోమ్ విధానం అమల్లో ఉండేది. కంపెనీ వ్యవస్థాపకుడు, సిఇఒ మైఖేల్ డెల్ ఖూడా దీన్ని ప్రోత్సహించే వారు. పైగా ఆఫీసుకు రావాలని ఆదేశిస్తున్న కంపెనీలను ఆయన తప్పుబట్టారు. కానీ తాజాగా డెల్ విధానాల్లో సమూల మార్పులు వచ్చాయి. అందరూ కలిసి పనిచేయడం, తమ ఆలోచనలను పంచుకోవడం సంస్థ వృద్ధికి దోహదం చేస్తుందని కంపెనీ భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే ప్రతి ఒక్కరూ ఆఫీసుకు రావాలని కోరుతోంది.




## బిఎస్ఇ టర్నోవర్ రూ.425 లక్షల కోట్లు

**ముంబై, ఫిబ్రవరి 4:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ లాభాల్లో ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతా లతో మన సూచీలు రాణించాయి. కెనడా, మెక్సికో దేశాలపై విధించిన టారిఫ్‌లను తాత్కాలికంగా నిలిపి వేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో మార్కెట్లలో పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది. వాణిజ్య యుద్ధ భయాలు రేపిన ట్రంప్ నుంచి సానుకూల నిర్ణయం వెలువడడంతో ఆసియాతో పాటు మన మార్కెట్లు సూచీల భారీ లాభాలకు కారణ మైంది. చివరికి సెన్సెక్స్ 1226.94 పాయింట్లలాభంతో 78,413.68 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 378.20 పాయింట్లు పెరిగి 23,739.25 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.87.07గా కొనసాగుతోంది. రూ.5.5 లక్షల కోట్లు ఇన్వెస్టర్ల సంపద పెరిగి రూ.425 లక్షల కోట్లకు చేరింది. ఎల్అండ్‌టి, ఇండస్ ఇండ్ బ్యాంకు, అదానీ పోర్ట్స్, టాటా మోటార్స్, రిల యన్స్ వంటి షేర్లు ప్రధానంగా లాభపడగా, ఐటిసి హోటల్స్, జొమాటో, నెస్లే ఇండియా, హిందుస్థాన్ యూనిలీవర్, మారుతి వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి. మెక్సికో, కెనడాపై సుంకాల విషయంలో ట్రంప్ తన నిర్ణయాన్ని వాయిదా వేయడం సూచీల లాభాల కు కారణమైంది. దీంతో ఆసియా మార్కెట్లతో పాటు మన మార్కెట్లూ లాభపడ్డాయి. రేట్లకోతపై ఆర్‌బిఐ నుంచి సానుకూల సంకేతం వస్తుందన్న అంచనాలతో బ్యాంకింగ్, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు కూడా సూచీల ర్యాలీకి కారణమని మార్కెట్ నిపుణులు చెబుతున్నా రు. జనవరిలో కార్ల విక్రయాలు స్థిరమైన వృద్ధిని నమోదు చేయడంతో ముున్ముందు ఆటోమొబైల్ రంగానికి డిమాండ్ ఉంటుందన్న అంచనాలతో ఆయా కంపెనీల షేర్లు రాణిం చాయి. ఇటీవల మార్కెట్ పతనాన్ని ఇన్వెస్టర్లు అవకాశంగా తీసుకుని కొనుగోళ్లకు దిగడం మరో కారణమని నిపుణులు విశ్లేషి స్తున్నారు.



## డాక్టర్ అగర్వాల్ హెల్త్‌కేర్ డీలా

**ముంబై, ఫిబ్రవరి 4:** డాక్టర్‌అగర్వాల్స్ ఐ హాస్పిటల్ మాతృ సంస్థ డాక్టర్ అగర్వాల్ హెల్త్‌కేర్ షేర్లు మంగళవారం స్టాక్ మార్కెట్లో లిస్ట్ అయ్యాయి. డిస్కౌంట్‌తో దలాల్ స్ట్రీట్‌లో ఎంట్రీ ఇచ్చి ఇన్వెస్టర్ల నిరాశపర్చాయి. ఇష్యూ ధర రూ.402 తో పోలిస్తే బిఎస్ఇలో 1.27శాతం డిస్కౌంట్ తో రూ.396 వద్ద ట్రేడింగ్ మొదలుపెట్టా యి. డాక్టర్ అగర్వాల్స్ హెల్త్‌కేర్ ఐపిఒ సబ్‌స్క్రిప్షన్ జనవరి 29న ప్రారంభ మై 31న ముగిసింది. ధరల శ్రేణి రూ.382-402గా కంపెనీ నిర్ణయించింది. గరిష్ట ధర వద్ద కంపెనీ రూ.3,027.26 కోట్లు సమీకరించాలనుకుంది. ఐపిఒలో భాగంగా రూ.300 కోట్లు విలువైన తాజా షేర్లు, ఆఫర్ ఫర్ సేల్ ద్వారా రూ.2,727.26 కోట్ల విలువైన షేర్లు జారీ చేసిం ది. రిటైల్ ఇన్వెస్టర్లు ఒక్క లాట్ కోసం రూ.14,070 వెచ్చించారు. ఈ పబ్లిక్ ఇష్యూ మొత్తం గా 1.55 రెట్ల సబ్‌స్క్రిప్షన్‌ను అందుకుంది. అయినప్పటికీ లిస్టింగ్‌లో మాత్రం రాణించలేక పోయింది. డిస్కౌంట్‌తో లిస్ట్ అయిన తర్వాత ఈ షేర్లు మరింత కుంగాయి. వాస్తవానికి 2010లో స్థాపించబడిన డాక్టర్ అగర్వాల్స్ హెల్త్ కేర్ ప్రజలకు దేశవ్యాప్తంగా కంటి ఆరోగ్యానికి సంబంధించిన అనేక సేవలను అందిస్తోంది. ఇదే క్రమంలో సర్జికల్ అండ్ నాన్ సర్జికల్, కంటి ఆరోగ్యానికి సంబంధించిన మందులు, లెన్స్ వంటి వాటిని కూడా విక్రయిస్తోంది. తాజా ఐపిఒ నుంచి సమీకరించిన మొత్తాన్ని కంపెనీ రుణాల చెల్లింపులకు, సాధారణ కార్పొరేట్ ప్రయోజనాల కోసం ఉపయోగించాలని నిర్ణయించింది.




## జిమ్నీ మేనియా బుకింగ్స్ నిలిపివేత

**జపాన్, ఫిబ్రవరి 4:** దేశీయ ప్రముఖ వాహన తయారీ సంస్థ మారుతి సుజుకి ఓ కీలక నిర్ణయం తీసుకుంది. తాజాగా జపాన్‌లో తీసుకొచ్చిన జిమ్నీ 5డోర్ వేరియంట్ బుకింగ్‌లను తాత్కాలికంగా నిలిపివేసింది. జపాన్‌లో మారుతీ జిమ్నీ బుకింగ్‌లను జనవరి 30 నుంచి ప్రారంభించింది. ఏప్రిల్ 3 నుంచి డెలివరీలు అందిస్తామని కంపెనీ పేర్కొంది. ఈ ఎస్‌యువి అక్కడి ప్రజల నుంచి మంచి డిమాండ్‌ను సొం తం చేసుకుంది. బుకింగ్‌లు ప్రారం భించిన నాలుగు రోజుల్లోనే 50వేల బుకింగ్‌లు సొంతం చేసుకుంది. డిమాండ్‌కు తగ్గ సరఫరా లేకపోవడం, వెయిటింగ్ పీరియడ్ పెరగడంతో బుకింగ్ లను తాత్కాలి కంగా నిలిపివేసింది. ఈ బుకింగ్‌లు ఎప్పుడు తిరిగి ప్రారంభించేదీ వెల్ల డించలేదు. జపాన్‌లో మారుతీ జిమ్నీ స్పీడ్ మాన్యువల్ వేరియంట్ ప్రారంభ ధర రూ.14.88 లక్షలు, ఏటీ వెర్షన్ ధర రూ.15.43 లక్షలుగా కంపెనీ నిర్ణయించింది. భారత్‌లో వీటి ధరలు రూ.12.74 లక్షలు, రూ.14.79 లక్షలుగా ఉన్నాయి. మహీంద్రా థార్ రాక్స్, ఫోర్స్ గుర్ఖా వంటి 5 డోర్ ఎస్‌యువిలకు జిమ్నీ పోటీ ఇస్తోంది.




# వాణిజ్యం

## టాటా కంపెనీ కొనుగోలుకు ఆర్‌బిఐ గ్రీన్ సిగ్నల్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:** టాటా గ్రూప్ ఆధ్వర్యంలో ఉన్న టాటా కమ్యూనికేషన్స్ పేమెంట్ సొల్యూషన్స్ లిమిటెడ్ (టిసిపిఎస్ఎల్)ను భారత్‌లోని ఆస్ట్రేలియాకు చెందిన ఫిన్‌టెక్ కంపెనీకి విక్రయించేందుకు రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆమోదం లభించింది. ఆస్ట్రేలియాకు చెందిన ఫైండీ ఆధ్వర్యంలోని భారతీయ అనుబంధ సంస్థ ట్రాన్సాక్షన్ సొల్యూషన్స్ ఇంటర్నేషనల్ (టిఎస్ఐ)కు టిసిపిఎస్ఎల్‌ను విక్రయించే ప్రణాళికలను ఆర్‌బిఐ ముందుంచారు. దాంతో తాజాగా వాటిపై ఆర్‌బిఐ నిర్ణయం తీసు కుంది. రూ.330 కోట్ల విలు వైన ఈ డీల్ వల్ల బ్యాంకింగ్ సేవలు అందుబాటులో లేని ప్రాంతాల్లో ఆర్థిక సేవలు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. నవంబర్ 2024లో ప్రకటించిన ఈ కొనుగోలు టిసిపిఎస్ఎల్ వైట్ లేబుల్ ఎటిఎం ప్లాట్ ఫామ్, ఇండికాష్ ఎటిఎంల నెట్‌వర్క్‌ను ఉపయోగించుకోవడానికి ఫైండీకి వీలు కల్పిస్తుంది. టిఎస్ఐ ప్రస్తు తం 7,500కు పైగా బ్రౌన్ లేబుల్ ఎటిఎంలకు బ్యాక్ ఎండ్ కార్యకలాపాలు అందిస్తోంది. ఈ కొనుగోలుతో ఫైండీ 4,600 ఆపరేషనల్ ఇండికాష్ ఎటిఎంలను తీసుకుం టుంది. మరో 3వేల ఎటిఎం పొందేందుకు ఫైండీకి అవకాశం లభి స్తుంది. ఫైండీ సిఇఒ దీపక్ వర్మ మాట్లాడుతూ భారత్‌లో ఆర్థిక సేవలను విస్తరించేందుకు ఈ కొనుగోలు ఉపయోగపడుతుందన్నారు. ఈ ఎటిఎంలను కంపెనీ ప్రస్తుత నెట్‌వర్క్‌తో అనుసంధానించడంతో బ్యాంకింగ్ సేవలు లేని మారుమూల ప్రాంతాల్లో ఆర్థిక సేవలు అందు బాటులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు జరు గుతున్నాయని చెప్పారు.




## జోరందుకున్న తయారీ రంగం

**ముంబై, ఫిబ్రవరి 4:** భారత తయారీ రంగం జనవరి నెలకు పటిష్టమైన వృద్ధిని నమోదు చేసింది. హెచ్ఎస్‌బిఐ ఇండియా తయారీ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పిఎంఐ) గత డిసెంబరులో 56.4 శాతంగా ఉంటే, 2025 జనవరి నెలలో 57.7కు దూసుకెళ్లింది. ఎగుమతులు 14 యేళ్లలోనే బలమైన వృద్ధిని చూపించడం ఇందుకు మద్దతుగా నిలిచినట్లు ఈ సర్వే అభిప్రాయపడింది. 50 పాయింట్లకుపైగా తయారీ పిఎంఐ నమోదు అయితే దాన్ని విస్తరణ గా, అంతకు దిగువకు పడిపోతే క్షీణతగా పరిగణిస్తుంటారు. 'భారత తయారీ పిఎంఐ ఆరు నెలల గరిష్ట స్థాయికి జనవరి లో చేసుకుంది. దేశీయ, ఎగుమతుల డిమాండ్ బలంగాఉంది. ఇది వృద్ధికి మద్దతు నిచ్చింది' అని హెచ్ఎస్‌బిసి ముఖ్య భారత ఆర్థిక వేత్త ప్రంజుల్ భండారీ తెలి పారు. తయారీ దారులకు కొత్త ఆర్డర్లలో వృద్ధి ఉన్నట్లు దీనికి అను గుణంగా తమ ఉత్పత్తిని పెంచుకుంటున్నట్లు పిఎంఐ సర్వే తెలిపిం ది. రానున్న కాలంలో 32శాతం సంస్థ లు వృద్ధి పట్ల సానుకూల అంచనాలతో ఉంటే, కేవ లం ఒకశాతం సంస్థలు క్షీణ తను అంచనా వేస్తున్నట్లు వెల్లడించింది.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps